ఆదివారం
గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్

: fb.com/vaartha Digital


Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-3-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 32 పేజీలు: 8+16 వెల: 6.50


యుద్ధంలో ఆయుధ సంపద ఆవిరి

5

యూట్యూబ్‌లో ప్రధాని మోడీకి 30 మిలియన్ల ఫాలోయర్లు



వార్- 4

మంగళవారం బీరూట్ దక్షిణ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిగిన ప్రదేశం నుండి భారీగా ఎగసిపడుతున్న పొగ

## హోరా హోరీ

### ఇరాన్‌లో 800 మందికి పైగా మృతి

**అమెరికా దౌత్యకార్యాలయాలపై ఇరాన్ క్షిపణి దాడులు**

**యుద్ధనౌకపై దాడిలో ముగ్గురు భారతీయులు మృతి**

**ఇరాన్ అధ్యక్షభవన కాంప్లెక్స్ ధ్వంసం చేసిన ఇజ్రాయెల్**

**1000కిపైగా నిలిచిపోయిన విమాన సర్వీసులు**

**చర్చలకు పిలుస్తున్నారు.. కానీ చాలా ఆలస్యమయిందన్న ట్రంప్**

అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరిస్తామంటున్న అగ్రరాజ్యాలు

**టెహ్రాన్ / టెల్‌అవీవ్ / వాషింగ్టన్, మార్చి 3:** అమెరికా ఇజ్రాయెల్ జాయింట్ ఆపరేషన్‌లో వందలకొద్దీ డ్రోన్లు, క్షిపణులు బాంబులతో ఇరాన్ నగరాలను టార్గెట్‌చేసి దాడులుచేస్తుంటే ఇరాన్‌కూడా తక్కువేమీ తినలేదంటూ పది గల్ఫ్‌దేశాల్లో ఉన్న అమెరికా ఎంబసీలను టార్గెట్‌చేసి దాడులుచేస్తోంది. తాజాగా ఇజ్రాయెల్ క్షిపణులు ఇరాన్ ఎయిర్‌పోర్టును టార్గెట్‌చేసి దాడులుచేస్తే ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ ఎయిర్‌పోర్టు లక్ష్యంగా దాడులుచేయడంతో ఉద్రిక్తతలు మరింతగాపెరిగి >>2

# పనితీరే గీటురాయి

6 నుంచి జూన్ 12 వరకు

**'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక'**

రాష్ట్రంలో శాఖల వారీగా 10 వివిధ థీమ్‌లలో 99 రోజుల కార్యక్రమం

కలెక్టర్ల సదస్సులో అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

7



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సిఎం రేవంత్

నిశితంగా గమనిస్తున్నా..

క్షేత్రస్థాయికి వెళ్లని కలెక్టర్లపై చర్యలు

బోగస్ ఉద్యోగులను సృష్టించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కొరడా

**అక్రమ మైనింగ్ జరిగితే కలెక్టర్, ఎస్పీ సస్పెన్షన్**

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి3:** ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆలోచనను, ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉందని కలెక్టర్లకు మార్గదర్శనం చేశారు. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయటంతో పాటు ప్రభుత్వ వ్యవస్థలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు.సచివాలయంలో మంగళవారం జరిగిన అన్ని జిల్లాల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అత్యంత బాధ్యతతో, ఫలితాలపై దృష్టి సారించి అమలు చేయాలని ఆదేశించారు. ఈ మూడు నెలలు ప్రతి కలెక్టర్ పనితీరుకు కొలమానమని, వారి సర్వీస్ కెరీర్‌కు పునాదిగా నిలుస్తుందన్నారు. ఐఏఎస్ సర్వీస్ దేశంలోనే అత్యున్నతమని, జిల్లా కలెక్టరుగా పని చేయడం ప్రతి అధికారికి ఒక గొప్ప అవకాశం అని అన్నారు. ప్రజలను నేరుగా కలిసే అధికారం, అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందని గుర్తుచేశారు. జిల్లాల్లో కలెక్టర్లు ప్రతి నెలా కనీసం 10 రోజులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని కలెక్టర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లనికలెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. >>2




మంగళవారం ట్యాంక్‌బండ్ వద్ద చంద్రగహణం దృశ్యం

# రాజ్యసభ రేసులో 16 మంది!

**జస్టిస్ సుదర్శన్ రెడ్డి 'పెద్దల సీటు' అడగడం లేదు..**

రాజకీయ లబ్ధికే పినరయ్ వ్యాఖ్యలు

**మాజీ మావోయిస్టులు కాంగ్రెస్‌లోకి వస్తామంటే వద్దనం**

**మీడియాతో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



మంగళవారం గాంధీభవన్‌లో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, మార్చి3, ప్రభాతవార్త:** భారతదేశ సమగ్రతకు ముప్పు కలిగించే దాయాది దేశం పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదనీ ఆపరేషన్ కగార్‌ను మేం తీవ్రంగా వ్యతిరేకించామని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేఖరులతో ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ నమ్ముకొన్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పని చేశారని కితాబు ఇచ్చారు.వాళ్ల సిద్ధాంతంతో మాకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయిప్రజల కోసం పోరాడిన వాళ్లపై గౌరవం ఉంటుందనీ ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెందిన మేమయినా, మావోయిస్టులు అయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామనీ స్వోత్కర్షలు చెప్పుకొన్నారు.లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే ఆహ్వానం పలుకుతామనీ మేం ఎవరిని పార్టీలోకి రావాలని అడగలేదనీ మమ్మల్ని ఎవరైనా అడగాలనీ అన్నారు.తెలంగాణ నుంచి రాజ్యసభ రేసులో 16 మంది ఉన్నారనీ వివరించారు.రాజ్యసభ సభ్యుల ఎంపిక కోసం ఢిల్లీ పిలుస్తామని అన్నారు ఢిల్లీకి పిలుస్తారా? ఫోన్లో చర్చిస్తామా సాయంత్రం నిర్ణయిస్తామనీ చెప్పారు.రాజ్యసభ సభ్యుల గురించి నిన్న 30 నిమిషాల చర్చ జరిగిందనీ వెల్లడించారు. సామాజిక వర్గాల వారిగా 16 మంది పేర్లను హైకమాండ్‌కు ఇచ్చామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంకు కృషిచేసిన సమర్థవంతమైన బిసిలు నలుగురు రాజ్యసభ అవకాశం ఇవ్వమని అడుగుతున్నారనీ బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు.రాష్ట్రం నుండి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా? అనేది రేపు తెలుస్తుందనీ,జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానాన్ని అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బిఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందనీ ఆయన ఆరోపించారు. తెలంగాణ కోసం పని చేసిన వాళ్ళలో ఒక్కరికైనా బిఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందా? అని ప్రశ్నించారు. కార్పొరేషన్ పదవులపైకసరత్తు జరుగుతోందనీ మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామనీ తెలిపారు. కేరళ సిఎం పినరయి విజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి సమాధానం చెప్పారనీ, రాజకీయలబ్ధికోసం కోసమేపినరయి విజయ్ మాట్లాడుతు న్నాడు, భవిష్యత్తులో కేరళలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనీ ధీమా వ్యక్తంచేశారు. జిల్లాలో డిసిసిఅధ్యక్షులతో సమన్వయంతో ఎమ్మెల్యేలు పనిచేసుకొని పోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. కొందరు >>2



నార్సింగి వద్ద కవితను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

## కవిత అరెస్టు

నార్సింగి పిఎస్‌కు తరలింపు

**మూసీలోని బడా నిర్మాణాలు కూల్చాలని ధర్నా**

**పేదల ఇళ్లే కూల్చుతారా?**

రేవంత్, రంగనాథ్ స్పందించాలి

**నార్సింగి, మార్చి 3 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చట్టాలన్నీ బడా బాబుల చుట్టాల్లా మారిపోయాయని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి వద్ద మూసీని ఆనుకొని నిర్మిస్తున్న బడా >>2

## శ్వేతపత్రం ఇవ్వండి

ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి..

**పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధికి 12 లక్షల కోట్లు ఇచ్చిన కేంద్రం**

**ముఖ్యమంత్రి రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ**



**హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈమేరకు ఒక బహిరంగ లేఖ రాసారు. 2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో ద్వారా 6 ప్రధాన గ్యారంటీలతోపాటుగా 420 హామీలను తెలంగాణ ప్రజలకు ఇచ్చిందని, ఈ హామీలను నమ్మిన తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మీరు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే, ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా గాంధీ రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మీరు మాట్లాడిన తీరును చూస్తుంటే, రాష్ట్ర ఖజానా నిల్ కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతుందన్నారు. 2014 లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తూ వస్తుందన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మరెన్నో మూలధన పెట్టుబడులు మొదలైనవాటి రూపంలో గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36,000 కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40,000 కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50,000 కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40,000 కోట్లకు పైగా నిధులు, రూ.12,000 కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14,000 కోట్లకు పైగా పీఎం కిసాన్ >>2

## స్కూళ్లలో 'వెల్‌కమ్ కిట్స్'

గురుకులాల్లో రెండు కిట్లు ఇవ్వనున్న సర్కార్

25 లక్షల మంది విద్యార్థులకు పంపిణి

**కిట్స్ సరకులు కొనుగోలు చేయనున్న ఎస్సీ గురుకుల సొసైటీ**



**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 3:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు పూర్తి ఉచిత విద్యను అందిస్తోంది. ఇకపై రాబోయే 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూల్స్, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు వెల్‌కమ్ కిట్స్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. గవర్నమెంట్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు సుమారు 10 వస్తువులతో వెల్‌కమ్ కిట్‌ను ఇవ్వనుండగా.. రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో చదివే విద్యార్థులకు రెండు వెల్‌కమ్ కిట్స్‌ను ఇవ్వనుంది. గురుకుల విద్యార్థులకు ఇచ్చే రెండు వెల్‌కమ్ కిట్స్‌లో ఒకటి స్కూల్‌లో ఉపయోగపడు వస్తువులు ఉండనుండగా.. రెండోది హాస్టల్ వస్తువులను ఇవ్వనున్నారు. స్కూల్, జూనియర్ కాలేజీ, గురుకులంలోని విద్యార్థులకిచ్చే కిట్‌లో బ్యాగ్, యూనిఫామ్, టై, షూస్, టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, పెన్, పెన్సిల్, ఇరేజర్, జామెంట్రీ బాక్స్ తదితర వస్తువులు ఇవ్వనున్నారు. ఇక గురుకులాల్లో ఉండే విద్యార్థులకు ఇచ్చే హాస్టల్ కిట్‌లో ట్రంక్ బాక్స్, ప్లేట్, గ్లాస్, బ్లాంకెట్, సోప్, హెయిర్‌ఆయిల్, మిర్రర్, దువ్వెన తదితర వస్తువులు ఇవ్వనున్నారు. ప్రభుత్వ స్కూల్స్, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, యుఆర్ఎస్ అన్నింటిలో కలిపి సుమారు 20 లక్షల మంది విద్యార్థులుంటారు. రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 1.80 లక్షల మంది విద్యార్థులు విద్యను >>2

## దుబాయ్‌లో చిక్కుకున్న హైదరాబాదీలు 2000

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి3:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం హైదరాబాద్ వాసులను భయాందోళనల్లో నెట్టేస్తోంది. దుబాయ్ విమానాశ్రయం మూసివేతతో పర్యాటకం, వ్యాపారాలు, ఉన్నత విద్య, వైద్యం కోసం వెళ్లిన వారిలో వేల సంఖ్యలో భారతీయులు అక్కడే చిక్కుకుపోయారు. అలా చిక్కుకుపోయిన వారిలో సుమారు 2వేల మంది హైదరాబాదీయులే ఉన్నట్లు ట్రావెల్ ఏజెన్సీలు పేర్కొంటున్నాయి. దీంతో ఇక్కడ ఉంటున్న వారి కుటుంబీకులు ఆందోళన రోజురోజుకు పెరుగుతోంది. అయితే, సోమవారం రాత్రి దుబాయ్ >>2



## టమోటాలు ఫ్రీ!

కొన్నిచోట్ల కిలో. రూ. 4 రూపాయలే!

**నెలన్నర నుంచి రోజూ తగ్గడమే!**

ఉచితంగా ఇచ్చేస్తున్న కొందరు, పారబోస్తున్న మరికొందరు..

కన్నీరే మిగిలిన రైతులు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** భారీగా పతనమైన టమాట ధరలు రైతులను కన్నీరు పెట్టిస్తూనే ఉన్నాయి. దాదాపు నెలన్నర రోజులుగా టమాట ధరలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ వారం లేదంటే వచ్చేవారమైనా ధర కాసింతైనా పెరగకపోదా..?, కూలీల ఖర్చు, రవాణా ఖర్చు అయినా రాకపోదా అని ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. నెలన్నర రోజులుగా రోజు రోజుకూ టమాట ధరలు మరింత పతనమవుతున్నాయే తప్ప కాసింత కూడా పెరగని పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నపళంగా టమాట ధరలు పడిపోవడం కోలుకోలేని దెబ్బతీస్తోంది. తాజాగా టమాట ధర మరింత పతనమైంది. మొన్నటి వరకు రూ.10దాకా పలికిన ధరలు ఇప్పుడు ఏకంగా కిలో రూ. 4గుకు పడిపోయింది. వ్యాపారులు కిలోకు 4 రూపాయలు కూడా పెట్టడం లేదు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ లో 25 కిలోల టమాట బాక్స్‌కు రూ. 80 నుంచి రూ.100 మధ్యన ధర పలుకుతోంది. 25 కిలోల టమాట బాక్స్ కు 100 రూపాయలు అంటే కిలో టమాటా 4 రూపాయల ధర పలుకుతుంది. పక్క రాష్ట్రాల నుంచి భారీగా దిగుబడులు వస్తుండడంతో కిలోకు రూ.5 కూడా రాకపోవడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు. కూలీలతో తెంపించి, తీసుకెళ్తే ఇటు కూలి పైసలు, అటు కిరాయి మీద పడ్తుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలతో తెంపించి, తీసుకెళ్తే ఇటు కూలి పైసలు, అటు కిరాయి మీద పడ్తుండడంతో టమాటాలను తోటల్లోనే వదిలేస్తున్నారు. కొందరు పశువులకు మేతగా వేస్తున్నారు. మరికొందరు ఫ్రీగా పంచుతున్నారు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి టమాట తోటలు సాగుచేశామని, తీరా రేటు పడిపోవడంతో పెట్టుబడుల మేరకు కూడా ఆదాయం రాక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి >>2



హోలీ సందర్భంగా మంగళవారం జైపూర్‌లో రాజస్థాన్ టూరిజం నిర్వహించిన సంబురాల్లో పాల్గొన్న ప్రజలు

# కవిత అరెస్టు

>> నిర్మాణంను కూల్చాలని డిమాండ్ చేస్తూ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ చట్టంను ఉల్లంఘిస్తూ నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు విన్నవించి నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేవన్నారు. మూసీలోనే కడుతున్న ఈ భవనంపై చర్యలు తీసుకోవాలని, బుల్డోజర్ తెచ్చి కూల్చాలని రంగనాథ్‌కు నేను ఫోన్ చేస్తే కలెక్టర్ వద్ద సమావేశం ఉందని చెప్పారన్నారు. ఖమ్మంలో భూదాన్ ల్యాండ్‌లో పట్టాలు పొంది రూ.15.లక్షల వరకు పెట్టి నిర్మించుకున్న 600.మంది పేదల ఇళ్లను అక్రమంగా కూల్చారన్నారు. గాంధీ సరోవర్ కోసం హైదర్షాకోట్ డివిజన్‌లో మూసీకి 30.మీటర్ల దూరంలో 20.ఏళ్ల క్రితం హెచ్ఎండిఏ అనుమతులు పొంది నిర్మించుకున్న మధు అపార్టుమెంట్ అక్రమం అయితే, నార్సింగిలో నడి మూసీలో కడుతున్న భవనం ఎలా సక్రమం అవుతుందో సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమీషనర్ రంగనాథ్‌లు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇది సక్రమం అయితే మధు అపార్టుమెంట్ ప్రజలకు ఇందులోనే ఇళ్లను కేటాయించాలని పేర్కొన్నారు. ఈ భవనంకు బీఆర్ఎస్ సర్కారు అనుమతిచ్చిందని, కాంగ్రెస్ రాగానే 6.నెలలు ఆపేశారని, ఆమ్యామ్యాలు ముట్టగానే పనులు ప్రారంభించారని ఆరోపించారు. హైడ్రా సంస్థలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు. ఖమ్మం బాధితులకు ఇళ్ల ఇవ్వాలని, మధుపార్కు అపార్టుమెంట్ వాసులకు ఎస్ఎఫ్‌టికి రూ.17.వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హైద్రాబాద్‌లో హైడ్రా పేరుతో ప్రజలను భయపెడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టున్న భూదాన్ ల్యాండ్‌లో పాతుకుపోయిన పెద్దలపై చర్యలు తీసుకోకుండా ఖమ్మంలోని పేదల ఇళ్లను రాత్రికి రాత్రే తొలగించడం దారుణమన్నారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఇక్కడికి వచ్చేంత వరకు మేమంతా ఇక్కడే కూర్చుంటామని కవిత స్పష్టం చేశారు. భవనం లోపలికి వెళ్లేందుకు యత్నించిన జాగృతి నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. కాపాడుకుందాం మూసీ నదిని, పరిరక్షించుకుందాం తెలంగాణ వనరులను అంటూ జాగృతి నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

నార్సింగిలోని మూసీ నదిని ఆనుకొని కడుతున్న భారీ భవంను ఎలా సక్రమం అవుతుందో హైడ్రా కమీషనర్ చెప్పాలని, లేదంటే బుల్డోజర్ తెచ్చి కూల్చాలని ధర్నా చేస్తున్న కవితను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి, సంఘటనా స్థలం నుంచి పోలీసు స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న మమ్మల్సిన పెద్దల ఒత్తిడితో అరెస్టు చేశారని కవిత ఆరోపించారు. అరెస్టులకు భయపడేది లేదని, హైడ్రా వచ్చి ఈ ఈ అక్రమ భవనంను కూల్చేంత వరకు జాగృతి తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ సర్కారు అక్రమాలు చేసే వారికి కొమ్ము కాస్తుందని ఆరోపించారు. హైడ్రా చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా పోరాడుతామని కవిత తెలిపారు.

# హైదరాబాదీలు 2000

>> ఎయిర్‌పోర్టును పునరుద్ధరించారు. భారత్‌కు వెళ్లే చైన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై విమానాలు టేకాఫ్ అయ్యాయి. హైదరాబాద్ ప్రయాణికుల కోసం ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ బోర్డింగ్ పాసులు ఇచ్చినా ఫ్లైట్‌ను రద్దు చేసింది. ప్రయాణికులను తిరిగి హోటల్‌కు తరలిస్తున్నట్లు ఓ ప్రయాణికుడు వెల్లడించారు. దుబాయి పర్యాటకం ప్రత్యేక అనుభూతిని కల్పించనుండటంతో నగరానికి చెందిన చాలా మంది టూరిస్టులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తారు. గతేడాది శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 5,23,107 మంది ప్రయాణించినట్లు సమాచారం. ఇందులో 50-60శాతం మంది టూరిస్టులే ఉండటం గమనార్హం. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రతీ రోజు 5-6 విమానాలు నేరుగా వెళుతుండగా, 15 వరకు కనెక్టింగ్ విమానాలున్నాయి. రోజుకు సగటున 1400-1500 మంది వెళ్తుంటారు. నగరంలో దాదాపు 1801 ట్రావెల్ ఏజెన్సీలున్నాయి. ఇందులో 123 పేరొందిన సంస్థలే ఉన్నాయి. గల్ఫ్‌లో యుద్ధం జరుగుతుండడంతో దుబాయికి వెళ్లేవారి సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు అంటున్నారు. దుబాయితో పాటు ఇతర దేశాల ప్రయాణాలకు కూడా ఎవరూ ఇష్టపడడంలేదని ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. మార్చిలో ప్రయాణించేందుకు ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న నగరవాసులు ఆందోళనకు లోనవుతున్నారు. యుద్ధ భయంతో అక్కడికి వెళ్లలేమని చెబుతూ డబ్బులు రీఫండ్ చేయాలని ట్రావెల్ ఏజెన్సీల చుట్టూ తిరుగాడుతున్నారు. దీంతో నిర్వాహకులు కొందరికి సర్దిచెబుతూ, వారు కోరిన విధంగా ఇతర తేదీల్లో ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తున్నారు. మరికొందరికి డబ్బులను రీఫండ్ చేస్తున్నారు. కాగా, డబ్బులు ఇవ్వలేని సంస్థలు వారికి మరికొన్ని ఇతర ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. దేశాలు, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లోని పర్యాటకాన్ని సంద ర్శించేందుకు వీలు కల్పిస్తున్నారు. మొత్తంగా ఇరాన్‌ఇజ్రాయెల్ నడుమ జరుగుతున్న యుద్ధం ప్రభావం అంతర్జా తీయ పర్యాటకంపై భారీగా పడిందని పలువురు ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు.

## ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడి

**టెహ్రాన్, మార్చి 3:** ఇరాన్ రాజధాని నగరం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. సోమవారం రాత్రి పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న పలు కీలక ప్రాంగణాలపై దాడులు జరిపామని, అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై బాంబులు జారవిడిచామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) తెలిపింది. ఇదే ఏరియాలోని ఇరాన్ మిలటరీ అధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థపైన, ఇతర మౌలిక సదుపాయాలపైన కూడా దాడి చేసినట్టు చెప్పింది. తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులను కోల్పోవడంతో ఇరాన్ సైతం ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ఇరాన్ డ్రోన్ ఒకటి మంగళవారంనాడు ఢీకొంది. దీంతో మంటలు చెలరేగాయి. అయితే స్వల్పనష్టమే జరిగినట్టు సౌదీ అరేబియా తెలిపింది. కువైట్‌లోని అమెరికా ఎంబసీని కూడా ఇరాన్ డ్రోన్ ఢీకొనడంతో తాత్కాలికంగా ఎంబసీని మూసివేశారు. ఇరాన్ దాడులపై అమెరికా ఇజ్రాయెల్‌లు మంగళవారంనాడు మరోసారి హెచ్చరికలు చేశాయి. సుదీర్ఘమైన దాడులకు తాము సిద్ధమని, తొలుత నాలుగు, ఐదు వారాలు అనుకున్నప్పటికీ అంతకంటే ఎక్కువ రోజులు కొనసాగించే సత్తా కూడా తమకుందని చెప్పారు.

# రాజ్యసభ రేసులో 16 మంది!

>> డిసిసిఅధ్యకులు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశారనీ ముఖ్యంగా ఎనిమిది జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు సహకరిం చడం లేదని డిసిసి అధ్యక్షులు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై దృష్టి పెట్టమని రాహుల్ గాంధీ నన్ను ఆదేశించారు వెంటనే ఎమ్మెల్యేలతో మాట్లాడాను అని ఆయన చెప్పారు. భారత ప్రధానమంత్రి మోదీ అమా యకుడైన రాహుల్ గాంధీని ఆడిపోసుకు న్నారనీ ఆవేదనచెందారు. మోదీ ఎప్స్టిన్ ఫైల్స్ లో అడ్డంగా దొరికిపోయాడనీ అన్నారు. మోదీ వ్యవహారంపై బిజెపి, ఆరెస్సెస్ సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు.

# 'వెల్‌కమ్ కిట్స్'

>> కొనసాగిస్తున్నారు. వివిధ గురుకులాల్లో కలిపి సుమారు 5 లక్షల మంది విద్యార్థులుంటారు. మొత్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులకు వెల్‌కమ్ కిట్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వెల్ కిట్స్‌ను పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమయ్యే జూన్ 1 నాటికే విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకిచ్చే వెల్‌కమ్ కిట్స్‌లోని వస్తువులను కొనుగులో చేసే బాధ్యతలను ఎస్సీ గురుకుల సొసైటీ ఇవ్వనున్నారు. సుమారు 25 లక్షల మంది విద్యార్థులకిచ్చే వస్తువులను పెద్దమొత్తంలో కొనుగోలు చేయనున్న నేపథ్యంలో తక్కువ ధరలకు వచ్చే అవకాశం ఉంటుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ బాధ్యతలను ఎస్సీ గురుకుల సొసైటీకి అప్పగించనున్నట్టు తెలిసింది. వెల్‌కమ్ కిట్స్‌లోపాటు ప్రభుత్వ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను కూడా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన కసరత్తును ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను ఎలా సరఫరా చేయాలనే సమాలోచనలు జరుపుతున్నారు. దగ్గర, దగ్గరగా ఉన్న స్కూల్స్, కాలేజీలకు ఒకోచోట నుంచి సరఫరా చేస్తే బాగుంటుందనే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది నుంచే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా పెట్టాలని నిర్ణయించింది. మధ్యాహ్న భోజనం అమలుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

**04-03-2026, బుధవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**ఫాల్గుణమాసం, ఉత్తరాయణం**
**శిశిర ఋతువు, కృష్ణపక్షం, శతభిషం కార్తె**
కృ.పాడ్యమి సా.4.53
పూర్వఫల్గుణి ఉ.7.39
వర్జ్యం : మ.3.03-4.42
దు.ఉ.11.57-మ.12.44
రాహుకాలం - మ.12.00-1.30

## వారాఫలం

**మేషం :** జీవితభాగస్వామి సహాయం అందుకుంటారు. అకౌంట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది.

**వృషభం:** పక్షపాత ధోరణితో వ్యవహరించా రన్న నిందలు ప్రచారంలో ఉంటాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మిథునం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు. ప్రముఖుల కలయిక.

**కర్కాటకం:** నూతన వరిశ్రమలు వ్యాపారాలు ప్రారంభిస్తారు. బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** ఉద్యోగులకు పదోన్నతుల సూచన, ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తిలేని ధోరణి అప్రశాంతతకు గురిచేస్తుంది.

**కన్య:** పారిశ్రామిక పెట్టుబడుల విషయమై చర్యలు ఊపందుకుంటాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. నూతన విద్యావకాశం.

**తుల:** సామరస్యమైన చర్చలు సాగించి అపోహలను దూరం చేసుకుంటారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**వృశ్చికం:** వ్యాపార సంబంధమైన కాగితాలు, డాక్యుమెంట్స్ మొదలైనవి చేతికందుతాయి. పాత ఋణాలు తీరుస్తారు. వస్త్రలాభం.

**ధనుస్సు:** మాటలను కటువుగా ఉపయో గించే వైఖరి ఆలోచించకుండా వెంటనే సమాధానం చెప్పడం వలన కొన్ని చేదు అనుభవాలు ఏర్పడతాయి.

**మకరం:** శుభకార్యాలు నిర్వహించటానికి అదృష్టం తోడవుతుంది. వాహనం కొనుగోలు యత్నాలు దాదాపుగా ఫలిస్తాయి.

**కుంభం:** కార్యాలయంలో మీ పనితీరును మరింతగా మెరుగుపర్చుకోగలుగుతారు. విదేశీ పర్యటనలు. శుభవార్తలు అందుకొంటారు.

**మీనం :** వ్యాపారస్థులకు సానుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. కొత్త వింత ఆలోచనలతో మీ మనస్సు వత్తిడికి లోనవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హోరాహోరీ

>> పోయాయి. ట్రంప్ వైఖటి రోజురోజుకూ మారుతోంది. యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందని భావించడంలేదని, రానున్న రోజుల్లో మరింత తీవ్రస్థాయి యుద్ధంచేస్తామంటూ చేసిన హెచ్చరికలు కూడా ఇరాన్ ఖాతరుచేయలేదు. సౌదీపై జరిపిన దాడుల్లో కేవలం అమెరికా స్థావరాలేకాకుండా బుర్జ్‌ఖలీఫ్ వంటి అత్యున్నతస్థాయి కట్టడాలతోపాటు అతిపెద్ద ఆయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీ ఆరామ్‌కోపైనా దాడులుచేయడంతో మొత్తం చమురుశుద్దిని నిలిపివేయడంతో ఇపుడు ప్రపంచ దేశాలకు చమురుసరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. మరోవైపు ఇజ్రాయల్ ఇటు ఇరాన్‌పై దాడులు చేయడంతోపాటు లెబనాన్‌పై దాడులు ఉధృతంచేసింది. సుమారు 70 కేంద్రాలు లక్ష్యంగా మంగళ వారం కూడా దాడులుచేసింది. బీరూట్ శివార్లలోని హారెట్‌హ్రీక్‌ప్రాంతంపై దాడిచేసింది. పాలస్తీనా ఇస్లామిక్ జీహాద్‌గ్రూపులు ఇజ్రాయెల్‌పై దాడులు ముమ్మరంచేయడంతో లెబనాన్ రాజధాని బీరుట్ టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులుచేసింది. ఈ దాడుల్లో లెబనాన్ విభాగం పిఐజె లెబనాన్ కమాండర్ అబూ హంజా రామిని ఖతంచేసినట్లు ఇజ్రాయెల్ మొసాద్‌ప్రకటించింది. అలాగే హెజ్బొల్లా అల్‌మనార్ టివి సంస్థపైనా ఇజ్రాయెల్ క్షిపణి దాడులుచేసింది. భనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కాగా దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటివరకూ 787 మంది చనిపోయారు. వీరిలో 176 మందిచ ఇన్నారులున్నట్లు ప్రకటించింది. మరోవైపు అమెరికా సైనికులు ఆరుగురు మరణించారు. ఖతార్‌సౌదీల్లో జరుపుతున్న ఇరాన్‌దాడుల్లో క్షిపణులను ఆదేశాలే కూల్చివేసినట్లుప్రకటించాయి. ఇదిలా ఉంటే మూడుదేశాల్లోను ఆయుధ సంపద కరిగిపోతోంది.కొత్త సామగ్రికి అమెరికా ఆర్డర్లు ఇచ్చింది. లఖీడ్ మార్టిన్ వంటి సంస్థలు యుద్ధ విమానాలుడ్రోన్లు సరఫరాచేస్తున్నట్లు తెలిసిందే. అలాగే యుద్ధంపై రోజుకు ఏడువేల కోట్లు ఖర్చవుతున్నట్లు అమెరికా సెంట్‌కామ్ అంచనావేసింది.

**ఇరాన్ అధ్యక్షభవనంపై దాడి**

ఇదిలాఉంటే టెహ్రాన్‌లోని ఇరాన్ అధ్యక్షభవనంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షంకురిపించింది. అత్యంత శక్తివంతమైన భద్రత ఉండే నాయకత్వ సముదాయంపై ఐడిఎఫ్ దళాలు భీకరదాడులుచేసాయి. ఇరాన్ అధ్యక్ష భవనం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీకౌన్సిల్ భవనాలు ధ్వంసం అయ్యాయి. 100 ఫైటర్‌జెట్‌లను వినియోగించి 250కిపైగా బాంబులను జారవిడిచామని ఐడిఎఫ్ వెల్లడించింది. ఇరాన్ అణుకార్యక్రమాలు, ఇజ్రాయెల్‌పై వ్యూహాలు ఇక్కడే అమలవుతాయని అందుకే ఇరాన్‌కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను దెబ్బతీయడమేలక్ష్యంగా ఈ దాడులుచేసినట్లు ప్రకటించింది. ఇకపై ఇరాన్‌లో అధ్యక్షభవనాలు ఉండవని ప్రకటించింది. ప్రెసిడెన్షియల్ కార్యాలయకాంప్లెక్స్, ఇరాన్‌సుప్రీం భద్రతా మండలిభవనాలతోపాటు ఇతర ప్రముఖుల భవనాలే లక్ష్యంగా ఈ దాడులుచేసామని, ఉగ్రవాద దేశంలో ఇక మతఛాందసవాదానికి తావుండకూడదని ఇజ్రాయెల్‌ప్రకటించింది. కాగా ఇప్పటివకు ఇరాన్‌లో 800 మందికి పైగా మరణించినట్లు సమాచారం.

**గగనతలం మొత్తం ఖాళీ**

ఇదిలా ఉంటే యుద్ధభయాలతో పది గల్ఫ్‌దేశాల్లోని గగనతలాలను ఆదేశాలు నిషేధం ఉత్తర్వులు జారీచేసాయి. అత్యంత రద్దీగా ఉన్న ఎయిర్‌పోర్టులు దుబాయి, అబూదాబి, దోహా వంటి ఎయిర్‌పోర్టుల్లోనే విమానాలు మొత్తం నిలిచిపోయాయి. ముందురోజు 3400 విమానాలు నిలిచిపోయాయని ప్రకటించిన వైమానికదళ అదికారులు తాజాగా మంగళవారం వెయ్యికిపైగా విమానాలు రద్దుచేసినట్లు ప్రకటించారు. యుఎఇ, ఖతార్, కువైట్, ఇజ్రాయెల్, బహ్రెయిన్, ఇరాక్, జోర్డాన్ వంటి నగరాల్లో కేవలం నామమాత్రపు సర్వీసులే నడిపించారు. ఎతిహాద్, ఖతార్ వంటి అంతర్జాతీయ సర్వీసులు మొత్తం నిలిపివేసారు. యూరోప్, ఆసియా, ఆఫ్రికా, అమెరికాలకువెళ్లే సర్వీసులకు వెళ్లే మార్గాలుమూసుకుపోయాయి. వేలాదిగాప్రయాణీకులు ఎయిర్‌పోర్టుల్లోనే చిక్కుకుపోయారు. ఫ్లైదుబాయి కొన్ని సర్వీసులు ప్రారంభించినా సమీప నగరాలకే పరిమితం అయ్యాయి. గల్ఫ్‌దేశాల్లో ఉన్న వారంతా సురక్షి తంగా ఉండాలని, ఇజ్రాయెల్‌నుంచి బ్రిటన్‌కు చేరుకునే విధంగా రిజిస్ట్రేషన్లుచేసుకోవాలని బ్రిటన్ పౌరవిమానయా నశాఖ సూచనలు జారీచేసింది. కెనడా కూడా యుఎఇ, దుబాయి వంటి గల్ఫ్‌దేశాలనుంచి వెంటనే ఖాళీచేసి వచ్చేయాలని ట్రావెల్ అడ్వయిజరీ జారీచేసింది. ఆస్ట్రేలియా అయితే అత్యవసర పోర్టల్‌ను రపారం భించింది. మధ్యప్రాచ్యదేశాల్లో ఉన్నవా రంతా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది.

**చర్చలకు పిలుస్తున్నారు.. ఆలశ్యం అయిపోయిందన్నా: .ట్రంప్**

ఇదిలా ఉంటే ఇరాన్‌లోని కొత్త నాయకత్వం చర్చలకు పిలుస్తున్నారని, అయితే ఇప్పటికే చాలా ఆలశ్యం అయిపోయిందని చెప్పానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ట్రూత్‌సోషల్‌మీడియాలోపోస్టుపెట్టారు. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థ, వాయుసే,, నావికాదళం మొత్తం తుడిచిపెట్టుకుపోఆయయని, ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించామని ఇపుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారని, చర్చలుజరిపేందుకు ప్రయత్నించినా టూలేట్ అని సమాధానం ఇచ్చానని ట్రంప్ తన పోస్టులో వివరించారు. అయితే ఇరాన్‌మాత్రం జాతీయ శ్రేయస్సు, దేశగౌరవానికి భంగం కలిగించని రీతిలో చర్చలు జరగాలని షరతులు పెట్టి చర్చలకు తాము సిద్ధమేనని ప్రకటించింది.

**అమెరికా,ఇజ్రాయెల్‌కు మద్దతిస్తాం**

ఇరాన్‌పైయుద్ధంలో అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతిస్తామని ఫ్రాన్స్,జర్మనీ, పాకిస్తాన్ దేశాలుప్రకటించాయి. ఇరాన్ గల్ఫ్‌దేశాలపై జరుపుతున్న దాడులు అంతర్జాతీయ నిబంధనలు ఉల్లంఘించడమేనని, అణ్వాయుధ తయారీని నిలిపివేసేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌లుచేసే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఈ దేశాల అధ్యక్షులు ప్రకటించారు. పాక్ ప్రధాని షరీఫ్ సైతం అమెరికాకు మద్దతిచ్చారు. అలాగే జర్మనీ అయితేయుద్ధంలో పాల్గొంటామని స్పందించింది. బ్రిటన్ మాత్రం తాము యుద్ధంలోప్రత్యక్షంగా పాల్గొనలేమనిప్రకటించింది. ఇదిలా ఉంటే ఇరాన్ యుద్ధనౌకపై చేసిన దాడిలోముగ్గురు భారతీయులు మరణించారు.

# శ్వేతపత్రం ఇవ్వండి

>> నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లకు పైగా నిధులు, విద్య క్రీడలకు రూ.21,000 కోట్లకు పైగా నిధులు, దాదాపు రూ.9,000 కోట్ల ఆరోగ్య సంరక్షణ నిధులు మొదలైనవి ఉన్నాయి. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించిందన్నారు. మరో రూ.60,000 కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి పత్తిని సేకరించింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ఇవ్వడమే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా దాదాపు రూ. 10 లక్షల కోట్ల ఋణాలను కూడా తెలంగాణ రాష్ట్రానికి అందించింది. వీటికి అదనంగా రాష్ట్రాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మూలధన పెట్టుబడి నిధుల కోసం రాష్ట్రాలకు 50 సంవత్సరాల కాలపరిమితితో కూడిన వడ్డీ రహిత ఋణాలను అందించి ఆయా రాష్ట్రాల అభివృద్ధికి అదనపు సహకారాన్ని అందించాలనే ప్రధానమంత్రి మోడీ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ పేరిట ఒక నూతన పథకాన్ని 2020-21 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిందన్నారు. అన్ని రాష్ట్రాలలాగే తెలంగాణ రాష్ట్రం కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రహిత ఋణాల మీద ఆధారపడటం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలాంటి దుస్థితిలో ఉందో తెలుస్తుందన్నారు. ఇవి మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వం గతంలో తీసుకున్న ఋణాలకు వడ్డీలు చెల్లించడానికి ఋణాలు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ఋణాలు, రైతు భరోసా నిధులకు ఋణాలు, సంక్షేమ పథకాల అమలుకు ఋణాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఋణాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేని పరిస్థితి నేడు తెలంగాణలో ఉంది. 2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత 10 యేళ్ల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోంది. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున పెరుగుతున్న రాష్ట్ర తలసరి అప్పు కూడా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.కాబట్టి, మార్చి16నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలన్నారు.



దుబాయ్ నుండి 149 మంది ప్రయాణికులతో మంగళవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఎయిర్ ఇండియా విమానం

# 'వెల్ డన్ మహేష్' అంటూ రాహుల్ కితాబు

**హైదరాబాద్,మార్చి 3,ప్రభాతవార్త:** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. శిబిరం ముగింపు కార్యక్రమంలో మహేష్ గౌడ్ చేసిన కృషిని ప్రశంసిస్తూ "వెల్ డన్ మహేష్" అంటూ కితాబు ఇవ్వడం సభలో చప్పట్ల వర్షం కురిపించింది. డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం నిర్వహణలో మహేష్ గౌడ్ స్వయంగా పాల్గొని, పది రోజుల పాటు అన్ని కార్యక్రమాలను సమన్వయం చేస్తూ దగ్గరుండి పర్యవేక్షించిన విధానం పార్టీ శ్రేణుల్లో స్ఫూర్తి నింపింది. శిబిరం ప్రతి రోజు కార్యక్రమాల రూపకల్పన నుంచి అమలు వరకు ఆయన చూపిన పట్టుదల, క్రమశిక్షణ నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ముగింపు కార్యక్రమం సందర్భంగా ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ మాట్లాడుతూ, మహేష్ పది రోజుల పాటు పూర్తిగా శిబిరానికి హాజరై ప్రతి సెషన్‌ను సమర్థంగా నిర్వహించారు" అని ప్రశంసించారు. వెంటనే స్పందించిన రాహుల్ గాంధీ "వెల్ డన్ మహేష్" అంటూ అభినందించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా మారింది... మొత్తంగా, మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరం పార్టీకి నూతన ఉత్సాహాన్ని అందించగా, రాహుల్ గాంధీ ప్రశంసలు ఆయన కృషికి మరింత గుర్తింపుగా నిలిచాయి.

# టమోటాలు ఫ్రీ!

>> రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్, మేడ్చల్ జిల్లాల వ్యాప్తంగా కూరగాయలు పండిస్తున్నారు. చేవెళ్ల, శంకర్ పల్లి, శంషాబాద్ తదితర ప్రాంతాలోన సంత కావడంతో పలు గ్రామాల రైతులు ఆటోలో టమాటాలు తీసుకొచ్చారు. వ్యాపారులు కొనేందుకు ముందుకు రాకపోవడంతో తిరిగి తీసుకెళ్లలేక అక్కడే తెచ్చిన ఆటోలో ఉచితంగా టమాటాలు పంచిపెట్టారు. మరికొందరు రోడ్డుపైనే పారబోశారు. హైదరాబాద్ నగర శివారు కందుకూరు సమీపంలో గల శ్రీశైలం రహదారిపై రైతులు భారీగా టమాటాలను కుప్పలుగా పారబోసి నిరసన వ్యక్తం చేశారు. పంటను కోయడానికి అయ్యే కూలీలు, మార్కెట్‌కు తీసుకెళ్లే రవాణా ఖర్చులు కూడా ఈ ధరతో రావడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇలా రోడ్డుపై పారబోస్తున్నామంటూ రైతులు కన్నీరుమున్నీరయ్యారు.

# పనితీరే గీటురాయి

>> కలెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు మదింపు చేసి తనకు నివేదికను అందించాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. నెలలో అయిదు రోజుల కంటే తక్కువగా పర్యటించిన కొందరు కలెక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఆషామాషీగా మీరు ఐఏఎస్ కాలేరు. ఐఏఎస్‌లు అందరూ కలెక్టరుగా పని చేయాలని కలలు కంటారు. అత్యున్నతమైన గౌరవముండే సర్వీసులో ఉన్నప్పుడు ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఆ ఉద్యోగానికి సార్థకత ఉంటుంది. క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తేనే మీరు కలెక్టర్లుగా కొనసాగుతారు. కలెక్టర్లుగా క్షేత్ర స్థాయిలో పర్యటించకపోతే ఎప్పటికీ మీకు ప్రజల సమస్యలు అర్థం కావు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే.. కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలి.' అన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు మార్చి 12న జిల్లా కేంద్రాల్లో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శాఖల వారీగా పది వారాల పాటు అమలు చేసే ప్రత్యేక కార్యాచరణ అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించాలని, సోలార్ విద్యుత్తును గ్రిడ్‌కు కనెక్ట్ చేసుకుంటే వచ్చే ఆదాయంపై ప్రచారం చేపట్టాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ల వినియోగంతో వచ్చే లాభాన్ని కూడా రైతులకు తెలియజేయాలన్నారు. అన్ని పాఠశాలలు, విద్యాలయాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేండ్లలోనే 62,749 ఉద్యోగ నియమాకాలు చేపట్టిందని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా మార్చే సంస్కరణలను అమలు చేస్తున్నామని, కార్పొరేట్ ఆసుపత్రులకు మించి మెరుగైన వైద్య ఆరోగ్య సేవలను అందించేలా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దే కొత్త మార్పులు తెస్తామన్నారు. కలెక్టర్లు అందుకు అవసరమైన సలహాలు సూచనలతో పాటు, తమ ఆలోచనలను పంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయని, ప్రతీ పాఠశాలలో ప్రతి రోజు ఒక్కో అధికారి మధ్యాహ్న భోజనం పర్యవేక్షించాలని, పిల్లలతో పాటు భోజనం చేసే బాధ్యతలు అప్పగించాలన్నారు. జిల్లా కలెక్టర్లు వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ఫుడ్‌పాయిజన్‌ఘటనలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. పాఠశాలలు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించదని, డీఈవోలతో పాటు అక్కడి కలెక్టర్లపై చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని కలెక్టర్లు గుర్తించాలన్నారు. వాళ్లకు ఇచ్చే పాలు,అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో ఎక్కడా రాజీ పడవద్దని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం తొలి రోజున జూన్ 12న రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించాలని, ఇప్పట్నుంచే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులను కూడా తరచుగా సందర్శించాలని, సమస్యలు రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని, నిరక్ష ్యం సహించబోమని హెచ్చరించారు. వైద్యంపై ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని, ఏటా సీఎంఆర్ ఎఫ్, ఆరోగ్య శ్రీకి దాదాపు రూ.2500 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. అంత ఖర్చు పెడితే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అద్భుతమైన సేవలను అందించే వీలుంటుందని చెప్పారు. భవిష్యత్ లో అన్ని మెడికల్ కాలేజీలతో ప్రభుత్వ హాస్పిటల్స్ ను అనుసంధానం చేస్తామన్నారు. త్వరలోనే సనత్ నగర్ టిమ్స్, అల్వాల్ టిమ్స్ వరంగల్ ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయన్నారు. సర్జరీలు చేసే డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్లు ఇవ్వటంతో పాటు అడ్మినిస్ట్రేషన్ను, డాక్టర్ల సేవలను విభజించే ఆలోచన ఉందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తుందని సీఎం చెప్పారు. బోగస్ ఉద్యోగులను సృష్టించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల విషయంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎం హెచ్చరించారు. రాష్ట్రంలో దాదాపు 1.70 లక్షల మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులుంటే, అందులో దాదాపు 25 వేల మంది కనీసం ఆధార్ కార్డు లేకుండా బోగస్ ఉద్యోగులుగా ఇంతకాలం జీతాలు తీసుకున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ దందాకు పాల్పడ్డ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పదేండ్లుగా ప్రభుత్వాన్ని మోసం చేసి వీరి పేరిట జీతాలు పొందిన ఏజెన్సీలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామన్నారు. జీతాల పేరిట గత పదేండ్లుగా చేసిన దుర్వినియోగంపై కేసు నమోదు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో ప్రభుత్వం సేకరించిన ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని మిల్లర్ల నుంచి తిరిగి రాబట్టుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని సీఎం అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.3900 కోట్ల విలువైన బియ్యం మిల్లర్ల దగ్గరే ఉందని, వాటిని రికవరీ చేసేందుకు కేసులు పెట్టి వసూలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కొన్ని జిల్లాల్లో ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు సమాచారం వస్తుందని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే చర్యలను సహించేది లేదని, ఎక్కడ ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్ జరిగినట్లు తెలిస్తే వెంటనే ఆ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని సస్పెండ్ చేస్తామని సీఎం హెచ్చరించారు. భూభారతి దరఖాస్తులన్నీ గడువులోగా పరిష్కరించాలని, అక్రమాలుజరిగితే వెంటనే గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ ఆఫీసులకు సొంత భవనాలుండాలని, వివిధ ప్రాజెక్టులు,రీజనల్ రింగ్‌రోడ్డు, ఫ్యూచర్‌సిటీ, మామునూర్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులు, ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.తెలంగాణ రైజింగ్ విజన్ అమలులో జిల్లా కలెక్టర్లు నూటికి నూరు శాతం తమ భాగస్వామ్యం పంచుకోవాలని పిలుపునిచ్చారు. 'ఈ ప్రభుత్వం మిమ్మల్నినిశితంగా గమనిస్తుంది. మీరు మంచిపనిచేస్తేమిమ్మల్ని అభినందిస్తుంది వార్షిక పర్ఫామెన్స్ రిపోర్ట్ ఆధారంగా మీ పనితీరుకు అవార్డులు, రివార్డులుంటాయి. జూన్‌లో కలెక్టర్ల పనితీరుపై మరోసారి సమావేశం నిర్వహిస్తాం'అని సీఎం చెప్పారు.

# పాల ఉత్పత్తికి రూ.2 వేల కోట్లు

- కేంద్రం రూ.89 కోట్లు పెట్టుబడి
- సబ్సిడీపై కొత్తగా ఆవుల పంపిణీ పథకం
- విజయ డెయిరీ 6 లక్షల లీటర్లకు విస్తరణ
- కరీంనగర్ డెయిరీ బలోపేతం
- సేకరణ ధర రూ.48 నుండి రూ.51కి పెంపు
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ



హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: తెలంగాణలో పాల ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్ర సర్కార్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. గుజరాత్ తరహా పాడి పరిశ్రమ అభివృద్ధి నమూనాలను అమలు చేయడం దీని ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. పాల ఉత్పత్తిలో గుజరాత్ మోడల్‌ను అనుసరించి, పాడి పరిశ్రమను, పశువుల పెంపకందార్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో 2 వేల కోట్ల వ్యయంతో పాల ఉత్పత్తిని పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ కార్యాచరణలో భాగంగా సబ్సిడీపై ఆవుల పంపిణీ, పాడి పశువుల యజమానులకు ప్రోత్సాహకం వంటి చర్యలు చేపడుతోంది. అలాగే విజయ డెయిరీ సేకరణను రోజుకు 6 లక్షల లీటర్లకు పెంచడం, కరీంనగర్ డెయిరీ వంటి సంస్థల బలోపేతం చేయనుంది. రాష్ట్రంలో ఆవుల సంఖ్య తగ్గిపోవడంతో, ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీపై ఆవులను పంపిణీ చేసే కొత్త పథకాన్ని తీసుకువస్తోంది. తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ రోజువారీ పాల సేకరణను 4.4 లక్షల లీటర్ల నుండి 6 లక్షల లీటర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకుగాను వచ్చే మూడు, నాలుగేళ్లలో 400 నుండి 500 కొత్త విజయ డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు, పాల సేకరణ ధరల పెంపును కూడా చేపట్టనుంది. విజయ డెయిరీ ఇప్పటికే పాల ధరలను పెంచగా, బర్రె పాల ధరను లీటరుకు రూ.48 నుండి రూ. 51కి పెంచే ప్రతిపాదన ఉందని అధికారవర్గాల నివేదికలు వెల్లడిస్తున్నాయి. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ పథకం కింద దాదాపు రూ.89 కోట్ల ప్రాజెక్టులతో రాష్ట్రంలో పాల సేకరణ మరియు నాణ్యతను పెంచేందుకు కేంద్ర సహాయంతో చర్యలు చేపడుతోంది. సబ్సిడీ ప్రాతిపదికన అమలు చేయనున్న ఈ పథకంలో భాగంగా ఆవు కొనుగోలు, వాటి నిర్వహణ ఖర్చును యూనిట్‌గా లెక్కించాలని నిర్ణయించింది. ఇందుకయ్యే ఖర్చులో సగం రైతులు భరించాల్సి ఉండగా, మిగిలిన సగం ప్రభుత్వం భరించనుంది. పశుసంవర్ధక శాఖ ప్రతిపాదనల ప్రకారం, ఈ పథకం హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో అమలు చేయబడుతుంది. మొత్తంగా మూడు సంవత్సరాల కాలంలో ప్రతి జిల్లాలో 830 మంది రైతులకు ప్రతి సంవత్సరం రెండు ఆవులను అందిస్తారు. దీని కోసం, రాష్ట్ర వ్యాప్తంగా 79,680 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతారు. సంవత్సరానికి 26,560 మంది, మూడు సంవత్సరాల కాలంలో ఎంపిక జరుగుతోంది. ఆవులను కొనుగోలు చేయడం నుండి వాటికి ఆహారం ఇవ్వడం వరకు అన్ని ఖర్చులు ఆవు ఖర్చుతో సహా యూనిట్‌కు రూ.2,51,000గా అంచనా వేయబడతాయి. ఈ మేరకు ఈ పథకం అమలుకు ఏటా రూ.667.98 కోట్లు ఖర్చవుతుందని, మూడేళ్ల కాలంలో రూ.2,003 కోట్లు అవసరమవుతాయని పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, యూనిట్ ఖర్చులో సగం లబ్దిదారులు భరించాల్సి ఉన్నందున, వారు చెల్లించే వాటాను తగ్గించి, రూ.1,000 కోట్ల ప్రభుత్వ నిధులతో మూడేళ్ల కాలంలో 1.6 లక్షల ఆవులను రాష్ట్రంలోని పశు పెంపకందార్లకు అందించవచ్చని ప్రతిపాదించారు. ఈ పథకం అమలు ద్వారా పాల ఉత్పత్తి లక్ష్యం మరింతగా సాధించబడుతుందని అధికారులు చెబుతున్నారు.

## ఓపక్క యుద్ధం మరోపక్క భూకంపం

టెహ్రాన్, మార్చి 3: అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్త ఆపరేషన్‌తో ఇరాన్‌పై మూకుమ్మడి దాడులు ఓవైపు పెంచుకుంటూ పోతుంటే మరోపక్క ఇరాన్‌కు భూకంపం సంభవించి మరో షాక్ తగిలింది. ఇరాన్‌లోని గరాష్‌ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 4.3గా రికార్డయింది. ఉదయం 10.24 గంటల ప్రాంతంలో ప్రకంపనలు ఏర్పడ్డాయి. గరాష్ సిటీకి నైరుతి దిశగా ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా భూగర్భసర్వేకేంద్రం తెలిపింది. సుమారు పది కిలోమీటర్ల లోతున టెక్టానిక్ ప్లేట్లలో భూమి కంపించింది. ఇరాన్, అరేబియా, యూరేసియా ప్లేట్ల ఘర్షణతోనే ఈ భూకంపాలు సంభవించాయి. ఇరాన్‌లో వచ్చిన ఈభూకంప ప్రాంతం గ్రామీణ ప్రాంతం కావడం గమనార్హం.

## తిరుపతిలో ప్రధాని మోడీ సోదరుడు ప్రహ్లాద్ మోడీ

**తిరుపతి,మార్చి 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీ తిరుపతికి విచ్చేశారు. తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్ వద్దకు చేరుకున్న ఆయనకు తిరుపతి బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, పార్థసారథి, శ్రీనివాసులు, సింగంశెట్టి సుబ్బరామయ్య, తిరుత్తని వేణుగోపాల్, నాగరాజు తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

## తిరుపతి జనాభాగణన ప్రక్రియ ప్రతిష్టాత్మకం

తిరుపతి,మార్చి 3 ప్రభాతవార్త ప్రతినిధి: జనాభాగణన 2027 ప్రక్రియ తిరుపతి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించడం జరగాలని తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం డిజిటల్ విధానంలోనే తొలుత ఇల్లు లెక్కింపు, ఆ తరువాత జనాభా లెక్కిం పు చేయాలన్నారు. మొదటి విడతలో చేపట్టే ఈ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులు మంగళవారం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రకాశంభవన్‌లో ప్రారంభమయ్యాయి.



## మంత్రి సీతక్కతో మంచు లక్ష్మి భేటీ

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ప్రముఖ సినీ నటి, టీచ్ ఫర్ చేంజ్ ట్రస్ట్ ఫౌండర్ మంచు లక్ష్మి ్ర కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనకు చేయూతగా తమ సంస్థ ఈ నెల 27న నిర్వహించే కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి సీతక్కను మంచు లక్ష్మి కలిశారు. తాను స్థాపించిన ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. పేద విద్యార్థుల చదువుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు మంచు లక్ష్మిని సీతక్క అభినందించారు.

## 5న తిరుమలకు కవిత

### కాలినడకన కొండపైకి

హైదరాబాద్, మార్చి3 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. కేసు నుంచి విముక్తి లభించడంతో స్వామివారికి మొక్కు చెల్లించుకోవాలని ఆమె నిర్ణయించు కున్నారు. ఇందులో భాగంగా కాలినడకన అలిపిరి మెట్ల మార్గం గుండా తిరుమల కొండకు చేరుకోవాలని సంకల్పించారు. ఈ నెల 5వ తేదీన కవిత తిరుపతికి చేరుకుంటారు. అదే రోజు సాయంత్రం అలిపిరి నుంచి కాలినడకన కొండపైకి వెళ్లనున్నా రు. రాత్రికి తిరుమలలోనే బస చేసి, ఆ మరుసటి రోజు అంటే 6వ తేదీన ఉదయం శ్రీవారిని దర్శించుకుని తన మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీబీఐ సరైన ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ కవితతో పాటు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి విముక్తుల్ని చేసింది. ఈ కేసులో కవిత దాదాపు 6 నెలల పాటు తీహార్ జైలులో ఉన్నారు. కవిత తిరుమల పర్యటన కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనాలకే పరిమితం కాదని, దీని వెనుక రాజకీయ ప్రాధాన్యత కూడా ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. శ్రీవారి దర్శనం అనంతరం ఆమె తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై ప్రకటన చేసే అవకాశం ఉందని సమాచారం. రానున్న రెండు నెలల్లో పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు ఇప్పటికే స్పష్టం చేశారు. జాగృతి ద్వారా ప్రజల్లో చురుగ్గా ఉంటూ రాజకీయ కార్యాచరణను వేగవంతం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.

## పశ్చిమాసియా ఘర్షణల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి

న్యూఢిల్లీ, మార్చి 3: పశ్చిమాసియా ఘర్షణలో ఇప్పటి వరకూ ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడినట్టు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ మంగళవారం నాడు తెలిపింది. అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ సైనిక చర్యలు తీవ్రమవుతుండటంతో ప్రధానమైన వాణిజ్య మార్గాల్లో అంతరాయం కలుగుతోం దని పేర్కొంది. వాణిజ్య నౌకలపై నాలుగు దాడి ఘటనలు జరిగినట్టు సమాచారం ఉంది. ముగ్గురు నావికులు మృతి చెందగా, ఒక నావికుడు గాయపడ్డారు. వీరంతా విదేశీ జెండాలున్న నౌకల్లో సేవలందిస్తున్నారని డీజీఎస్ తెలిపింది. కీలక వాణిజ్య మార్గాలైన గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జల సంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను నిశితంగా గమని స్తున్నామని, ఆయా మార్గాల్లో భద్రతను కచ్చితంగా దృష్టిలో ఉంచుకోవాలని షిప్పింగ్ ఆపరేటర్లకు సూచనలిచ్చామని పేర్కొంది. అనుమానాస్పద కార్యక్రమాలపై వెంటనే రిపోర్ట్ చేయాలని కోరినట్టు తెలిపింది. వాణిజ్య నౌకలు, సిబ్బందిపై దాడులు పెరుగుతున్నందున ప్రమాదం ఎక్కువగా ఉన్న రూట్లను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 200కు పైగా నౌకలు ఆ రూట్లకు దూరంగా ఉండటం, లంగరు వేసి ఉంచడం జరుగుతోంది. ఇప్పటి వరకూ రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమెన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటున్నట్టు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ తెలిపారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయ నావికులకు తక్షణ సాయం, భారత్ తరలింపున ప్రత్యేక ప్రతిస్పందన బృందా న్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సిబ్బంది కుటుంబాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాల్సిందిగా షిప్పింగ్ కంపెనీలకు సూచించామని వివరించారు.

## నాబార్డుకు సర్కార్ బకాయి రూ.7.39 లక్షల కోట్లు

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు)కు ప్రభుత్వ రుణ భారం తలకు మించిన భారంగా తయారయింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల భరీగా పెరుగుతుండటం పట్ల నాబార్డు ఆందోళన చెందుతోంది. తలసరి ఆదాయం పెరిగినంత వేగంగా రుణం కూడా భారీగా పెరుగుతోందని వెల్లడించింది. నాబార్డు విడుదల చేసిన రాష్ట్ర ఫోకస్ పేపర్‌లో ఆర్థిక విషయాలను గూర్చి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. 2014-15లో రుణ భారం రూ.72,658 కోట్లు ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 7,38,707 కోట్లకు చేరింది. రాష్ట్ర తలసరి ఆదాయం పదేళ్లలో అంటే 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.1.24 లక్షల కోట్లు ఉండగా, 2024-25 ఆర్థికానికి అది రూ.3.79 లక్షల కోట్లుకు భారీగా పెరిగింది. మరోపక్క 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర గ్రాస్ డొమేస్టిక్ ప్రొడక్టవిటీ (జిఎస్‌డిపి) ప్రస్తుత ధరల వద్ద రూ.16.41 లక్షల కోట్లు కాగా, నిరంతర ధరల వద్ద దాని వృద్ధి 8 శాతం దాటింది.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

### మరో విద్యార్థికి గాయాలు

ఎల్.బి.నగర్,మార్చి 3 ప్రభాతవార్త: వాహనం నడిపి డివైడర్‌కు ఢీకొట్టడంతో ఓ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థికి గాయాలయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ సోమవారం పరీక్ష రాసిన అనంతరం ముగ్గురు విద్యార్థులు ఒకే వాహనంపై వేగంగా వెళుతుండగా జరిగిన ప్రమాదం నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం ఆర్కే పురంలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విష్ణువర్ధన్(17), ఉషాకిరణ్, మణిదీపులు స్నేహితులు. ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాక్స్ పరీక్ష సోమవారం పూర్తయిన అనంతరం స్నేహితుడికి చెందిన ద్విచక్రవాహనంపై ముగ్గురు కలిసి ఒకే వాహనంపై బయలుదేరారు. మణిదీప్‌ను హయత్‌నగర్‌లో దింపి నాగోల్ నుంచి వస్తున్నారు. ఫత్తులగూడ రోడ్డు వద్దకు వచ్చిన అనంతరం విష్ణువర్ధన్‌కు డ్రైవింగ్ నేర్పిస్తానని ఉషాకిరణ్ వాహనం ఇచ్చాడు. డ్రైవింగ్ సరిగా రాకపోవడంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు గాయాలు కావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలు!

### నేటి నుంచి ఇంటర్ సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

### 16 కేంద్రాల్లో మూల్యాంకనం.. మూడు విడతల్లో పూర్తి

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 03៖ తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 6న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు ప్రణాళికలను సిద్ధం చేసంది. ఇప్పటికే ఇంటర్ విద్యార్థులకు లాంగ్వేజెస్ పరీక్షలు ముగియడంతో.. నేటి (బుధవారం) నుంచి సంస్కృతం మూల్యాంకనాన్ని ప్రారంభించాలన్ని నిర్ణయించింది. ఈ నెల 15 నుంచి మూడు విడతల్లో ముగించి, 20న మూడు విడత మూల్యాంకనాన్ని ప్రారంభించి, 27లోపుగా మొత్తం ముగించడానికి ఇంటర్ బోర్డు ప్లాన్ సిద్ధం చేసుకుంది. ఈ నెల 27తో మూల్యాంకనం ముగిసిన అనంతరం వారం రోజులపాటు మూల్యాంకన అనంతరం ప్రక్రియను పూర్తి చేసి ఏప్రిల్ 6న ఫలితలను విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ఇంటర్ ఫలితాలను ఇడుదల చేసి.. మే చివరినాటికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను, ఫలితాలను కూడా పూర్తి చేయడానికి ఇంటర్‌బోర్డు పక్కా ప్రణాళికనను సిద్ధం చేసుకుంది. జూన్ 1 నుంచి 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధించే లెక్చరర్లు ఇతర పనుల్లో ఉండకుండా విద్యా సంవత్సరం ప్రారంభించేలాగా చర్యలు తీసుకుంటోంది. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా నాలుగు రోజుల పాటు లాంగ్వేజెస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమ వారం నుంచి సబ్జెక్టు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే లాంగ్వేజెస్ పరీక్షలు ముగియడంతో సంస్కృతం పేపర్-1, పేపర్-2 జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఎక్కువ మంది విద్యార్థులు సంస్కృతం పరీక్షను రాస్తున్న నేపథ్యంలో ప్రతి ఏడాది మాది రిగానే ఈ ఏడాది కూడా ముందుగానే సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనాన్ని నేటి నుంచి ప్రారంభించనున్నారు. ఇక మిగిలిన పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించి 20 వరకు మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎంపిఎంలో కేవలం ఒకేషనల్ విద్యార్థుల మూల్యాంకనాన్ని కొనసాగిస్తూ.. మైనర్ మీడియం విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మహబూబియా కాలేజీలో నిర్వహించడానికి ఇంటర్ బోర్డు నిర్ణయించిది.

## గ్రహణంతో ఉదయం ఆలయం మూసివేత, రాత్రి పునఃప్రారంభం

### - యధావిధిగా భక్తులకు సర్వదర్శనాలు

**తిరుమల,మార్చి 3ప్రభాతవార్తప్రతినిధి:** పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేసిన అధికారులు ,గ్రహణం వీడటంతో రాత్రి 7.30గంటలకు ఆలయాన్ని తెరచి శుద్దిచేసి భక్తులను దర్శనానికి అనుమతించారు.మంగళవారం ఉదయం 9 గంటలకు ఆలయాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు అత్యంత భద్రతతో ఆలయంలోపల తొలుత బంగారువాకిలి ద్వారాలు, వరుసగా వెండివాకిలి ద్వారాలు, చివరగా మహద్వారం తలుపులు మూసివేశారు. ఆలయం మూసివేసే అర్ధగంట ముందువరకు వైకుంఠమ్ కంపార్టుమెంట్ క్యూలైన్‌ల లో ఉన్న ప్రతి భక్తుడికి దర్శనం చేయించారు. ఆలయ మూత సమయంలో తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, లడ్డూ విక్రయ కేంద్రాలు కూడా మూసివేశారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం వరకు తిరుమలలోని అన్ని చోట్ల పులిహోర ప్యాకెట్లు అందుబాటులో ఉంచి పంపిణీ చేశారు. రాత్రి గ్రహణం వీడటంతో 7.30గంటలకు ఆలయ శుద్ధి, పుణ్యాహావచనం చేసి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించారు. ఉదయం వరకు 13వేలమంది భక్తులకు దర్శనం చేయించారు.

## సకల ఏర్పాట్లతో కుమారధార తీర్థ ముక్కోటి

### మధ్యాహ్నం వరకే అనుమతించిన టిటిడి



**తిరుమల, మార్చి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం పౌర్ణమివేళ మంగళవారం ఉదయం కుమారధారతీర్థముక్కోటి వేడుకలు అత్యంత భద్రత నడుమప్రశాంతంగా ముగి శాయి. ఈ కుమారధారతీర్థానికి ఉద యం 5గంటల నుండి భక్తులను మధ్యాహ్నం 12గంటల వరకే అనుమతించిన అధికారులు సకల ఏర్పాట్లు చేశారు.పాపవినాశనం వరకు పూర్తిగా ఆర్టీసి బస్సుల్లోనే యాత్రికులను చేరవేశారు. అక్కడ నుండి అటవీమార్గంలో యాత్రికులను అనుమతించి అక్కడ పవిత్ర స్నానాలు చేసుకునేలా చక్కటి ఏర్పాట్లు చేశారు. మార్గమధ్యంలో యాత్రికులకు తాగునీరు, అన్నప్రసాదాలు అందించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వయం పర్య వేక్షణలో పోలీసులు, విజిలెన్స్,అటవీశాఖ చక్కటి ఏర్పాట్లు చేసి చిన్నపాటి అసౌకర్యం కలగకుండా చూశారు. కాగా తిరుమల పవిత్ర పుష్కరిణిలో నేటి నుండి భక్తులను స్నానాలకు అనుమతిస్తారు.

## రాజ్యసభ బరిలో నితిన్ నబీన్

### 9 మంది అభ్యర్థులతో బిజెపి తొలి జాబితా విడుదల



న్యూఢిల్లీ, మార్చి 3: రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ తమ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను బీహార్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు నామినేట్ చేసింది. ఈ మేరకు ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ బిజెపి ప్రకటన విడుదల చేసింది. నితిన్ నబిన్‌తో పాటు మరో ఎనిమిది మంది పేర్లను బీజేపీ ప్రకటించింది. బీహార్ నుంచి నితిన్ నబిన్‌తో పాటు శివేశ్ కుమార్ ఉన్నారు. అసోం నుంచి తెరాశ గోవాలా, జోగెన్ మోహన్, ఛత్తీస్‌గఢ్ నుంచి లక్ష్మీ ్రవర్మ, హర్యానా నుంచి సంజయ్ భాటియా, ఒడిశా నుంచి మన్మోహన్ సమాల్, సుజిత్ కుమార్, పశ్చిమ బెంగాల్ నుంచి రాహుల్ సిన్హా ఉన్నారు. 10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. 10 రాష్ట్రాలలోని ఆరింటిలో బిజెపి లేదా మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయి. దీంతో బిజెపి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోనుంది. రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న రాష్ట్రాలు మహారాష్ట్ర (7), తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), బీహార్ (5), ఒడిశా (4), అసోం (3), తెలంగాణ (2), ఛత్తీస్‌గఢ్ (2), హర్యానా (2), హిమాచల్ ప్రదేశ్ (1) ఉన్నాయి.

## సారీ డాడీ... పిల్లలతో కలిసి పైకి వెళ్తున్నా..

### పసిబిడ్డలను చంపి తల్లి ఆత్మహత్య... బీబీనగర్‌లో విషాదం

బీబీనగర్, మార్చి 3 ప్రభాతవార్త: యాదాద్రి భువనగిరి జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కన్నబిడ్డలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లి.. వారినే పొట్టన పెట్టుకుని, అనంతరం తాను కూడా బలవన్మరణానికి పాల్పడిన ఘటన జిల్లా ప్రజలను షాక్‌కు గురిచేసింది.బీబీ నగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల ఐశ్వర్య(28) తన పది నెలల పసికందు కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఝాన్సీలను దిండుతో నులిమి హతమార్చి, అనంతరం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సూసైడ్ లెటర్‌లో సంచలనం.. తన మరణానికి భర్త మేకల మహేష్, అత్తమామలు మేకల నరసింహ్మా, సత్యమ్మ, ఆడపడుచులు మర్రి కవిత (ఉమా), కావటి అనిత (లావణ్య) కారణమని ఐశ్వర్య సూసైడ్ లెటర్‌లో పేర్కొంది .నా చావుకు కారకులైన వారు జైలులో ఉంటేనే నా ఆత్మకు శాంతి అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. తన పిల్లలకు కనీసం బట్టలు, ఖర్చులు కూడా భర్త ఇవ్వలేదని, పెళ్లి సమయంలో ఇచ్చిన ఐదు లక్షల రూపాయల నగదు, బంగారు నగల విషయమై కూడా వివాదాలు ఉన్నాయని లేఖలో ప్రస్తావించింది. సారీ డాడీ.. నన్ను క్షమించు అంటూ తండ్రికి చివరి లేఖ. నా పిల్లలు లేక నేను ఉండలేను. వాళ్లు నాతోనే వచ్చారు.. నాతోనే తీసుకెళ్తా.. మళ్లీ జన్ముంటే నీ కొడుకుగా పుట్టి రుణం తీర్చుకుంటా.. అంటూ తండ్రిని ఉద్దేశించి రాసిన మాటలు చదివిన వారిని కన్నీరు పెట్టిస్తున్నాయి. తనను పిల్లలను ఒకే చోట రాగిచెట్టు కింద సమాధి చేయాలని కూడా తన చివరి కోరికగా పేర్కొంది. దాంపత్య జీవితం కలహాలే కారణమా? 2020లో వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన ఐశ్వర్య, గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేష్‌తో వివాహం జరిగింది. మహేష్ రైల్వే ఉద్యోగి. వివాహం తరువాత కొంతకాలం ప్రశాంతంగా సాగిన దాంపత్య జీవితం, గత కొంతకాలంగా కలహాలతో నిండిపోయిందని స్థానికులు తెలిపారు. సుమారు సంవత్సరం నరగా ఐశ్వర్య తన తల్లిదండ్రుల ఇంట్లోనే ఉంటోందని సమాచారం. నాలుగు రోజుల క్రితం అత్తవారింటికి వదిలి వెళ్లగా.. ఈ విషాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ రవీందర్ సంఘటన సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ రవీందర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూసైడ్ లెటర్‌ను స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కనువిందు చేసిన బ్లడ్ మూన్

### భారత్‌లో చంద్రగ్రహణం దృశ్యం 20 నుంచి 25 నిముషాలే

### మూతపడ్డ ఆలయాలు.. పలుచోట్ల ప్రత్యేక పూజలు



హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: ఈ ఏడాది మొదటి చంద్ర గ్రహణం హోళి పండగ రోజైన మంగళవారం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కనువిందు చేసింది. భారత్‌లో 20 నుంచి 25 నిమిషాలు మాత్రమే గ్రహణం విడుస్తున్న సమయంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో దశలో కనిపించింది. కాగా చంద్ర గ్రహణం పురస్కరించుకుని భారత్‌లో అనేక దేవాలయాలను ఉదయం నుంచే మూసివేశారు. రాహు, కేతువుల పూజలు జరిగే శ్రీకాళహస్తితో పాటు మరో ఐదు దేవాలయాలు మాత్రమే గ్రహణ సమయంలో తెరిచి వుంచారు. ఖగోళ అద్భుతంలో ఒకటిగా పిలువబడే చంద్ర గ్రహణం మరోమారు ఆవిష్కృతమయ్యింది. సూర్యుడికి, చంద్రుడికి మధ్యలో భూమి అడ్డుగా వచ్చి నపుడు ఏర్పడేది సంపూర్ణ చంద్ర గ్రహణం. అయితే సంపూర్ణ చంద్ర గ్రహణం అన్నిసార్లు సంభవించదు. కొన్నిసార్లు మాత్రమే అది కూడా కొన్ని దేశాలలోనే ఏర్పడుతుంది. కొన్నిసార్లు పాక్షిక గ్రహణం ఏర్పడుతుంది. చంద్ర గ్రహణం పౌర్ణమి రోజున ఏర్పడుతుంది. మంగళవారం నాటి చంద్ర గ్రహణం ఇందుకు ఉదాహరణ. ఈ గ్రహణం అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, అంటార్కిటికా సహా పలు దేశాలలోనే సంపూర్ణ చంద్ర గ్రహణం కనువిందు చేసింది. అయితే ఇటీవల కాలంలో చంద్ర గ్రహణం సమయంలో అనేక దేశాలలో బ్లడ్ మూన్‌గా చంద్రుడు కనిపిస్తున్నాడు. మంగళవారం కూడా ఇలాగే జరిగింది. బ్లడ్ మూన్ సమయంలో చంద్రుడు పూర్తిగా భూమి నీడలో వుండడంతో సూర్యకాంతి నేరుగా చంద్రుడిని చేరుకోలేదు. సూర్యకాంతిలో తక్కువ తరంగ ధైర్ఘ్యాల కలిగిన నీలి కాంతి సులభంగా చెల్లాచెదురుగా వెళుతుంది. కానీ ఎరుపు, నారింజ కాంతి దీర్ఘ తరంగ ధైర్ఘ్యాల మాదిరిగా భూమి దట్టమైన వాతావరణంలో చొచ్చుకుపోయి చంద్రుని ఉపరితలం చేరుకుంటుంది. ఈ నారింజ, ఎరుపు రంగులు భూమిని దా టుకుని ఆపై చంద్రుడిని చేరుకోవడం వల్ల మనకు జాబిలి రక్త వర్ణంలో కనిపిస్తుంది. ఈ కార ణంగా ఇలాంటి గ్రహణాన్ని శాస్త్రవేత్తలు బ్లడ్‌మూన్‌గా పేరు పెట్టారు. బ్లడ్ మూన్‌తో పాటు సూపర్ మూన్, బ్లూ మూన్, హార్వెస్ట్ మూన్‌లు వేరు వేరు సందర్భాలలో ఏర్పడతాయి. ఇవి చంద్ర గ్రహణం సందర్భంగా కాకుండా సాధారణ సమయంలో పౌర్ణమి రోజున కనువిందు చేస్తాయి. ఇక మంగళవారం నాటి చంద్ర గ్రహణం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.20 గంటలకు మొదలై రాత్రి 6.48 గంటలకు ముగిసింది. అయితే నీడ మాత్రం రాత్రి 7.53 గంటల వరకు కొనసాగింది. భారత్‌లో చంద్రోదయం ఒక్కో నగరంలో ఒక్కో సమయంలో వుండడంతో గ్రహణ వేళలు 20 నుంచి 25 నిమిషాల వరకు వుండింది. సం పూర్ణ గ్రహణం సాయంత్రం 4.34 గంటల నుంచి 5.33 గంటల వరకు వుండింది. ఇది భారత్‌లో కనిపించ లేదు. హైదరాబాద్‌లో చంద్రోదయం సాయంత్రం 6.26 గంటలకు మొదలు కాగా ఆ సమయంలో గ్రహణం ముగింపు దశలో వుంది. హైదరాబాద్‌లో గ్రహణం 22 నిమిషాల పాటు గ్రహణం కనిపించింది. విజయవాడలో సాయంత్రం 6.14 గంటలకు చంద్రోదయం కాగా రాజమండ్రిలో 6.07 గంటలకు, నెల్లూరులో 6.18 గంటలకు గ్రహణంతోనే ఉదయించాడు. గ్రహణం సందర్భంగా తిరుమల తిరుపతి, శ్రీశైలం, యాదగిరి గుట్ట సహా తెలుగు రాష్ట్రాలలోని దేవాలయాలను మూసివేశారు. రాహు, కేతువుల ప్రభావం లేని శ్రీకాళహస్తితో పాటు దేశంలోని మరో ఐదు దేవాలయాలు తెరిచి వుంచారు.

వార్త

వినడంలో మనిషి తొందర పడాలి. కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు. అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.

న-జేమ్స్ జ్యూడిత్

# బరిలోకి డ్రాగన్?

అమెరికా పోసిన ఆజ్యంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా ఎప్పుడైతే రంగంలోకి దిగిందో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ ఛాయలు కనపడుతున్నాయి. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ఆఘమేఘాల మీద ప్రకటించేశారు. తాము ఇరాన్‌లోని చెత్తను తొలగిస్తాం. నిన్ననే ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు.ఎనిమిది అరబ్ దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడుతున్నాయి. ఇరాన్ అమెరికాతో 'రాజీ' చర్చల కోసం ఏవిధంగానూ ప్రయత్నించడం లేదు. అమెరికా మాత్రం చర్చలకు అవకాశాలున్నట్లు చెప్పుకోవడంలో లౌక్యం కనపడుతోంది. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం ఆరామ్‌కో చమురు రిఫైనరీపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆపివేయగల శక్తివంతమైన దేశమని, ఆ జలసంధి ఇరాన్ ఆధీనంలో ఉన్నందున దానిని మూసివేస్తే దాదాపు 20 దేశాలకు ఆ మార్గం గుండా చమురు నౌకలను పంపడానికి ఆటంకమేర్పడ్తుందని ముందుగానే అంచనా వేశారు. అంతటి సమస్య వస్తుందని తెలిసినా ట్రంప్ ఎంతో దూకుడుగా ఇరాన్‌పై యుద్ధతంత్రం మొదలెట్టారు. తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు దారిలో ఉన్నట్లు అర్థమౌతోంది. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుందన్న అవగాహన ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహనఉంది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది. హోర్ముజ్ జలసంధిలో మార్షల్ ఐలాండ్స్ జెండాతో ప్రయాణిస్తున్న ఎంకెడి వ్యోమ్ చమురు ట్యాంకర్ నౌకపై పలావ్ జెండాతో ప్రయాణిస్తున్న స్కైలెట్‌చమురు ట్యాకంర్‌పై డ్రోన్ దాడులు జరిగాయి. బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురు దొరికినట్లే. ఇంత క్రితమే గత నెల మూడవ వారంలో హార్మోజ్‌లో ముందుగానే యుద్ధమేఘాలు అలుముకున్నాయి. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పుధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్‌లు అతలాకుతలమయ్యాయి. ఈక్విటీ మార్కెట్‌లో మదుపరులు ఆసక్తిగా పెట్టుబడులు పెట్టే ఆస్కారమున్న బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీలమొత్తం మార్కెట్ విలువ బాగా పడిపోయింది. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది.యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది.హోల్‌సేల్ మార్కెట్‌లోనే కాదు, రిటైల్ మార్కెట్‌లో పప్పుధాన్యాలు,చమురు ధరలు బాగా పెరిగిపోవడంతో సామాన్యులకు అందని ద్రాక్షలుగా మారాయి. ఇరాన్ తమ సామీప్య సముద్ర జలాల్లో నిలిపి ఉంచిన అమెరికా యూఎస్ఎస్ లింకన్ విమాన వాహక యుద్ధ నౌకపై కూడా ఇరాన్ దాడి చేసింది. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. అరబ్ దేశాల్లో ఉన్న లక్షలాది భారతీయుల కోసంవారిని స్వస్థలాలకు తరలించడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లతో తొలివిడత కొందరు స్వదేశం చేరారు. ప్రస్తుతం గగనతల ప్రయాణంపై నిషేధమున్న రీత్యా యుద్ధం ఆగితే తప్ప మిగిలిన వారు ఇండియాకు రాలేరన్నఅనుమానం వ్యక్తమవుతోంది.ప్రస్తుత యుద్ధ ప్రభావితమైన దేశాల్లోదాదాపు కోటిమంది భారతీయులుంటారని అంచనా.ఇరాన్‌లో 10వేల మంది భారతీయ విద్యార్థులు, ఇజ్రాయెల్‌లో 20వేలమంది విద్యార్థులు ఉన్నట్లు కేంద్రంవద్ద నమోదైన అంకెలసమాచారం. వీరంతా యుద్ధం ముగిసే వరకూ అక్కడే ఉండిపోవాల్సి వస్తుందన్న భయం వారి కుటుంబ సభ్యుల్లో ఉంది. గత మూడురోజుల్లో 1117విదేశీ విమాన సర్వీసులరద్దు చేసింది.సందట్లో సడేమియా అన్నట్లు ఇరాన్‌ను భూకంప తీవ్రత 'గెరాష్' భూకంప కేంద్రంగా చుట్టుముట్టింది.ఎలాగైనా ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాలమే పరిష్కారం చూసి విశ్వమానక సౌభ్రాతృత్వం దిశగా అడుగులు వేస్తుంది.

మెదడుకు మంచీ, చెడు తెలీదు. అన్ని రకాల ఆలోచనల్ని అది ఇస్తుంది. అందులోంచి ఎంచుకొనే విజ్ఞత నీది.



బైరన్

వారసత్వంగా సంక్రమించినదానికంటే స్వయం కృషి ద్వారా సాధించుకొన్నదే మిన్న.



డావిన్సి

# ప్రజావాక్కు



## పెద్దన్న యుద్ధోన్మాదం

పశ్చిమాసియాని నేరుగా అమెరికాయుద్ధరంగంగా మార్చి వెయ్యడం ఖండనీయం. ఇజ్రాయెల్‌తో కలిసి, ఇరాన్‌పై దాడులు జరిపి ఆదేశపు సుప్రీం అయితుల్లా ఖమేనీ సహా పదుల సంఖ్యలో ఉన్నతాధికారుల్ని, మాజీదేశ అధ్యక్షుడిని, వందలాది పౌరుల్ని పొట్టనపెట్టుకోవడం,ఆవాసాల్ని ధ్వంసం చెయ్యడం అమెరికా దుందుడుకు వైఖరికి నిదర్శనం.దౌత్యపరమైన చర్చలు జరుగుతుండ గానే, ప్రమాదకర స్థాయి కవ్వింపులేవీ కనబడకుండానే ఒక సార్వభౌమ దేశంపై దాడులు చెయ్యడాన్ని ప్రపంచదేశాలు ఖండించాల్సిందే. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు, నాగరిక విధానాలకు ఈ చర్యలు పూర్తి వ్యతిరేకం. ట్రంప్ అధ్యక్షపదవిలోకి రాకముందు, వచ్చాక ఒకటే చెప్తూ ఉన్నారు. అమెరికాపై యుద్ధాన్ని ప్రోత్సహించదు.

- డా. డి.వి.జి.శంకరరావు, విజయనగరం

## నైతిక విలువలను కాపాడాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు వచ్చేవిద్యా సంవత్సరంలో మారనున్నాయని పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయి. పాఠ్యాంశాలు ఆర్ఎస్ఎస్, బిజెపి భావజాలాలకు అనుకూలంగా ఉండేలా ఉంటాయని వదంతులు వినిపిస్తూ ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశంలో ప్రభుత్వం నడిపే ప్రతి పాఠశాలలో భగవద్గీతను ఒక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని అనుకుంటున్నట్టుగా వదంతులు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతూ ఉన్నాయి. నైతిక విలువలు అనైతిక లక్షణాలు కలిగిన పాలకులు చెప్పకూడదు పసివాళ్ళపై ఆ ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఆలోచించాల్సిందే..

పొగాకు వినియోగం కేవలం వ్యక్తిగత అలవాటు కాదు, అది కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తూ దేశఆర్థిక వ్యవస్థను,ప్రజారోగ్యాన్నిదెబ్బతీస్తున్న తీవ్రసామాజిక సంక్షోభం. క్యాన్సర్, గుండె, శ్వాసకోశ వ్యాధులకు ప్రధాన కారణమైన పొగాకు వల్ల ప్రతి ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పొగాకు పరిశ్రమ ద్వారా వచ్చే ప్రభుత్వ ఆదాయంకంటే, దానివల్ల కలిగే అనారోగ్యానికి చేసే వైద్య వ్యయం, మానవ వనరుల నష్టం చాలా రెట్లు అధికం.

- కె.రామారావు, నల్గొండ

## నిధుల కొరత

నేటి ఆధునిక కాలంలో ఒక దేశాభివృద్ధి ఆ దేశ విశ్వవిద్యాలయాలు చేపట్టే పరిశోధనలపైనే ఆధారపడి ఉంటుంది. విజ్ఞాన ఆధారిత సమాజంలో ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధికి చోదకశక్తులు. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో విశ్వవిద్యాలయాలు కేవలంబోధనా కేంద్రాలుగామాత్రమే కాకుండా, అత్యాధునిక పరిశోధనా వేదికలుగా వర్ధిల్లుతున్నాయి. అమెరికా తన మొత్తం దేశీయ ఉత్పత్తిలో 3శాతం కంటే ఎక్కువ నిధులను పరిశోధనల కోసం వెచ్చిస్తూ, పరిశ్రమలతో బలమైన అనుసంధానాన్ని కలిగి ఉంది. భారతదేశ పరిస్థితిని గమనిస్తే, మన దేశం పరిశోధనల కోసం తన దేశీయ ఉత్పత్తిలో కేవలం 0.7 శాతం వరకు మాత్రమే ఖర్చు చేస్తోంది. ఐఐటీలు వంటి కొన్ని సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ, మెజారిటీ రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో నిధుల కొరత, పాతబడిన ప్రయోగశాలలు పరిశోధకులను నిరుత్సాహపరుస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.ఏటా లక్షలాదిమంది దేశవ్యాప్తంగా ఇంజినీర్లు పుట్టుకువస్తున్నారు. వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. తక్కువ జీతంలో కొత్తవారిని తీసుకుంటున్నారు. దాదాపు మధ్య వయసునకుచేరినవీరికి మరల ఉద్యోగాలుదొరకడం బహు దుర్లభం.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

## నిర్లక్ష్యం వద్దు

రోడ్డు భద్రతపై ఏటా మొదటి నెలలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నా, ఫలితాలవిషయానికి వచ్చేసరికి లక్ష్యం నీరు గారిపోతుంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అంతర్గత రహదారుల్లోప్రమాదాలు సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. వాహనదారుల అతివేగం, నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణాలు. వాహనదారులు అతివేగం మానుకోవాలి. నిర్లక్ష్యం వదిలించుకోవాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సమగ్ర విద్యతోనే సమసమాజ నిర్మాణం!

**మొత్తం మీద విద్యా రంగంలో జరుగుతున్న ఈ మార్పులు సమీప భవిష్యత్తులో దేశ యువతకు మరింత బలమైన భవిష్యత్తును అందించనున్నాయి. విద్యార్థులు నైపుణ్యవంతులుగా, విలువలను పాటించే పౌరులుగా, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ సంస్కరణలు మేలు చేస్తాయని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. కాబట్టి నేటి తరానికి సరైన విద్య అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి విలువలు, జీవిత నైపుణ్యాలు, సృజ నాత్మకత, సమస్య పరిష్కరణ, ఆధునిక జ్ఞానం ఇవన్నీ కలగలిపిన బహుముఖ విద్య సమగ్ర విద్యను ప్రతి విద్యా సంస్థలో అమలు చేసినప్పుడే మన దేశం నిజమైన అర్థంలో విజ్ఞానభారతంగా వెలుగొందుతుంది.**

సొప్పరి నరేందర్

విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవన పద్ధతి.విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది,నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది. నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈ మూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు. సమాజం అభివృద్ధి చెందుతుంది, దేశం ముందుకు సాగుతుంది. విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితంకాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం. నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి,నవ చైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికి అత్యంత అవసరమైనవి.ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. నైపుణ్యం ఆధునిక ప్రపంచానికి పునాది, ప్రపంచం మారుతోంది. జ్ఞానం కంటే నైపుణ్యాలే నేటి ఉద్యోగ విపణిలో ముఖ్యం అవుతున్నాయి. కంప్యూటర్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్, సమస్య పరిష్కరణ, నాయకత్వ లక్షణాలు వంటి అనేక నైపుణ్యాలు వ్యక్తిని విజయవంతుడిగా నిలబెట్టే మెట్లు. సాంప్రదాయ విద్యలో నైపుణ్యాల మీద పెద్దగా దృష్టి ఉండలేదు. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి.కాబట్టే విద్యావ్యవస్థ నైపుణ్యాల పెంపువైపు మళ్లాలి. పాఠశాలస్థాయి నుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బలపరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలోఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు.నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలి నుంచి మార్చుతుంది. నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు. ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాల పట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు. నవచైతన్యం అభివృద్ధికి కొత్తదారి, భవిష్యత్తు నవ చైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలక అంశం. కేవలం పాఠాలు నేర్పించడం సరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం, వైఫల్యం భయపడకుండా ముందుకు సాగడంవంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి.ల్యాబ్‌లు,ఇన్నోవేషన్ క్లబ్‌లు,సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్



ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవ చైతన్యాన్ని పెంపొందించే మార్గాలు. నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది. సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండాపలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతోపాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడంఇవన్నీ సమగ్ర విద్యా లక్ష్యాలు. సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగినవాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది. దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం. పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల, ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలల నుండి ఉన్నత విద్యవరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా,విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్నికోణాల్లో అభివృద్ధి చేసే సమగ్ర ప్రక్రియ కావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు,సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలు విద్యార్థులను భవిష్యత్తు వైపు తీర్చిదిద్దుతున్నాయి. విద్యా నిపుణులు చెబుతున్నదేమిటంటే, నేటితరం ఉద్యోగాలకే కాదు, జీవితానికి సిద్ధంఅవ్వాలి. అందుకోసం నైపుణ్యం, నీతి, సృజనాత్మకత కలిసి నడిచే విద్య అవసరం అని. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను పెంపొందించే ఆవిష్కరణ క్లబ్‌లు, ల్యాబ్‌లు, సైన్స్ ఫెయిర్లు కూడా విద్యాసంస్థల్లో ప్రాధాన్యం పొందుతున్నాయి. డిజిటల్ విద్యాభ్యాసం గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్దఎత్తున విస్తరిస్తుండటం మరో ముఖ్య పరిణామంగా భావిస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు,డిజిటల్ లైబ్రరీలు విద్యను మరింత చేరువ చేస్తున్నాయి. మొత్తం మీద విద్యా రంగంలో జరుగుతున్న ఈ మార్పులు సమీప భవిష్యత్తులో దేశ యువతకు మరింత బలమైన భవిష్యత్తును అందించనున్నాయి. విద్యార్థులు నైపుణ్యవంతులుగా, విలువలను పాటించే పౌరులుగా, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ సంస్కరణలు మేలు చేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి నేటి తరానికి సరైన విద్య అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి విలువలు,జీవిత నైపుణ్యాలు,సృజనాత్మకత, సమస్య పరిష్కరణ, ఆధునిక జ్ఞానం ఇవన్నీ కలగలిపిన బహుముఖ విద్య సమగ్ర విద్యను ప్రతి విద్యా సంస్థలో అమలు చేసినప్పుడే మన దేశం నిజమైన అర్థంలో విజ్ఞానభారతంగా వెలుగొందుతుంది.

# కల్తీ నియంత్రణకు పర్యవేక్షణ అవసరం


చిలగాని జనార్ధన్

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఫలితంగా కల్తీ పదార్థాలు మార్కెట్‌లో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల భారినపడుతున్నారు. దేశ వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించిన ప్రతీ వంద శాంపిల్స్‌లో 20కి పైగా కల్తీకి గురైనట్లు నివేదికలు చెబుతున్నాయి.2021-24 మధ్య కాలంలో పార్లమెంటుకు నివేదించిన ఆహార కల్తీలే ఇందుకునిదర్శనం. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో భారీగా ఆహార పదార్థాలు, సరుకుల కల్తీలు జరుగుతోన్నా నియంత్రణకు తీసుకున్న చర్యలు నామమాత్రమే. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ వైద్య ఆరోగ్య శాఖకు అత్తెసరు నిధులే కేటాయించిన విషయం తెలిసిందే. బడ్జెట్‌లో రెండు శాతమే కేటాయించినా ఇందులో ప్రజారోగ్యశాఖ పరిధిలో ఫుడ్ సేఫ్టీ విభాగం ఊసే లేకుండా పోయింది. ఆహార కల్తీ నిర్ధారణకు ల్యాబ్‌ల విస్తరణ, సిబ్బంది నియామకం లేనట్లేనని తేలింది. ఏపీలో తిరుపతి లడ్డు, పాల కల్తీ దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. గతంలో హైదరాబాద్‌లో మోమోస్ మయోనైజ్‌తినడం వల్ల మృతి చెందిన సంఘటనలున్నాయి. తెలంగాణాలోనూ రోజూ ఎక్కడో చోట ఆహారకల్తీలతో అనారోగ్య పాలౌతున్నారు. తరచూ విద్యాసంస్థల్లోని స్టూడెంట్స్ ఫుడ్ పాయిజన్‌కు గురై ఆసుపత్రి పాలౌతున్నారు. మార్కెట్‌లో రోజు తినే వస్తువులు,పదార్థాలు కల్తీయా, నాసిరకమా అనేది తెలియడం లేదు. ఎక్కువగా కల్తీ పదార్థాలు తయారు చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. పసుపు, కారం, దనియాలు, పప్పులు,నూనెలు ఇలా నిత్యవసర సరుకులతో పాటు ఇతర వస్తువుల్లో కల్తీ జరుగుతున్నట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారుల పరీక్షల్లో స్పష్టమౌతుంది. అరటి పండ్లలో ఇథోపాన్ పెస్టిసైడ్, ఆపిల్‌పై ప్యారాపిన్, సపోట, దానిమ్మ, సంత్ర వీటిల్లో కార్బైడ్ అవశేషాలుంటున్నాయి. అంతేకాకుండా విచ్చలవిడిగా కలర్స్ వినియోగిస్తున్నారు. దీనివల్ల క్యాన్సర్‌తో పాటు లివర్ సంబంధిత వ్యాధులు కబలిస్తున్నాయి. ఇక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగించే ఆయిల్, కలర్స్, ముడి పదార్థాల గురించి చెప్పనవసరం లేదు. తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్‌ను గుర్తించే ఒకేల్యాబ్ ఉంది. ప్రతీరోజు కొన్ని మాత్రమే టెస్ట్ చేసేందుకు వీలుంది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు వందలోపు ఫుడ్‌సేఫ్టీ అధికారులు,సిబ్బంది మాత్రమే ఉన్నారు. సుమారు కోటిన్నర జనాభా గల హైదరాబాద్‌లో 32 సర్కిళ్లలో ఉన్న అరకొర సిబ్బంది వల్ల తనిఖీలు ఏమాత్రం చేయవచ్చోఅర్థం చేసుకోవచ్చు. రాష్ట్రానికి ఆరు ఎఫ్ఎస్ఎస్ఐ ల్యాబ్‌లు, మరో ఆరు మొబైల్ ల్యాబ్‌లు మంజూరు చేయా లని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. దీనివల్ల తనిఖీలు,శాంపిల్స్ సేకరణ పరిమితంగా చేస్తున్నట్లు తెలుస్తుంది. దుకాణాలు, ఆహార ఉత్పత్తి సంస్థల రిజిస్ట్రేషన్, లైసెన్సుల జారీ ఇలాఅన్నీ ఇక్కడ చిదంబర రహస్యాలే.ఫుడ్ సేఫ్టీ ఆఫీసుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన లేకుండా పోయింది.అతి కొద్దిమందికి అవగాహన ఉన్నవారు ఆఫీసుకు వెళ్లినా అక్కడ తాళాలే దర్శనమిస్తాయి. ఎఫ్ఎస్ఓలు, సిబ్బంది ఎవరూఅందుబాటులో ఉండరు. ఉన్నతాధికారులు పర్యవేక్షించక పోవడం, ఆహారకల్తీ నిరోధక విభాగం అస్తవ్యస్తానికి కారణంగా చెప్పవచ్చు. ఆహార పదార్థాల తయారీదారులు, హోటళ్ల యజమానులు, ఇతర దుకాణాదారులు దరఖాస్తులను జీఎఫ్ఐ పరిశీలించి రిజిస్ట్రేషన్, లైసెన్సులు జారీ చేయాల్సి ఉంది. ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేశాక, క్షేత్రస్థాయిలో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ పరిశీలించి, అర్హతలున్నట్లు నిర్ధారించాకే, కొన్ని షరతుల మేరకు వారికి లైసెన్సులు జారీచేయాలి. కాని ఇలాచేయడం లేదనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఫుడ్ లైసెన్స్‌ల జారీ, తనిఖీలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ సిబ్బందిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ లేకుండా పోయింది.

# రాయలసీమ 'జల రాజకీయ' సీమ

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే నిలుపుదల చేయించానని చెప్పడం చూస్తుంటే మరొకసారి రాయలసీమ జల రాజకీయ సీమగా మారింది.రాయలసీమకు గుండెకాయలాంటి ఎత్తిపోతల పథకంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. సీమ ప్రాజెక్టులు పూర్తయ్యే పరిస్థితి లేదు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పక్కదారి పట్టించేందుకు పాలకులు ముచ్చుమర్రి పేరును తెరపైకి తెస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తే తప్ప సీమ ఎడారి కాకుండా ఉంటుంది. బచావత్ ట్రిబ్యునల్ ద్వారా హక్కు దక్కిన కృష్ణా జలాలను సమర్థవంతంగా రాయలసీమ వాసులు వినియోగించలేకపోయారు.శ్రీశైలంలో 777 అడుగుల నుంచే ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ, దిగువకు 4 టీఎంసీలను తరలిస్తూ శ్రీశైలం ప్రాజెక్టును ఖాళీచేస్తుండటం వల్ల ఆంధ్రరాష్ట్ర నీళ్ల వాటా ఉన్నప్పటికీ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్కు నీటిని సరఫరా చేయలేని దుస్థితి. శ్రీశైలం నుంచి 798 అడుగుల నుంచే రోజుకు 2 టీఎంసీలు తరలించేలా పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి సామర్థ్యాన్ని పెంచి రోజుకు 0.45 టీఎంసీలు తరలించేలా తెలంగాణ సర్కార్ చర్యలు చేపట్టింది.జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి రోజుకు 7.95 టీఎంసీలు తెలంగాణ వాడుకుంటున్నది. శ్రీశైలం ప్రాజెక్టులో 841 అడుగుల వద్ద మాత్రమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ను అమర్చారు. ప్రాజెక్టులో నీటి మట్టం 841అడుగులు ఉంటే 2 వేల క్యూసెక్కులు 854అడుగులు ఉంటే 7 వేల క్యూసెక్కులను మాత్రమే పోతిరెడ్డిపాడు ద్వారా తరలించే అవకాశం ఉంటుంది. 881అడుగుల స్థాయిలో నీటిమట్టం ఉన్న రోజుల్లో మాత్రమే ప్రస్తుత డిజైన్ ప్రకారం పోతిరెడ్డిపాడు ద్వారా 44వేల క్యూసెక్కులు తరలించడానికి ఆస్కారం ఉంటుంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాముల నుంచి దిగువకు లక్ష క్యూసెక్కులు విడుదల చేసినా జూరాల, శ్రీశైలం నుంచి వచ్చిన నీటిని వచ్చినట్టుగా తెలంగాణకు తరలిస్తుండటంతో శ్రీశైలంలో నీటి మట్టం పెరగడం లేదు. దాంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్పై ఆధారపడిన ఎస్సార్బీసీ, తెలుగు గంగ, గాలేరు నగరి ప్రాజెక్టులకు 101 టీఎంసీల కేటాయింపులు ఉన్నా సరే, ఆ ప్రాజెక్టుల కింద ఉన్న 10.33 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించలేని దుస్థితి నెలకొంది. ఇక సుంకేశుల బ్యారేజీ జలవిస్తరణ ప్రాంతంలో తుమ్మిళ్ల ఎత్తిపోతలను తెలంగాణ సర్కార్ చేపట్టితే కేసి కెనాల్ ఆయకట్టు రైతులకు భారీనష్టంతప్పదు. ఇక చరిత్రలోకిపోతే చెప్పేవాళ్లను బట్టి చరిత్ర చాలా మారుతుంది.రాయలసీమకు సాగు, త్రాగునీళ్ల లేకపోవడానికి చాలా కారణాలు చెప్పుకోవచ్చు. ఎన్ని కారణాలు చెప్పినా ముఖ్యమంత్రులు అంతా మీ వాళ్లే కదబ్బా అంటారు. వందేళ్ళ పైబడిన సమస్య ఇది.ఇది నీళ్ల చరిత్ర కాదు కన్నీళ్ల చరిత్ర. 1905లో బ్రిటిష్ ఇంజనీర్ సర్ మెకంజీ సాగునీటి ప్రాజెక్టుల ప్రణాళిక అమలు జరిగి ఉంటే కృష్ణ, తుంగభద్ర, పెన్నా, నదులు, సంగమంతో మొత్తం 30 లక్షల ఎకరాలకు సీమలో నీరు అంది ఉండేది. కానీ ఈ పథకం అమలు కాలేదు. డిసెంబర్ 1937లో



శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం నీటిపారుదల సమస్యలు ఎప్పుడు ఉత్పన్నమైనా ముందుగా రాయలసీమ జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యంగా తుంగభద్ర,కృష్ణ,పెన్నా, నదుల అనుసంధానంతో పెద్ద ప్రాజెక్టులు కట్టాలని తీర్మానం చేశారు. దీనిని పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. 1951లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం రూపొందించిన కృష్ణా పెన్నార్ ప్రాజెక్టుకు ప్లానింగ్ కమిషన్ అనుమతి కూడా లభించింది. ఈ ప్రాజెక్టు పూర్తయి ఉంటే, రాయలసీమ సస్యశ్యామలమై ఉండేది. కృష్ణా నీరు 100 టిఎంసీలు సీమకు లభించి ఉండేది. దీనిని అడ్డుకొని నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మించారు. చుక్క నీరు కూడా సీమకు లేదు. ఇది నదీ జలాల సమస్య,వీటిని టిఎంసిలలో కొలుస్తారు. ఒకటి ఎంసి 100 కోట్ల ఘనపు అడుగులు. పదివేల ఎకరాలకు సాగుకు సరిపోతుంది. సీమకు వంద టిఎంసిలు సరిపోతాయి. కృష్ణానదిలో అన్ని నీళ్లు సీమకు కావాలని వాటా గురించి అడిగేవాళ్ళు ఉండాలి. అలాగే ఇచ్చేవాళ్ళు కూడా ఉండాలి. గోదావరి అడవుల్లో ప్రవహిస్తే, కృష్ణా నదిమైదాన ప్రాంతంలో ప్రవహిస్తుంది. అందుకే కృష్ణా నీటి అవసరం అందరికీ ఎక్కువే. అందుకోసమే ఈ గొడవలు. నికర జలాలని, మిగులు జలాలని లెక్కలు కుదరవు. వంద సంవత్సరాలలో 75ఏళ్ల తప్పనిసరిగా నదిలోఎంత నీరు ఉంటుందో ఆ నీటిని నికర జలాలని, అంతకన్నా ఎక్కువ నీరు ఉంటే మిగులు జలాలని అంటాము. రాయలసీమలో పెన్నా నది అనేది మాత్రమే ఉంది. అది కూడా నిస్సారమైన నది. కడప జిల్లా మొత్తం పెన్నా బేసిన్లోనే ఉంది. అనంతపురం ప్రధానంగా పెన్నా బేసిన్‌లోనూ, పాక్షికంగా కృష్ణానది బేసిన్‌లోనూ ఉంది. కర్నూల్ కాస్త ఎక్కువగా. కృష్ణాబేసిన్లో ఉన్నా,ఎక్కువ భాగం పెన్నా బేసిన్‌లోనే ఉంది.ఇక చిత్తూరు జిల్లాలో ప్రధానంగా ఉన్నది పెన్నా ఉపనదులే, తుంగభద్ర ప్రాజెక్ట్ పెద్దదిగా కట్టి సీమకు ఉపయోగపడే విధంగా చేయలేక పోయాం. అది మరుగుజ్జుగా మారింది.కర్నూలు కడప కాలువను 1861 నుంచి 1871 మధ్యకాలంలో నిర్మించారు. ఇది అస్థిర జల ఆధారమని అందరికి తెలుసు. ఇక ఈ కేసీ కెనాల్ వలన రాయలసీమ నీటి కొరత తీరదు.కరువు ప్రాంతాలను కాపాడుకునేందుకు, సీమ సాగు తాగునీటి అవసరాలకు ఎత్తిపోతల పథకమే శరణ్యం. అయితే తెలంగాణ వారు శ్రీశైలంలో 796 అడుగుల నుంచి రోజుకు నాలుగు టిఎంసిలను, పాలమూరు దిండి కల్వకుర్తి ఎస్ఎల్బీసినుంచి 800 అడుగుల నుంచి రోజుకి 2.0 తరలిస్తుండడం వల్ల నీటిమట్టం తగ్గిపోతుంది. సాగునీరు రాకపోతే రాయలసీమ ఎడారే అవుతుంది. ఇది రాయలసీమ పరిస్థితి. ఇక్కడ ఒక్క ప్రాజెక్టు కూడా మన పాలకులు కట్టిన పాపానపోలేదు.అనుకున్న ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. సీమకు ఏకైక ఆధారం కృష్ణా జలాలు. తెలంగాణ వాళ్లు మిగులు జలాలు మావి అంటున్నారు. రాయలసీమ వాళ్లకు మిగులుజలాలపై హక్కు లేదంటున్నారు.రాయలసీమలో నిర్మిస్తున్న ప్రాజెక్టులన్నీ కృష్ణానది మిగులు జలాలపై ఆధారపడినవే. ఇవి కట్టకపోతే ఇక్కడ తాగునీరు సాగునీరు లభించదు. ఇక్కడ భూగర్భ జలాలు, వర్షపాతం తక్కువ, కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి గతంలో పలు ఒప్పందాలున్నప్పటికీ రాష్ట్రవిభజన తర్వాత 2015లో కుదిరిన ఒప్పందాన్ని బట్టి రాయలసీమకు 144.70టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీలు, కోస్తాకు 367.34 టిఎంసిల వాటాను కేటాయించగాదానిని ఉల్లంఘించి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు చేపట్టింది. శ్రీశైలం ప్రాజెక్టులో 881అడుగుల పైగా నీరుంటేనే పోతిరెడ్డిపాడు నుంచి సీమకు రావాల్సిన 44 వేల క్యూసెక్కుల నీరు తీసుకోవడం సాధ్యమవుతుంది.

# యుద్ధంతో ఆయుధ సంపద ఆవిరి



గల్ఫ్ దేశాలపై భారీగా డ్రోన్‌లు ప్రయోగిస్తున్న ఇరాన్

పలు బాలిస్టిక్ క్షిపణులు రెడీ

మిస్సైల్స్‌ను భారీగా ప్రయోగిస్తున్న ఇజ్రాయెల్

**టెహ్రాన్, మార్చి 3:**ఇరాన్ సంక్షోభం మొదలయ్యి నేటికి నాలుగవ రోజే. కానీ అనూహ్య రీతిలో ఆయుధ సంపత్తి క్షీణిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్దగా ఎవరి మద్దతు లేకుండానే ఇరాన్ తన డ్రోన్లతో విరుచుకుపడుతున్నది. అమెరికాఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేసినా ఈ యుద్ధం ఇప్పట్లో ఆగే రీతిలో లేనట్లు కనిపిస్తున్నది. శనివారం జరిగిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ తన వద్ద ఉన్న డ్రోన్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. దాదాపు అన్ని గల్ఫ్ దేశాలపై తమ డ్రోన్లను వదలింది. అమెరికా మిత్ర దేశాల వద్ద ఉన్న పాట్రియాట్ మిస్సైళ్లు ఆ డ్రోన్లను ఎదుర్కొనే పనిలో పడ్డాయి. అయితే ఏక ధాటిగా ఆయుధాలు వాడడంవల్ల ఎవరు ముందుగా తమ ఆయుధ సంపత్తిని కోల్పోతారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాని ఆధారంగానే యుద్ధ ఫలితాన్ని అంచనా వేసే అవకాశాలు ఉన్నాయని డిఫెన్స్ నిపుణులు అం టున్నారు. ఇరాన్ తన షాహిద్136 డ్రోన్లను వాడుతున్నది. క్రూయిజ్ క్షిపణుల తరహాలో ఈ డ్రోన్లు టార్గెట్ వద్దకు వెళ్లి ధ్వంసం చేస్తాయి. ఈ డ్రోన్ల వల్లే పశ్చిమాసియా దేశాల్లో కొంత అలజడి నెలకొన్నది. అమెరికా తయారీకి చెందిన పాట్రి యాట్ ఎయిర్ డిఫెన్స్ క్షిపణులు చాలా వరకు ఇరాన్ షాహిద్ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోగలిగాయి. సుమారు 90 శాతం వరకు పాట్రియేట్ క్షిపణులు ఇరాన్‌డ్రోన్లను చిత్తుచేసినట్లు యూఏఈ చెప్పింది. అయితే 4 మిలియన్ల డాలర్లు ఖర్చే అయ్యే పాట్రియేట్ మిస్సైల్‌తో దాదాపు 20 వేల డాలర్లకు తయారయ్యే డ్రోన్‌ను కూల్చడం ఓ పెద్ద సమస్యగా మారింది. చాలా తక్కువ ఖర్చుతో తయారైన షాహిద్ డ్రోన్లు పెద్ద పెద్ద యుద్ధాల్లో పెను సవాల్‌గా మారినట్లు డిఫెన్స్ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం పోరాటం సాగుతున్న తీరు గమనిస్తే, అమెరికా.. ఇరాన్ త్వరలోనే తమ ఆయుధ నిల్వల్ని కోల్పోయే అవకాశం ఉన్నది. ప్రస్తుతం ఖతార్ వద్ద ఉన్న పాట్రియాట్ ఇంటర్‌సెప్టార్ క్షిపణుల స్టాక్స్ వేగంగా కరిగిపోతున్నాయి. గత ఏడాది ఇజ్రాయల్‌తో యుద్ధం జరిగిన తర్వాత ఇరాన్ సుమారు రెండు వేల బాలిస్టిక్ క్షిపణులను పోగు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఇక షాహిద్ డ్రోన్లు అంతకు మించిన సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ డ్రోన్లను రష్యా ఉత్పత్తి చేస్తున్నది. ప్రతి రోజు కొన్ని వందల సంఖ్యలో ఆ డ్రోన్ల ఉత్పత్తి జరుగుతున్నట్లు డిఫెన్స్ నిపుణులు బెకా వేసర్ తెలిపారు. ఫైట్‌లో ఇప్పటి వరకు టెహ్రాన్ సుమారు 1200 ప్రొజెక్టైల్స్‌ను ఫైర్ చేసినట్లు అంచనా వేస్తున్నారు. దీంట్లో ఎక్కువ శాతం షాహిద్ డ్రోన్లు ఉన్నాయి. ఈ ఎత్తుగడ ద్వారా ప్రమాదకరమైన బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ తన అమ్ములపొదిలో దాచుకుంటున్నట్లు అనుమానిస్తున్నారు. అమెరికా దళాలు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థకు చెందిన పాట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను వాడుతున్నాయి. పీఏసీ3 మిస్సైల్స్‌ను పాట్రియాట్ ఫైర్ చేస్తుంది. ఈ క్షిపణుల ఉత్పత్తిని పెంచే ఆలోచనలో పెంటగాన్ ఉన్నట్లు తెలుస్తోంది. లాక్‌హీడ్ ప్రకారం గత ఏడాది కేవలం 600పీఏసీ3 క్షిపణులను మాత్రమే కొత్తగా నిర్మించారు. లాక్‌హీడ్ కంపెనీకి చెందిన థాడ్ అనే అడ్వాన్స్‌డ్ మిస్సైల్ సిస్టమ్‌ను సౌదీ అరేబియా, యూఈఏ ప్రస్తుతం వాడుతున్నాయి. అయితే ఈ క్షిపణి ఖరీదు కూడా ఎక్కువే. థాడ్‌లో వాడే క్షిపణి ఖర్చు సుమారు 12 మిలియన్ల డాలర్లు ఉంటుంది. ఇక్కడ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ను కూల్చేందుకు ఎక్కువ ఖర్చు ఉన్న క్షిపణి వాడాల్సి వస్తున్నది. ఇజ్రాయల్ డిఫెన్స్ కంపెనీ రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్ తయారు చేసిన ఐరన్ బీమ్ లేజర్ వ్యవస్థను ఐడీఎఫ్ ఇంకా ఈవార్‌లో వాడలేదు. ఒకవేళ ఇరాన్ దాడులు ఇలాగే కొనసాగితే, అప్పుడు పీఏసీ3 క్షిపణుల స్టాక్ వేగంగా పడిపోయే ప్రమాదం ఉన్నది.ఎవరు ఎన్ని ఆయుధాలు సమకూర్చుకోగలిగితే, వార్ అన్ని రోజులు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

## మంటల్లో పశ్చిమాసియా

### ఇద్దరు కమాండర్లను ఖతంచేసిన ఇజ్రాయెల్




**బీరూట్, మార్చి 3:** పశ్చిమాసియాలో యుద్ధం ప్రతి నిమిషం మలుపులు తిరుగుతోంది. ఇరాన్ అగ్రనేత ఖమేనీ మృతికి ప్రతీకారంగా హిజ్బుల్లా, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ (పీఐజే) గ్రూపులు ఇజ్రాయెల్‌పై దాడులు ముమ్మరం చేయడంతో, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) లెబనాన్ రాజధాని బీరుట్‌ను లక్ష్యంగా చేసుకుని విరుచుకు పడుతున్నాయి. తెల్లవారుజామున బీరుట్ శివార్లలోని హారెట్ హ్రీక్ ప్రాంతంలో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇద్దరు కీలక నేతలు ప్రాణాలు కోల్పోయారు. పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ (పీఐజే) సంస్థకు చెందిన లెబనాన్ విభాగం కమాండర్ అబూ హమ్జా రామిని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గత కొన్నేళ్లుగా ఇజ్రాయెల్ పౌరులపై, సైన్యంపై జరిగిన వందలాది దాడులకు ఇతనే సూత్రధారి అని ఐడీఎఫ్ పేర్కొంది. బీరుట్‌లోని హిజ్బుల్లా ఇంటె లిజెన్స్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా జరిగిన మరో దాడిలో ఆ సంస్థ ఇంటెలిజెన్స్ చీఫ్ హుస్సేన్ మాక్లెడ్ కూడా హతమయ్యాడు. హిజ్బుల్లా అనుబంధ వార్తా సంస్థ అల్‌మనార్ టీవీ కార్యాలయంపై కూడా ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసింది. దాడికి కొన్ని నిమిషాల ముందే ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేయడంతో భారీ ప్రాణనష్టం తప్పినప్పటికీ, భవనం పూర్తిగా ధ్వంసమైంది. లెబనాన్ నుంచి తమ దేశంపైకి వస్తున్న డ్రోన్లు, రాకెట్లకు ప్రతీకారంగానే ఈ దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

### ఇరాన్ దాడులపై గల్ఫ్‌దేశాల మౌనం దేనికి?



**దుబాయి, మార్చి 3:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానంతరం పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులు దుబాయ్, అబుదాబి వంటి నగరాలపై పడుతున్నప్పటికీ, సౌదీ అరేబియా, యూఏఈ వంటి శక్తిమంతమైన గల్ఫ్ దేశాలు ఎదురుదాడికి దిగకుండా మౌనం పాటిస్తున్నాయి. ఈ వ్యూహాత్మక వైఖరి వెనుక బలమైన ఆర్థిక, రాజకీయ కారణాలు ఉన్నాయని అంచనా. గల్ఫ్ దేశాలు ప్రస్తుతం తమ ఆర్థిక వ్యవస్థలను కేవలం చమురుపై ఆధారపడకుండా పర్యాటకం, వాణిజ్య కేంద్రాలుగా మార్చుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో ఇరాన్‌తో పూర్తి స్థాయి యుద్ధానికి దిగితే, దశాబ్దాలుగా నిర్మించుకున్న అభివృద్ధి క్షణాల్లో కుప్పకూలుతుందని ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే దుబాయ్ విమానాశ్రయం సమీపంలో దాడులు జరగడంతో పెట్టుబడిదారుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. యుద్ధం మొదలైతే తమ చమురు క్షేత్రాలు, ఓడరేవులే ప్రధాన లక్ష్యంగా మారతాయని అరబ్ పాలకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, ముస్లిం ఉమ్మా (ఐక్యత) సెంటిమెంట్ కూడా వారిని నిలువరిస్తోంది. ఇరాన్ షియా దేశమైనప్పటికీ, అది ప్రస్తుతం ఇజ్రాయెల్, అమెరికాలను వ్యతిరేకిస్తోంది. ఈ తరుణంలో ఇరాన్‌పై దాడి చేస్తే, తాము ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్నామనే సందేశం వెళ్తుందని అరబ్ దేశాలు భావిస్తున్నాయి. ఇది సొంత ప్రజల్లోనే తీవ్ర వ్యతిరేకతకు దారితీసే ప్రమాదం ఉంది. ఇరాన్ ఉచ్చులో చిక్కుకోకూడదని కూడా గల్ఫ్ దేశాలు భావిస్తున్నాయి. తమను రెచ్చగొట్టి యుద్ధంలోకి లాగడం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచాలన్నది ఇరాన్ వ్యూహంగా అనుమానిస్తున్నాయి. అందుకే, క్షిపణి దాడులను తమ గగనతల రక్షణ వ్యవస్థలతోనే అడ్డుకుంటున్నాయి తప్ప, తిరిగి ఇరాన్ భూభాగంపై దాడులకు దిగడం లేదు. ఈ వివాదాన్ని ఇరాన్‌ఇజ్రాయెల్ అమెరికా మధ్యనే పరిమితం చేయాలన్నది వారి ఆలోచనగా కనిపిస్తోంది.

### ఇరాన్‌కు మద్దతు ప్రకటించిన చైనా




**బీజింగ్, మార్చి 3:** ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధంపై చైనా స్పందించింది. పశ్చిమాసియా తీవ్ర ఉద్రిక్తతలో డ్రాగన్ కంట్రీ ఇరాన్‌కు మద్దతుగా నిలిచింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను నిలిపివేయాలని కోరుకుంటున్నామని ఆయన అన్నారు. ఇరాన్ తన సార్వభౌమత్వాన్ని, భద్రతను, ప్రాదేశిక సమగ్రతను, జాతీయ గౌరవాన్ని కాపాడుకోవడానికి మరియు దాని చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటానికి చైనా మద్దతు ఇస్తుందని వాంగ్ యి తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ వెంటనే ఇరాన్‌పై సైనిక చర్యలను నిలిపివేయాలని, ప్రస్తుత పరిణామాలు మరింత తీవ్రతరం కాకుండా చూడాలని ఆయన సూచించారు. మరోవైపు, ఇరాన్ దాడులను విస్తృతం చేసింది. సౌదీ అరేబియాలోని అమెరికా రాయబార కార్యాలయంపై డ్రోన్లతో దాడి చేసింది. ఇరాక్‌లోనూ పేలుళ్లు సంభవించాయి. బహ్రెయిన్‌లో సైరన్‌లు మోగాయి. ఇంకోవైపు బీరుట్‌లోని హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు తీవ్రం చేసింది.

### ఇరాన్ అణ్వాయుధాలు అనుమతించబోమన్న ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 3:** ఇరాన్‌పై సైనిక చర్యల దిశగా ఆలోచన చేస్తున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మరోసారి ప్రపంచానికి స్పష్టం చేశారు. ఇరాన్‌ను అణ్వాయుధాలు కలిగి ఉండటానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తాను దశాబ్దాలుగా చెబుతున్న మాటనూ గుర్తుచేశారు. ఈ విషయంలో ట్రంప్ మొదటి నుంచీ ఒకే వైఖరితో స్థిరంగా ఉన్నారని వైట్‌హౌస్ ప్రకటించింది. ఇందుకు నిదర్శనంగా గత 15 ఏళ్లలో ఆయన చేసిన 74 కీలక ప్రకటనల జాబితాను విడుదల చేసింది. ట్రంప్ వ్యాఖ్యల్లో భాష మారినా, ఉద్దేశం మాత్రం ఎప్పుడూ మారలేదని ఈ జాబితా స్పష్టం చేస్తోంది. ఉగ్రవాదానికి ప్రపంచంలోనే నంబర్ వన్ స్పాన్సర్‌గా ఉన్న ఇరాన్‌ను అణ్వాయుధాలు కలిగి ఉండటానికి నేను ఎప్పటికీ అనుమతించనని ట్రంప్ ఫిబ్రవరి 24, 2026న అన్నట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అంతకుముందు కూడా వారికి అణ్వాయుధాలు ఉండకూడదు. మధ్యప్రాచ్యంలో శాంతికి అదే అడ్డంకి వంటి వ్యాఖ్యలు చేశారు. కొన్నిసార్లు అణ్వాయుధాలు అని క్లుప్తంగా చెప్పిన సందర్భాలూ ఉన్నాయి. ట్రంప్ అధ్యక్ష పదవిని చేపట్టక ముందు నుంచే ఈ విషయంపై స్పష్టతతో ఉన్నారు. ఇరాన్‌ను అణుశక్తిగా మారడానికి మనం అనుమతిం చలేమని 2011 నవంబర్‌లోనే ఆయన వ్యాఖ్యా నించారు. సభలు, ఇంటర్వ్యూలు, అధికారిక ప్రకటనల్లో పదజాలం మారినా, ఇరాన్ అణుబాంబును సమకూర్చుకోకూడదన్న ప్రధాన డిమాండ్ మాత్రం మారలేదని వైట్‌హౌస్ వివరించింది. యురేనియం శుద్ధి, ఆంక్షలు, తనిఖీల విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే.

### యుద్ధంపై అమెరికా రోజుకు రూ.7వేల కోట్లు ఖర్చు



**వాషింగ్టన్, మార్చి 3:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో యుద్ధ ఖర్చులపై చర్చ మొదలైంది. తొలి 24 గంటల్లోనే అమెరికా దాదాపు 779 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.ఏడువేలకోట్లు ఖర్చు పెట్టినట్లు అం చనాలు వెలువడ్డాయి. ఈ మొత్తం సైనిక చర్యలు, విమానాలు, మిస్సైళ్ల ప్రయోగం, డ్రోన్ల వాడకాలు మొదలైన వాటికి సంబంధించిన ఖర్చు. విశ్లేషకుల అంచనా ప్రకారం, రకరకాల సామ్రాజ్య కార్యక్రమాలు, నౌకల పంపిణీ మొదలైన వాటుకు ముందే అందుబాటులో వేల కోట్లు ఖర్చు అయితే ఉన్నాయి. మిస్సైల్ ప్రయోగాలు, డ్రోన్ల వినియోగం, లాజిస్టిక్స్, ఇంధన వ్యయం వంటి అంశాలు కలిపి ఖర్చు మరింత పెరిగే అవకాశముంది. యుద్ధం అంటే కేవలం సైనిక శక్తి ప్రదర్శన మాత్రమే కాదు; అది దేశాల ఆర్థిక వ్యవస్థలతో చేసే భారీ పందెం. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై పరోక్షంగా ఈ యుద్ధఖర్చుల ప్రభావం పడుతుంది. రెండుదేశాల ఖజానాలు యుద్ధం ఖర్చుకు కరిగిపోతున్నట్లు అంచనా. అందులోనూ అమెరికా అతిపెద్ద నౌక అబ్రహాం లింకన్ నిర్వహణ వ్యయం కూడా మిలియన్ డాలర్ల పరిధిలోనే ఉంది. వీటికితోడు అత్యాధునిక యుద్ధ విమానాలు ప్రయోగిస్తుండటంతో వీటి నిర్వహణ వ్యయం కూడా భారీ స్థాయిలోనే ఉంది. ఇంధన ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కలగడం, ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపడం వంటి పరిణామాలు సాధారణ ప్రజల జీవితాన్ని మరింత కష్టతరం చేస్తాయి. ముఖ్యంగా ఆయిల్ ధరలుపెరిగితే దాని ప్రభావం అన్ని రంగాలపై పడటం అనివార్యం. ప్రతి రోజు గడిచే కొద్దీ ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. చివరికి గెలుపుఓటమి కంటే పెద్దది ఆర్థిక భవిష్యత్తు. వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే ఈ యుద్ధం ప్రపంచానికి భద్రతను అంది స్తుందా లేక మరిన్ని సమస్యలకు దారితీస్తుందా అనే సందేహం సాధారణ ప్రజల మనసుల్లో మెదులుతోంది. యుద్ధం మంటలు ఎంత త్వరగా చల్లారుతాయో, లేక మరింత వ్యాప్తి చెందుతాయో చూడాల్సి ఉంది. ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య పెరుగుతున్న విభేదాలు తీవ్రరూపం దాల్చగా, అమెరికా కూడా ఇజ్రాయెల్‌కు మద్దతుగా రంగంలోకి దిగింది. పరస్పర ఆరోపణలు, మిస్సైల్ దాడులు, వైమానిక దళాల ప్రతిదాడులతో పరిస్థితి ఒక్కసారిగా యుద్ధ దిశగా మళ్లింది. ప్రపంచ రాజకీయాల్లో కీలకమైన ఈ ప్రాంతం మళ్లీ అగ్నికుండంలా మారడంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. యుద్ధం ప్రారంభమైన వెంటనే ఇరాన్ తన రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకుని ప్రతిదాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ కీలక సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

## ఇండో-నేపాల్ బోర్డర్ మూసివేత




**ఖాట్మండు, మార్చి 3:** నేపాల్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా భద్రతా చర్యలలో భాగంగా భారత్‌నేపాల్ సరిహద్దును 72 గంటల పాటు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగుతాయని నేపాల్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ శక్తులు దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్ లేదా నేపాల్‌లో ఎన్నికలు జరిగినప్పుడు సరిహద్దు పాయింట్లను మూసివేయడం ఇరు దేశాల మధ్య ఒక సంప్రదాయంగా వస్తోంది. ఈసారి కూడా ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ ప్లాన్ 2025లో భాగంగా సరిహద్దును మూసివేయాలని నిర్ణయించినట్టు నేపాల్ సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్) అధికార ప్రతినిధి, డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట తెలిపారు. నిత్యావసర వస్తువుల రవాణా, సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకున్న విదేశీయులకు మాత్రం మినహాయింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నేపాల్ పార్లమెంటులోని 275 స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం జెన్ జడ్ ఉద్యమం కారణంగా కూలిపోయింది. అనంతరం ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించే లక్ష్యంతో సుశీల కార్కీ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో విదేశీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కూడా నిషేధం విధించారు. అనుమానిత వ్యక్తులు, గ్రూపులు దేశంలోకి చొరబడకుండా నిరోధించేందుకు భారత సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి)తో కలిసి సమన్వయం చేసుకుంటున్నామని డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట వివరించారు. జెన్ జడ్ ఉద్యమ సమయంలో లూటీకి గురైన ఆయుధాలు ఇంకా లభ్యం కాకపోవడంతో మరింత అప్రమత్తంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

## యూట్యూబ్‌లో ప్రధాని మోడీకి 30 మిలియన్ల ఫాలోయర్లు

మరో రికార్డు సాధించిన భారత్ ప్రధాని




**న్యూఢిల్లీ, మార్చి 3:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకున్నారు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో ఆయన చానెల్ 3 కోట్ల సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటింది. దీంతో ప్రపంచంలోని ప్రస్తుత, మాజీ దేశాధినేతల్లో యూట్యూబ్‌లో అత్యధిక సబ్‌స్క్రైబర్లు కలిగిన నేతగా ఆయన తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. ఈ ఘనతతో డిజిటల్ కమ్యూనికేషన్‌లో మోదీకి ఉన్న పట్టు స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇతర నేతలతో పోలిస్తే మోదీ భారీ ఆధిక్యంలో ఉన్నారు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు కేవలం 66 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు మాత్రమే ఉన్నారు. ఇది మోదీ సబ్‌స్క్రైబర్ల సంఖ్యలో దాదాపు నాలుగో వంతు మాత్రమే. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే ప్రధాని మోదీకి ఏకంగా ఏడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉండటం గమనార్హం. దేశీయంగా చూస్తే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూట్యూబ్ చానెల్ కన్నా మోదీ చానెల్‌కు సుమారు మూడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీల అధికారిక చానెళ్ల కన్నా కూడా మోదీ వ్యక్తిగత చానెల్ సబ్‌స్క్రైబర్లు నాలుగు రెట్లు అధికంగా ఉన్నారు. కొన్ని రోజుల క్రితమే (ఫిబ్రవరి 26న) ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల (100 మిలియన్ల) ఫాలోవర్ల మార్క్‌ను అధిగమించారు. ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. 2014లో ఇన్‌స్టాగ్రామ్‌లో చేరిన మోదీ, గత దశాబ్ద కాలంలో ప్రపంచనేతల్లో అత్యంత చురుకైన, విస్తృతమైన ఫాలోయింగ్ ఉన్న ఖాతాను నిర్మించుకున్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌లో రెండో స్థానంలో ఉన్న డొనాల్డ్ ట్రంప్‌కు 43.2 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా, మోదీకి ఆయన కన్నా రెట్టింపు ఫాలోవర్లు ఉన్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో (15 మిలియన్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా (14.4 మిలియన్లు), టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ (11.6 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇతర సోషల్‌మీడియా వేదికలైన ఎక్స్ (ట్విట్టర్) లో ప్రధానిమోదీకి 10.63కోట్ల మంది, ఫేస్ బుక్‌లో 5.4కోట్లమంది ఫాలోయర్లుఉన్నారు. ఈ గణాంకాలు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా యువతలో ప్రధాని మోదీకి ఉన్న విస్తృతమైన ఆదరణను, బలమైన సంబంధాలను తెలియ జేస్తున్నాయి,

## పాక్‌పై యుద్ధానికి భారత్ సన్నాహాలు!



**ఇస్లామాబాద్, మార్చి 3:** భారత్ తమపై మరో యుద్ధానికి సన్నాహాలు చేస్తోందని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సంచలన ఆరోపణలు చేశారు. సరిహద్దుల్లో భారత సైనిక కదలికలు భారీగా పెరిగాయని, ఈ పరిణామాలు ప్రాంతీయ శాంతికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో జర్దారీ ప్రసంగించారు. సింధు నదీ జలాల ఒప్పందం నుంచి భారత్ ఏకపక్షంగా వైదొలగడాన్ని జర్దారీ తీవ్రంగా తప్పుబట్టారు. దీన్ని ఆయన జల ఉగ్రవాదం (హైడ్రో టెర్రరిజం)గా అభివర్ణించారు. భారత్ నీటిని ఒక ఆయుధంగా మార్చి, పాకిస్థాన్ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయాలని చూస్తోంది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఆయన ఆరోపించారు. కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభించనంత వరకు దక్షిణాసియాలో శాంతి ఒక కలగానే మిగిలిపోతుందని జర్దారీ పునరు ద్ఘాటించారు. యుద్ధ క్షేత్రం నుంచి వైదొలగి, చర్చల వేదికపైకి రావాలని భారత్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో, అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వానికి కూడా జర్దారీ హెచ్చరికలు జారీ చేశారు. పాక్‌పై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలను అణచివేయాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే సరిహద్దుల్లో ఘజబ్ లిల్ హక్ పేరుతో సైనిక ఆపరేషన్ కొనసాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. పాకిస్థాన్ ఆరోపణలను భారత్ మొదటి నుంచీ ఖండిస్తోంది. సీమాంతర ఉగ్రవాదం ఆగే వరకు ఎలాంటి చర్చలకు ఆస్కారం లేదని భారత్ తేల్చిచెప్పింది. గతేడాది పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్ తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. ఉగ్రవాదాన్ని అరికట్టే వ్యూహాత్మక ఒత్తిడిలో భాగంగానే సింధు జలాల ఒప్పందంపై భారత్ నిర్ణయం తీసుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భద్రతా మండలి సమావేశానికి అధ్యక్షత వహించిన మెలనియా ట్రంప్



**న్యూయార్క్, మార్చి 3:** అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ అరుదైన ఘనత సాధించి చరిత్ర సృష్టించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశానికి అధ్యక్షత వహించిన తొలి అమెరికా అధ్యక్షుడి భార్యగా ఆమె నిలిచారు. ముందురోజు జరిగిన ఈ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించగా, మండలిలోని 15 సభ్య దేశాల శాశ్వత ప్రతినిధులు వరుసలో నిలబడి ఆమెకు స్వాగతం పలికారు. సాధారణంగా దేశాధినేతలకు కూడా లభించని ఈ గౌరవం ఆమెకు దక్కింది. ఈ సందర్భంగా మెలానియా మాట్లాడుతూ సరికొత్త ఆలోచనను ప్రపంచం ముందుంచారు. ఒకే ఒక్క డిజిటల్ దేశం ఏర్పాటు అనివార్యమా అని ప్రశ్నించారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో డిజిటల్ కరెన్సీ, చెల్లింపుల వ్యవస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన విస్తృత సమాచారం ఇప్పటికే మీడియా, ఆర్థిక మార్కెట్లలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. కాబట్టి ఈ ఆలోచన మరీ అసాధ్యమేమీ కాదు. మనం ఇప్పుడు సరిహద్దుల్లేని టెక్నాలజీ యుగంలో ఉన్నామని ఆమె వివరించారు. పిల్లలు, టెక్నాలజీ, సంఘర్షణలో విద్య అనే అంశంపై జరిగిన ఈ సమావేశం చాలా ప్రశాంత వాతావరణంలో సాగింది. సాధారణంగా భద్రతా మండలిలో కనిపించే వాగ్వాదాలు, ఆరోపణలకు బదులు సభ్య దేశాలు మర్యాదపూర్వకంగా వ్యవహరించాయి. అమెరికాతో తరచూ విభేదించే రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెంజియా సైతం, ఇంత ముఖ్యమైన అంశంపై సమావేశం ఏర్పాటు చేసినందుకు మీకు కృతజ్ఞతలని మెలానియాను ఉద్దేశించి అన్నారు. ఈ సమావేశంలో కొన్ని భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి. ఆన్‌లైన్‌లో పిల్లలను రక్షించేందుకు తమ దేశం తీసుకుంటున్న చర్యలను ఫ్రాన్స్ ప్రతినిధి జెరోమ్ బోనఫాంట్ వివరించారు. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఈ చట్టాలను అమెరికా కంపెనీలకు వ్యతిరేకంగా ఉన్న సెన్సార్‌షిప్‌గా విమర్శించడం గమనార్హం. మరోవైపు ఉక్రెయిన్ నుంచి 20వేల మంది పిల్లలను రష్యాకిడ్నాప్ చేసిందన్న ఆరోపణలను నెబెంజియా ఖండించారు. అది రష్యాకు వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారమని ఆయన కొట్టిపారేశారు. గతంలో బిల్ క్లింటన్ భార్య హిల్లరీ క్లింటన్ కూడా భద్రతా మండలి సమావేశాలకు అధ్యక్షత వహించారు. అయితే, ప్రథమ మహిళగా కాకుండా, విదేశాంగ మంత్రి హోదాలో ఆ బాధ్యతలు నిర్వర్తించారు. కానీ, ఒక దేశాధినేత భార్యగా ఈ బాధ్యతను స్వీకరించడం మెలానియాతోనే మొదలైంది.

## కేంద్ర మాజీ మంత్రి కెపి ఉన్నికృష్ణన్ కన్నుమూత



**కోజికోడ్, మార్చి 3:** భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి కేపీ ఉన్నికృష్ణన్ (89) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, కేరళలోని కోజికోడ్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ ఉదయం తుదిశ్వాస విడిచారు. 1936లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో జన్మించిన ఉన్నికృష్ణన్, విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చి అప్రతిహత విజయాలను అందుకున్నారు. కేరళ రాజకీయ చరిత్రలో వటకర లోక్‌సభ నియోజకవర్గం నుండి 1971 నుండి 1996 వరకు వరుసగా ఆరుసార్లు ఎంపీగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఆయన మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పలువురు జాతీయ స్థాయి నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉన్నికృష్ణన్ పేరు వినగానే భారతీయులకు గుర్తొచ్చేది 1990 నాటి గల్ఫ్ యుద్ధ కాలపు సాహసోపేత చర్య. అప్పట్లో వీపీ సింగ్ ప్రభుత్వంలో ఉపరితల రవాణా, కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా ఉన్న ఆయన, కువైట్‌లో చిక్కుకుపోయిన లక్షన్నర మంది భారతీయులనురక్షించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రాణాలకు తెగించి, అప్పటి ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఉన్న అత్యంత రహస్య ప్రాంతానికి వెళ్లి, ఆయనతో చర్చలు జరిపి భారతీయుల తరలింపును సుసాధ్యం చేశారు. కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా,పార్లమెంటరీ కమిటీల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయనకు భార్య అమృత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలపై ప్రధాని మౌనం వీడాలి: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, మార్చి 3:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. భారతదేశం "నైతికంగా స్పష్టంగా" ఉండాలని అన్నారు. ఓ దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై మోడీ "మాట్లాడాలి" అని రాహుల్ గాంధీ అన్నారు. మౌనం "ప్రపంచంలో భారతదేశం స్థానం తగ్గుతుంది" అని అభిప్రాయపడ్డారు. "భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం, మానవ జీవితాల రక్షణలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమత్వం, వివాదాల శాంతియుత పరిష్కారంలో పాతుకుపోయింది. అది స్థిరంగా ఉండాలి" అని రాహుల్ గాంధీ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రపంచమే మన మార్కెట్

### నాణ్యతలో రాజీపడొద్దు: పోస్ట్ బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 3:** బలమైన ఆర్థిక వ్యవస్థతో భారతదేశం ప్రపంచానికి ఆశాకిరణంగా కొనసాగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచానికి ఆశాకిరణంగా భారతదేశం ఆవిర్భవిస్తున్నందున, వేగవంతమైన ఆర్థికాభివృద్ధి విక్షి త్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడానికి మూలస్తంభంగా మారిందని అన్నారు. పోస్ట్–బడ్జెట్ వెబ్‌నార్‌లో ఆర్థిక వృద్ధిని నిలబెట్టడం, బలోపేతం చేయడం అనే అంశంపై ప్రధాని మోడీ ప్రసంగించారు. నేడు ప్రపంచం నమ్మకమైన, స్థితిస్థాపక తయారీ భాగస్వాముల కోసం వెతుకుతోందని అన్నారు. ఈ దిశలో భారతదేశం కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తోందని, పరిశోధన, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అధిక సామర్థ్యం గల రవాణా వ్యవస్థ అభివృద్ధి, రైల్వే లు, రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, జలమార్గాల మధ్య మెరుగైన సమన్వయం, మల్టీమోడల్ కనెక్టివిటీ విస్తరణ లాజిస్టిక్ ఖర్చులను తగ్గించడానికి చాలా అవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభిప్రాయపడ్డారు.

### కేంద్రం మౌనం తటస్థత కాదు.. బాధ్యతారాహిత్యం: సోనియాగాంధీ



**న్యూఢిల్లీ, మార్చి 3:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఖమేనీ మృతికి సంతాపం కూడా తెలపకపోవడం చారిత్రక మిత్రుడికి ద్రోహం చేయడమేనని సోనియా అభివర్ణించారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ మౌనంగా ఉండటం తటస్థత అనిపించుకోదని, అది నైతిక బాధ్యత నుంచి తప్పుకోవడమేనని ఆమె ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.

### రాష్ట్ర ప్రజలకు కెసిఆర్

## హోలీ పండుగ శుభాకాంక్షలు!

హైదరాబాద్, మార్చి3 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర ప్రజలకు తెలంగాణ మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హోలీ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి నడుమ ప్రేమాభిమానాలను విరజిమ్మే రంగుల పండుగగా, హోలీ పండుగ భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకున్నదని పేర్కొన్నారు. ఆకులురాలే శిశిరం నుంచి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ, ప్రకృతిలో నూతనత్వానికి సూచకంగా హోలీ నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఆశలు అడుగంటి వున్న తెలంగాణ ప్రజల్లో, కొత్త ఆశలు విశ్వాసాలు తిరిగి పుంజుకోవాలని, ప్రజల నడుమ మరింతగా సహోదరతత్వం పెంపొందాలని హోలీ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షి ంచారు.

### జడ్చర్ల ఏరియా హాస్పిటల్ ఘటనపై

## ఆరోగ్యశాఖ మంత్రి ఆగ్రహం

### విచారణకు ఆదేశించిన రాజనర్సింహా

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 03ః నాగర్‌కర్నూల్ జిల్లా జడ్చర్ల ఏరియా హాస్పిటల్‌లో జరిగిన ఘటనపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఆదేశాలతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) కమిషనర్, డాక్టర్ అజయ్ కుమార్ సోమవారం ఉదయం జడ్చర్ల హాస్పిటల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, డాక్టర్లు, హాస్పిటల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి, ఘటనకు కారకులైన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళ, డ్యూటీ ఆర్ఎంవో డాక్టర్ హరినాథ్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ మునీషా, మార్చురీ సపోర్టింగ్ స్టాఫ్ రవిప్రకాశ్‌లను సస్పెండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ప్రకటించారు.

## రామగుండం ఉద్యోగాల్లో కోత

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ఉద్యోగాల్లో కోత పెట్టేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోవడంతో పాటు, నష్టాల నేపథ్యంలో ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవాలని, ఇదే సమయంలో ఉద్యోగుల వేతన భారం కూడా తగ్గించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ (డీవోఎఫ్) సూచించినట్టు సమాచారం. దీంతో ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం అనివార్యంగా ఉద్యోగాల కోతకు నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే నాన్ ఎగ్జిక్యూటివ్ నియామకాలకు మంగళం పాడిన ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం భవిష్యత్‌లో ఎగ్జిక్యూటివ్, అవుట్ సోర్సింగ్ నియామకాలకు స్వస్తి పలుకనున్నది. చివరికి కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను కూడా తగ్గిం చాలనే నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం 420వరకు అధికారులు, ఉద్యోగులు, 1,200 మంది కాంట్రాక్టు కార్మికులు ఈ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. వీరికి యేటా వేతనాలకు సుమారు రూ.50కోట్లు యాజమాన్యం వ్యయం చేస్తుంది. 2025 మార్చి 31నాటికి రూ.158కోట్ల నష్టాల్లో ఉంది. ఇటీవల యాజమాన్యం ఉద్యోగాల కోతకు సంకేతాలిచ్చింది. 20శాతం ఉద్యోగాలు తగ్గించుకోవాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేస్తోంది, ఆర్ఎఫ్‌సీ ఎల్ సాంకేతిక వైఫల్యాలతో ఇప్పటికే 50 నుంచి 60మంది అధికారులు పరిశ్రమను వీడి ఇతర పరిశ్ర మల్లో చేరారు. వీరి స్థానాల్లో ఇక భర్తీ చేసే అవకా శాలు లేవు. అలాగే కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను కూడా 1,000 వరకు కుదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## మిషన్ లైఫ్ భవిష్యత్ తరాల పరివర్తన ఉద్యమం

### మాజీ రక్షణ కార్యదర్శి గిరిధర్

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:మిషన్ లైఫ్ (పర్యావరణానికి జీవన శైలి) దేశ, భవిష్యత్ తరాల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో కూడిన పరివర్తన ఉద్యమమని మాజీ రక్షణ కార్యదర్శి గిరిధర్ వెల్లడించారు. మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో వాతావరణ మార్పు ఒకటన్నారు. ఇంధన సామర్థ్యం పెంచేందుకు 5 నుండి 10 శాతం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఇంధన సామర్థ్యం దేశానికి చారిత్రాత్మక అత్యవసరమని చెప్పారు. మిషన్ లైఫ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ప్రజారోగ్య ఫలితాలు గణనీయంగా మెరుగుపడతాయని, అరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గిస్తుందని తెలిపారు. అంతేకాకుండా ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక శక్తి, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ–పర్యాటక రంగం, సహజ వనరుల పరిరక్షణ వంటి రంగాల్లో పర్యవరణ ఉపాధిని సృష్టిస్తుందని తెలియచేశారు. అధునాతన ఇంధన, సమర్థవంతమైన సాంకేతిక పరిజ్ఞానాల వేగవంతం, లక్షలాది మందికి ఉపాధి కల్పన తదితర లక్ష్యంగా ఈ పథకాన్ని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ద్వారా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ. 1,000 కోట్ల వ్యయంలో, రూ.875 కోట్లు వడ్డీ రాయితీ కోసం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇంధనసామర్థ్య అప్‌గ్రేడ్‌లను కోరుకునే మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కోసం రాయితీ ఫైనాన్స్‌ను సులభతరం చేయడం. ఆర్థిక అడ్డంకులను తగ్గించడం ద్వారా, ఈ పథకం స్థిరత్వం మరియు పోటీతత్వం కలిసి ఉండేలా చూస్తుందన్నారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని ముంబై, ఢిల్లీ, లక్నో, భోపాల్, సూరత్, జైపూర్, చండీగఢ్, భువనేశ్వర్, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలతో పాటు లక్షలాది ఎంటర్‌ప్రైజెస్‌తో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రోపాలిటన్ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందని చెప్పారు. మిషన్ లైఫ్ బాధ్యతాయుతమైన వృద్ధి ద్వారా ప్రపంచాన్ని నడిపించే భారతదేశ అవకాశాన్ని సూచిస్తుందని గిరిధర్ ముగించారు.

## బిజెపి కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు

### ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు

### పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్

హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రంగులు పూసుకుని నాయకులు, రాష్ట్ర అధికారులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఐక్యత, స్నేహభావం, సామరస్యాన్ని ప్రతిబింబించేలా వేడుకలను జరుపుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ మాట్లాడారు. తెలంగాణ ప్రజలందరికీ, మీడియా ప్రతినిధులందరికీ భారతీయ జనతా పార్టీ తరఫున హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. గత మూడు నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతుందన్నారు. అధికారంలోకి వచ్చి 26 నెలలు కావొస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో మాత్రం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి టిపిసిసి చీఫ్‌గా ఉన్నప్పుడు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు సహా అన్ని హామీలు అమలు చేస్తామని గొప్పగా ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలు ఇప్పుడు ఎందుకు కాంగ్రెస్‌కు ఓటేశామా?" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, తాజాగా మూసి పునరుజ్జీవం పేరుతో, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరిట ప్రజల భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నేసింది. తెలంగాణలో ప్రజలు ఆత్మహత్యలు కాంగ్రెస్ మాత్రం వసూళ్ల వైద్యం చేయించుకోలేక, రిటైర్మెంట్ డబ్బులు రాక, అప్పుల భారం తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిఎం రూ.1000 కోట్లు అంటున్నాడు. ఇంత దారుణం మరెక్కడాలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రధాని దేశ ప్రజలలో గొప్ప విశ్వాసాన్ని పొందారు. ప్రపంచ దేశాలు కూడా ఆయనను స్ట్రాంగ్ లీడర్‌గా చూస్తున్నాయి. దేశంలో సుపరిపాలన, అభివృద్ధి, భద్రత అందించడం ఆయనకే సాధ్యమైంది.

# సైనైడ్ కంటే గడ్డి మందే ప్రమాదకరం

- దేశంలో, రాష్ట్రంలో పారాక్వాట్‌ను వెంటనే నిషేధించాలి
- త్వరలో సిఎంకి వినతిపత్రం
- ఐఎంఏ సదస్సులో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ఎంపిలు కడియం కావ్య, ఈటల రాజేందర్



హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: కలుపు నివారణకు వినియోగించే పారాక్వాట్ గడ్డిమందుతో మనుషుల ప్రాణాలు పోతున్నాయని రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పారాక్వాట్ గడ్డి మందు వినియోగంపై నిషేధం విధించేలా సిఎం రేవంత్‌రెడ్డితోపాటు స్పికర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ మేరకు గడ్డి మందు (పారాక్వాట్)ను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాణాంతక గడ్డి మందు దుష్ప్రభావాలపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎంపి కడియం కావ్య మాట్లాడుతూ... వ్యవసాయంలో కలుపు నివారణకు విరివిగా వినియోగిస్తున్న గడ్డి మందు ప్రాణాంతకమైందని, సైనైడ్ కంటే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. గడి మందు రైతులకు మాత్రమే కాకుండా రానున్న తరాలకు కూడా ముప్పుగా మారిందని పేర్కొన్నారు. భూమి సారాన్ని నాశనం చేస్తోందని, రెండు మూడు చుక్కలైనా సరే మానవ శరీరంలోకి వెళ్తేనే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని హెచ్చరించారు. గడ్డి మందును పూర్తిగా నిషేధించే వరకు తన పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై అన్ని రాజకీయ పార్టీల ఎంపీలతో కలిసి ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసి, సంతకాలు సేకరించి కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేస్తానని తెలిపారు. అదేవిధంగా.. గడ్డి మందు నిషేధంపై చేస్తున్న పోరాటానికి పూర్తి అండగా ఉంటానని ఎంపి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. జాతీయ పెస్టిసైడ్, పెట్రోకెమికల్, ఫార్మాసిటికల్ స్టాండింగ్ కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నానని, గత వారం సమావేశంలో గడ్డి మందుపై నిషేధం విధించాలని డిమాండ్ పెట్టానని గుర్తు చేశారు. గడ్డి మంది తాగి ఎంతో మంది రైతులు, సామాన్య ప్రజలు ఆత్మహత్యకు పాల్పడతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా... కోటిలోని ఐఎంఏ కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కిషన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వైద్యులు హాజరయ్యారు. గడ్డి మందు (పారా క్వాట్) వల్ల జరుగుతున్న మరణాలు, భూమి సారంపై పడుతున్న దుష్ప్రభావాలపై విస్తృతంగా చర్చించారు. అన్ని పార్టీల నాయకులు పార్టీ రాజకీ యాలకు అతీతంగా ఏకగళంతో పరాక్వాట్ గడ్డి మందును నిషేధించేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. పరాక్వాట్ గడ్డి మందుకు ఎటు వంటి ప్రత్యామ్నాయ విరుగుడు మందు (యాంటీడోట్) లేదని, ఇప్పటికే 70కు పైగా దేశాలు ఈ మందును నిషేధించాయని, కానీ ఆ మందును విదేశాలు భారత్‌కు ఎగుమతి చేసి దేశ ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తక్షణమే పరాక్వాట్‌పై నిషేధం విధించాలని సీఎంని కోరుతూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించింది. పార్లమెంట్, అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తుతామని ఎంపీలు, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు.



### కమ్యూనిటీ పారా మెడికల్

## సర్టిఫికెట్స్ ఇప్పించండి

### మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సూర్యాపేట జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం మెమోరాండం

హైదరాబాద్, మార్చి3 ప్రభాతవార్త: గ్రామీణ వైద్యులకు పరీక్షలు నిర్వహించి కమ్యూనిటీ పారా మెడికల్ సర్టిఫికెట్స్ ఇప్పిచాలని డిమాండ్ చేస్తూ టిపిసిసి అధ్యక్షుకుడు మహేష్‌కుమార్‌ను కలిసి సూర్యాపేట జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం కలిసి మెమోరాండాం సమర్పించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయనను కలిసి మాజి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జి.వొ నంబర్ 1274 విడుదల చేసి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని ప్రతిపాదించారనీ గ్రామీణ వైద్యులు మహేష్‌కుమార్‌కు గుర్తుచేశారు. అప్పట్లో వైఎస్ చొరవ తీసుకొని 104,108 అంబులెన్సులో ప్రాక్టికల్స్ పూర్తి చేయించారనీ తెలిపారు. శిక్షణ పూర్తి ఆయిన వారికి పరీక్షలు నిర్వహించి కమ్యూనీటి పారా మెడికల్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారనీ ఐతే అకాల మరణంతో ట్రైనింగ్ ఆగిపోయిందనీ ఆయన ప్రతిపాదనలు తరువాత ప్రభుత్వాలు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి మరియు ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకవెళ్లి మీ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయిస్తామని హామి ఇచ్చారు.

## ప్రభుత్వ ఆలోచనలను గుర్తించి పని చేయండి

### కొత్త కలెక్టర్లతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్, మార్చి3 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ఆలోచనలు,ఆకాంక్షలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లా కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని, ఈ సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేర్చవలసిన బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల అవసరాలను అర్థం చేసుకొని పని చేయాలని కలెక్టర్లకు దిశ నిర్దేశం చేశారు. ఐఏఎస్ అధికారుల కెరీర్లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని అన్నారు. ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతోపాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజాపాలనలో ప్రజాకేంద్రంగా పాలన సాగాలని, ప్రజలకు మేలు చేసే పనులనే జిల్లా పాలకులుగా చేపట్టాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలుచేసి అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఒక టీమ్ లాగా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు.

## రేవంత్ ప్రతిపాదనకు స్వాగతం

### రాహుల్ గాంధీ ప్రధాని కావాలని కోరిన సిఎం..

### సమర్థించిన నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి




హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: రాహుల్ గాంధీ దేశానికి ప్రధాన మంత్రి కావాలని డిసిసి శిక్షణా ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నమనీ రాహుల్ గాంధీ కూడా ముఖ్యమంత్రి ప్రతిపాదకు సమ్మతి తెలపడంను స్వాగతిస్తున్నామనీ నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రెండుసార్లు రాహుల్‌కి ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్న కూడా ఆసక్తి చూపలేదనీ గుర్తుచేశారు. ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలు తెలుసుకొని తర్వాత నే పాలకుడిగా రావాలి అనుకున్నారనీ ఆయన భాష్యం చెప్పారు. రాహుల్ పార్లమెంట్‌లో అనేక సమస్యలపై చేస్తున్న పోరాటాన్ని దగ్గర ఉండి చూస్తున్నామనీ వెల్లడించారు.ఇప్పుడు ఆయన మొదటిసారి ప్రధాన మంత్రి ఆయ్యేందుకు అంగీకారం తెలిపారు. దేశానికి రాహుల్ ప్రధాన మంత్రి కావాల్సి న అవసరం ఉందనీ చెప్పారు. రాహుల్ దేశంలోని సామాజిక సమస్యలపై పూర్తి అవగాహన తెచ్చుకున్నారనీ చెప్పారు. భారత్ జోడో, న్యాయ యత్రాలతో ఆయన దేశం అంత పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారనీ వివరించారు. లీడర్ ఆఫ్ అపొజిషన్‌గా ఉండి ఆయన నేడు దేశ సమస్యలపై అద్భుతమైన పోరాటం చేస్తున్నారనీ రవి కితాబు ఇచ్చారు. సమాజంలో ఎవరి వాటా ప్రకారం వాళ్లకు ఫలాలు అందాలని ఉద్యమిస్తున్నారనీ తెలిపారు. రాహుల్ గాంధీ ఆశయాలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేపట్టి బిసికు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్నారనీ వివరించారు. నేడు దేశానికి రాహుల్ గాంధీ సేవలు చాలా అవసరమనీ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికిఎంపీల ఫోరమ్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## వెలుగుమట్ల భూములపై అవాస్తవాలు మాట్లాడొద్దు

- ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 03ః వెలుగుమట్ల భూములపై అవాస్తవాలు మాట్లాడొద్దని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సీపీఐఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఖమ్మం పట్టణంలోని వెలుగుమట్ల గ్రామంలో దాదాపు 700 కుటుంబాలు 10 సంవత్సరాలుగా భూదాన భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని నివసిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మంది పోలీసులు, బుల్డోజర్లతో బలవంతంగా కుటుంబాలను బయటకు పంపించి ఇండ్లను కూల్చేశారని మంగళవారం ఒక ప్రకటనలో మండిపడింది. బాధితులు ఇప్పటికీ రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారని, ఈ ఘటనపై స్పందిస్తూ కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బుల్డోజర్ రాజ్యాన్ని నడుపుతోందని ప్రస్తావించారని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి దీనిపై మాట్లాడుతూ.. ఇదంతా అవాస్తవమని, కేరళ ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర రాజకీయాలు, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాట్లాడటాన్ని పార్టీ రాష్ట్రకమిటీ తీవ్రంగా ఖండించింది. వాస్తవంగా వెలుగుమట్లలో ఎంత విధ్వంసం జరిగిందో, కుటుంబాలు ఎన్ని ఇబ్బందుల పాలవుతున్నారో రాష్ట్ర ప్రజానీకానికి తెలుసునని, శిబిరాల్లో ఉన్నవారికి కనీస సౌకర్యాలు కూడా లేవనే విషయం మీడియాలో, పత్రికల్లో వస్తుందని తెలిపింది. అక్కడకు వెళ్ళిన మీడియా ప్రతినిధులను కూడా అరెస్టు చేసి, నిర్బంధిస్తున్నారని, ఖమ్మం జిల్లాలో సిపిఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నది వాస్తవం కాదా? ఆ ఎం.పి.కీ ఆ పోరాటాలు కనపడటం లేదా? వినపడటం లేదా? అని ప్రశ్నించింది. ఊహాగానాలతో మాట్లాడటం సమంజసం కాదని, అవాస్తవాలను మాట్లాడటం సరైందికాదని హెచ్చరించింది. ఇప్పటికైనా అక్కడున్నటువంటి పేదలకు అక్కడే ఇండ్లు నిర్మించి, స్థిర నివాసం ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. అవాస్తవాలను మాట్లాడి ప్రజలను మభ్యపెట్టదలచుకుంటే తప్పకుండా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెపుతారని, ఇక్కడి ప్రభుత్వం ఇలాంటి వైఖరి అనుసరిస్తే కేరళలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఇలాంటి వైఖరే అనుసరిస్తుందని.. అక్కడి ప్రజలు కూడా అర్థం చేసుకునే అవకాశం వుంటుందని ప్రకటనలో తెలిపింది. అక్కడి వామపక్ష ప్రభుత్వం ప్రజలకు అండదండలు అందిస్తూ పేదరికాన్ని నిర్మూలిస్తూ, ఇండ్లు కట్టిస్తూ, విద్య వైద్యం ఉచితంగా అందిస్తూ నిరుద్యోగ నిర్మూలనకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకుంటూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పెద్దఎత్తున పేద ప్రజల పక్షాల నిలబడుతుందని పేర్కొంది. కేరళలో ఉన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందని, విచ్ఛిన్నకరమైన చర్యలకు పాల్పడుతుందని వాటన్నింటినీ ఎదుర్కొని అక్కడి ప్రజలు గుణపాఠం ప్రకటించింది.

## భూదాన్ భూములపై నాయకుల కన్ను

### బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు

హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: ఖమ్మం పట్టణ పరిధిలోని వెలుగుమట్ల గ్రామంలో సుమారు 62 ఎకరాలు 7 గుంటల భూదాన్ భూమిని 2014లో భూదాన్ యజ్ఞ బోర్డు ద్వారా దాదాపు 800కు పైగా పేద కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 100 గజాల చొప్పున కేటాయించారని, ఆ భూములపై కొందరు రాజకీయ కన్నేశారని బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భూధాన్ భూములు కేటాయించినప్పటి నుంచి ఆ కుటుంబాలు అడవిలా ఉన్న ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుని, నివాసయోగ్యంగా మార్చుకుని జీవనం సాగిస్తున్నారు.ఆ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించాలని పేద కుటుంబాలు అనేక మార్లు ప్రభుత్వాన్ని కోరాయి. 2019లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ సైతం కూడా అక్కడ నివసిస్తున్న నిరుపేదలకు కనీస వసతులు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఇళ్లను కూల్చివేయకుండా, సమగ్ర విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు పలుమార్లు స్టేటస్ కో ఆదేశాలు ఇచ్చింది.అయితే, ఆ భూములపై కొందరు రాజకీయ నాయకులు కన్నేశారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం కూడా అక్కడి పేదలను బలవంతంగా వెళ్లగొట్టేందుకు ప్రయత్నించాయి. భూదాన్ బోర్డు ఇచ్చిన అలాట్మెంట్ లెటర్లు నకిలీ అని పేర్కొంటూ భూదాన్ యజ్ఞ బోర్డు తరఫున వివాదాలు సృష్టించారు. దీనిపై బాధితులు కోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆరు సార్లు పాజిటివ్ ఆర్డర్లు ఇచ్చింది. ఇటీవల, సుమారు 4 వేల మంది పోలీసులతో, 200కు పైగా బుల్డోజర్లతో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా భారీ ఎత్తున దళాలు మోహరించి, తెల్లవారుజామున పేద కుటుంబాల ఇళ్లను కూల్చివేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు అనే తేడా లేకుండా వారిని బయటకు తీసి, వారి సామాన్లను ట్రక్కుల్లో వేసి అంబేద్కర్ భవన్ వద్ద వదిలేశారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన.భారతీయ జనతా పార్టీ తరఫున మేము అక్కడి పేదల పక్షాన నిలబడి ధర్నా నిర్వహించగా, మా నాయకులపై, కార్యకర్తలపై లాఠీచార్జ్ చేసి కేసులు నమోదు చేశారు. తర్వాత ఇతర రాజకీయ పార్టీలు స్పందించాయి. బిఆర్ఎస్ నాయకుడు కెటిఆర్ ఖమ్మం వచ్చి పరామర్శించడం జరిగింది. కానీ 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యను పరిష్కరించకుండా, ఇప్పుడు సానుభూతి చూపడం రాజకీయ నాటకమే అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భూదాన్ భూములపై సమగ్రంగా వైట్ పేపర్ విడుదల చేయాలి. వెలుగుమట్ల భూములపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరపాలి. అక్కడి పేద కుటుంబాలకు గౌరవప్రదంగా భూమిపై హక్కులు కల్పించి, కూల్చివేసిన ఇండ్లను తిరిగి కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. పేదలకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం కొనసాగిస్తుంది.

## హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: రాష్ట్రంలోని కోర్టులకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. ఇంతకు ముందు నాంపల్లి కోర్టుతో పాటు హైకోర్టు, కరీంనగర్ కోర్టులకు రెండుసార్లు బాంబు బెదిరింపులు రావడం తెలిసిందే. దీని తరువాత నాంపల్లి సిబిఐ కోర్టుకు, హైకోర్టుకు మరోదఫా బెదిరింపు లు వచ్చాయి. వీటివల్ల కోర్టుల రోజువారి కార్యకలాపాలకు ఆటకం ఏర్పడింది. ఇక తాజాగా మంగళవారం నాడు హైకోర్టుకు మరోసారి బాంబు బెది రింపు వచ్చింది. హోళీ పండగ అయినప్పటికీ కొందరు న్యాయవాదులు, కక్షిదారులు హైకోర్టుకు రావడంతో బాంబు బెదిరింపుల కారణంగా వారంతా గంటకు పైగా దూరం వుండాల్సి వచ్చింది. బాంబు బెదిరింపు నేపథ్యంలో పోలీసులు జాగిలాలతో వెంటనే రంగంలో దిగి కోర్టు ప్రాంగణమంతాగాలించి చివరకు ఎలాంటి బాంబు లేదని నిర్ధారించాక ఊపిరి పీల్చుకున్నారు. కాగా హైకోర్టుకు వచ్చిన బాంబు బెదిరింపు తమిళనాడు నుంచి వచ్చిన ట్లు చెబుతున్నారు. ఇంతకు ముందు వచ్చిన బాంబు బెదిరింపులు కూడా తమిళనాడు నుంచే రావడం గమనార్హం.

**ఆకతాయల చర్యల వల్ల కోర్టుల సమయం వృధా...పోలీసుల ఉరుకులు, పరుగులు:** ఇదిలావుండగా రాష్ట్రంతో పాటు ఎపిలోని కోర్టులకు గడచిన పది రోజుల వ్యవధిలో పలుమార్లు వచ్చిన బాంబు బెదిరింపులు విలువైన కోర్టుల సమ యాలను వృధా చేశాయి. బాంబు బెదిరింపుల నేపథ్యంలో న్యాయవాదులతో పాటు న్యాయమూర్తులు, కక్షిదారులు కూడా ఇబ్బందులకు గురవుతు న్నారు. ఇదే సమయంలో పోలీసులు గంటల తరబడి ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. గతంలో కోర్టుల్లో బాంబులు పేలిన ఉదంతాలు వుం డడంతో ఈ తరహా బెదిరింపులను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. కాగా బాంబు బెదిరింపులకు పాల్పడ్డ ఆకతాయిలు ఇప్పటి వరకు పట్టుబ డక పోవడం గమనార్హం.

## భర్తను చంపిన భార్యకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: భర్తను చంపిన భార్యకు ఎల్‌బి నగర్ కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు మూడు వేల రూపాయల జరిమాన విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. రాజేంద్రనగర్‌లోని కాటేదాన్‌కు చెందిన దినసరి కూలి ప్రభు గౌడ్(26)ను 2017 ఏప్రిల్ 7వ తేదీన అతని భార్య లక్ష్మీ చిన్న విషయమై తగాదా పడి కిరోసిన్ పోసి నిప్పంటించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రభుగౌడ్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటనలో లక్ష్మీపై హత్య కేసు నమోదు చేసిన మైలార్‌దేవుపల్లి పోలీసులు ఆమెను అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ తొమ్మిదేళ్లపాటు సాగింది. దీనిపై న్యా యమూర్తి సత్యేంద్ర మంగళవారం తీర్పు చెబుతూ నిందితురాలు లక్ష్మీకి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల శిక్ష అదనంగా అనుభవించాల్సి వుంటుందని ఆయన తీర్పు చెప్పారు. ఈ కేసులో పక్కాగా వ్యవహరించిన పోలీసులను రాజేంద్ర నగర్ డిసిపి శ్రీనివాస్ అభినందించారు.

## నాలుగు రోజులపాటు మండుటెండలు

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులపాటు ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు రెండు నుండి మూడు డిగ్రీల మేర పెరుగుతాయని పేర్కొంది. ఆదిలాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, గద్వాల, ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఈ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుండి 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

## మార్చి 6 నుంచి జూన్ 12 వరకు

# ‘ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమం

- రాష్ట్రంలో శాఖల వారీగా 10 వివిధ థీమ్‌లలో 99 రోజుల కార్యక్రమం
- గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత,ఫైళ్ల క్లియరెన్స్
- ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం
- మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక
- కలెక్టర్ల సదస్సులో అధికారులకు సీఎం రేవంత్ సూచనలు, ఆదేశాలు




ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి3: రాష్ట్రంలో 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లను భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ‘ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సూచనలు, ఆదేశాలు చేశారు. వార్డు సభ్యులు, సర్పంచులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు అందరికీ జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వారి విధులు, బాధ్యతలకు సంబంధించి అవగాహన కల్పించడంతో పాటు ప్రింటెడ్ మెటీరియల్ వారికి అందించాలని చెప్పారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయ పంప్ సెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సోలార్ మోటార్లతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. ఇళ్లపైన సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం.సోలార్ విద్యుత్ వాడుకోవటంతో పాటు గ్రిడ్‌కు కనెక్ట్ చేయడం ద్వారా వచ్చే ఆదాయంపై అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామ,వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలి. వాటితో గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కలిగిన లబ్ధిని ప్రజలకు వెల్లడించాలి అని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలు ప్రజలకు అందేలా చూడాలి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేయాలని ఆదేశించారు. మెడికల్ కళాశాలల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు, వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఉన్నారు.వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్) చేపట్టాలి.. అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాలి. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదు అని స్పష్టం చేశారు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగాం.. సాంకేతికతను సరిగా వినియోగించుకోకపోవడంతోనే ఇంత పెద్ద సంఖ్యలో అనుచిత లబ్ధి పొందారు అని చెప్పారు. రవాణా శాఖ డాటా ఆన్‌లైన్ పూర్తి చేయాలి. పాఠశాలలు బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలి అని పేర్కొన్నారు. ఎక్కువ సంఖ్యలో డ్రైవర్లు కలుసుకునే చోట్లనే ఈ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సాప్ నెంబర్‌ను రవాణా శాఖ ఇవ్వాలి. ఆ నంబర్‌కు వచ్చే సమాచారం ఆధారంగా అక్కడ మరమ్మతులు చేపట్టడం, ఇతర జాగ్రత్తలు తీసుకోవడం చేయాలి అని చెప్పారు.. ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల వెంట భారీగా చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. వ్యర్థాలను తీసుకువచ్చే వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించాలి. కేసులు పెట్టాలి. ఓ ఆర్ ఆర్ ఏజెన్సీని బాధ్యులను చేయాలి అని ఆదేశించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించాలి. పిల్లలకు పోషకాహారం అందాలి. అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి అని సూచించారు. మూడు కార్పొరేషన్లతో పాటు నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాయ్స్, గరల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలి అని చెప్పారు. ఆయా హాస్టళ్ల ఏర్పాటుకు అనుమతులు, వాటిపై పర్యవేక్షణ ఉండాలి. వాటి యాజమాన్యాలకు జవాబుదారీతనం ఉండాలి. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ సిగరెట్ల వినియోగం జరిగితే అందుకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలి అని చెప్పారు. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్, పీఈటీ ఎలా ఉంటారో అలానే సైకాలజిస్ట్ ఉండేలా చూడాలి అని చెప్పారు. వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలి అని పేర్కొన్నారు. ఏ భూమిలో ఏ పంట బాగా పండుతుంది అనే విషయం రైతులకు తెలియజేయాలి.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించాలి అని చెప్పారు. పంట మార్పిడి, పంటల వైవిధ్యత ప్రయోజనాలను వివరించాలి అని పేర్కొన్నారు. యూరియా యాప్‌లో కొంత గందరగోళం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దానిని సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలి అని అధికారులను ఆదేశించారు. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు చూపించాలి అని చెప్పారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలి. పంటలు వేసే మొదలు పంట ఉత్పత్తుల అమ్మకం వరకు సరైన కార్యాచరణ ప్రణాళిక ఉంటేనే ఇబ్బందులు ఎదురుకావు అని చెప్పారు. ఈ విషయంలో ఈ రెండు శాఖలు పరస్పర సహకారంతో ముందుకుసాగాలి... కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో పంటల వైవిధ్యతకు ఉన్న అవకాశాలపై నివేదిక సమర్పించాలి అని ఆదేశించారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తుంది.ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ఏప్రిల్ 16న మండల స్థాయిలో కార్యక్రమం మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక శాఖల వారీగా 10 వివిధ థీమ్ లతో 99 రోజుల కార్యక్రమం 1. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత. ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ 2. ఆరోగ్యం 3. అరైవ్.. అలైవ్ 4. సంక్షేమం 5. పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట 6. రైతు సంక్షేమం.. వ్యవసాయం 7. విద్య 8. యువత.. క్రీడలు 9. మహిళలు 10. పర్యావరణం మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ల సదస్సులో అధికారులతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొత్త బడ్జెట్ రూ.3.20 లక్షల కోట్లు!

- సంక్షేమ, అభివృద్ధికి సమాన నిధులు
- ప్రాధాన్యతా రంగాలకు భారీ కేటాయింపు
- ఇరిగేషన్‌కు రూ.45 వేల కోట్లు
- వ్యవసాయానికి రూ.26,500 కోట్లు
- 2026-27 సమతుల్య బడ్జెట్‌కు రూపకల్పన

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:ఈ నెల 16వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నం దున, 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను తయారు చేసే ప్రక్రియను ఆర్థిక శాఖ వేగవంతం చేసింది. బడ్జెట్లో వ్యయం రూ.3.15 లక్షల కోట్ల నుండి రూ. 3.20 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశం ఉంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యకలాపాలకు సమాన నిధులను కేటాయిస్తూ, ప్రభుత్వం సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. మౌలిక సదుపాయాలను సృష్టించడంపై ప్రధాన దృష్టి ఉంటుంది. అలాగే నీటి పారుదల, వ్యవసాయం తదితర వాటికి నిధులు భారీగా కేటాయింపులు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి నీటిపారుదలకు రూ.80 వేల కోట్ల వరకు బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. అయితే దీన్ని సుమారు రూ.45 వేల కోట్లకు కుదించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పాలమూరు రంగారెడ్డి వంటి ప్రాజెక్టుల పూర్తి, భూసేకరణకు రూ.5 వేల కోట్ల వరకు నిధుల కేటాయింపు చేస్తోంది. అలాగే వ్యవసాయ రంగానికి రూ.26,500 కోట్లు కేటాయింపులు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా రైతు భరోసా, పంట బీమా, రైతు బీమా కోసం గతం కంటే కేటాయింపులు పెంచుతోంది. ఈ బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి రూ.72 వేల కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధికి రూ.32 వేల కోట్లు కేటాయించే వీలున్నట్లు తెలుస్తోంది. అలాగే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించడం, పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడం, గ్రామీణ రోడ్లు, రీజినల్ రింగ్ రోడ్, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర నిర్మాణాలను ప్లాన్ చేస్తున్నందున మౌలిక సదుపాయాలపై కొత్త బడ్జెట్లో ప్రత్యేక దృష్టి సారించింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్, హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినందున, వీటికి కేటాయింపులు గణనీయంగా ఉంటాయని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. గత బడ్జెట్‌లో ప్రభుత్వం మూసీ ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు కేటాయించింది. ఇప్పుడు ప్రభుత్వం మూసీ ప్రాజెక్టు పనులను ప్రారంభించనున్నందున ఈ కేటాయింపులు పెరుగుతాయని భావిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెర వేర్చడానికి నిధులు కేటాయించే అవకాశం ఉంది.వాటిలో ఆరు హామీల కింద పెండింగ్‌లో ఉన్న వాగ్దానాలు, మహిళలకు నెలవారీ రూ.2,500 ఆర్థిక సహాయం, యువ వికాసం మరియు పెన్షన్ మొత్తాన్ని పెంచడం వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులను సమకూర్చుకునేందుకు ఆర్థిక శాఖ యత్నిస్తోంది. మార్కెట్ రుణాలు తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వనుంది. ద్రవ్య లోటు పరిమితిని ఎఫ్ఆర్‌బిఎంలో 3 శాతంగా నిర్ణయించడంతో, అదనపు రుణాలు రాష్ట్ర రుణ నిల్వలు దీర్ఘకాలిక వడ్డీ భారాన్ని తీవ్రంగా పెంచుతాయని అంచనా. మరోపక్క రాష్ట్ర సంస్థల ద్వారా బడ్జెట్ వెలుపల రుణాలు తీసుకునే అవకాశం కూడా ఉంది. పన్నుయేతర ఆదాయాన్ని పెంచడానికి విలువైన భూమి, ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, దీర్ఘకాలిక లీజును వేగవంతం చేయడం ద్వారా ఆస్తుల మోనటైజేషపై బడ్జెట్లో దృష్టిసారించింది.

# చర్చలకు మేం సిద్ధమే.. ఇరాన్

- ఇప్పటికే చాలా ఆలశ్యం అయింది...ట్రంప్
- యుద్ధం మరింత తీవ్రతరం అవుతుందన్న సంకేతాలు



వాషింగ్టన్, మార్చి 3: ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని ముగించాలని మిత్రదేశాలు ఇప్పటికీ కోరుతుంటూ మరోపక్క యుద్ధవిరమణకు అవసరమైన చర్చలు ఇప్పటికే ఆలశ్యం జరిగిందని ట్రంప్ సంకేతాలిచ్చారు. అమెరికా ఇజ్రాయెల్ జాయింట్ వైమానిక దాడులు ఇరాన్ నాయకత్వాన్ని మట్టుపెట్టడంతో ఇరుదేశాలమధ్య ఇపుడు క్షిపణి, బాంబు వైమానిక దాడులు హోరెత్తుతున్నాయి. ఈతరుణంలో ఇరాన్ దౌత్యవేత్తలు చర్చలకు మేం సిద్ధమేనని ప్రకటించారు. అయితే జాతీయ హోదా, దేశ గౌరవానికి ఎక్కడా తగ్గకుండా మాత్రమేచర్చల్లో పాల్గొంటామని స్పష్టంచేసారు. దివంగతనేత సలహాదారు డా. అబ్దుల్ మాజిద్ హాకీమ్ ఇలాహి యుద్ధవిరమణకు చర్చలకు మేం సిద్ధమేనని చెపుతూంటే అమెరికా మాత్రం ఇప్పటికే ఆలశ్యం జరిగిందన్న సంకేతాలు పంపించింది. అంటే యుద్ధం కొనసాగింపుతో పాటు ఇరాన్‌ను మొత్తం ధ్వసంచేయడమే తమలక్ష్యంగా పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ ఇదేవిషయమై ట్రూత్ సోషల్‌మీడియాలో పోస్టుపెడుతూ వారు చర్చలు కోరుకుంటున్నారని, అయితే ఇప్పటికే చాలా ఆలశ్యం అయిందని చెప్పానని పోస్టుచేసారు. ఇరాన్ గల్ఫ్‌దేశాల్లోని చమురు రిఫైనరీలపై దాడులు ముమ్మరం చేయడంతో అమెరికా ఇపుడు అటువైపు కూడా సేనలను పంపిస్తుండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఇరాన్ రక్షణ వ్యవస్థను మొత్తంధ్వంసంచేసామని, వారి నాయకత్వం కూడా ఖతంచేసామని ట్రంప్ పోస్టులో వెల్లడిం చారు. వారి వైమానిక రక్షణ, ఎయిర్‌ఫోర్స్, నావి కాదళం, వారి నాయకత్వం మొత్తం పోయిందని, ఇపుడు వారు చర్చలు కోరుతున్నారని అయితే నేను చాలా ఆలశ్యం అయిందనే చెపుతున్నట్లు పోస్టులో వివరించడంచూస్తుంటే యుద్ధం మరింత తీవ్రతరం అవుతుందని తెలుస్తోంది.

## 3 వారాల్లోగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించండి

### రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి3: ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది.

# ఇస్నాపూర్ మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్‌పై అనర్హత వేటు

పటాన్‌చెరు; మార్చి 03, ప్రభాతవార్త: సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు సంచలనంగా మారాయి. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు అధీకృత ఎన్నికల అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఛైర్మన్ అభ్యర్థిగా నీలం కవిత, వైస్ ఛైర్మన్ అభ్యర్థిగా అల్లంగారి లక్ష్మీ బరిలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అధీకృత విప్ గా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, ఆయా అభ్యర్థులకు అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ కౌన్సిలర్లకు ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఎన్నికల సమయంలో 8వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల మాధవి ఛైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేశారు. అలాగే, వైస్ ఛైర్మన్ ఎన్నికలో పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వకుండా స్వయంగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన విప్ అధీకృత ప్రతినిధి నిర్మలా జగ్గారెడ్డి ఈ నెల 18వ తేదీన లిఖితపూర్వక ఫిర్యాదు చేసి, పట్లోళ్ల మాధవి విప్‌ను ధిక్కరించినట్లు ఎన్నికల అధికారి శ్రీకాంత్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన అధికారి పట్లోళ్ల మాధవికి షోకాజ్ నోటీసు జారీ చేసి, ఆమె సమాధానం స్వీకరించిన అనంతరం అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించారు. మార్చి 2న పట్లోళ్ల మాధవి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి సంగారెడ్డి కలెక్టర్‌కు,రాష్ట్ర ఎన్నికల అధికారికి తగు సమాచార నిమిత్తం తెలియజేశారు. సోమవారం రోజున ఇస్నాపూర్ మున్సిపాలిటీ తొలి సమావేశం నిర్వహించిన మరుసటి రోజే వైస్ ఛైర్ పర్సన్ పైన అనర్హత వేటు పడడంతో ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ విప్ ధిక్కరించడంతో వైస్ ఛైర్ పర్సన్ అనర్హత వేటుపడడంతో కాంగ్రెస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# వైఎస్ జగన్‌ను కలిసిన భట్టి విక్రమార్క

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి3: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తాడేపల్లిలో ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి వేడుకకు రావాలని కోరారు. జగన్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి వధూవరులు నిండైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# సినీనటుడు శివాజీరాజాకు పితృవియోగం

జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్తః సినీనటుడు శివాజీరాజా కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయన తండ్రి జి. రామరాజు(85) మంగళవారం ఉదయం వయోభారం, అనారోగ్య సమస్యతో మధురానగర్‌లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. రామరాజు భౌతిక కాయాన్ని సందర్శనార్థం ఆయన నివాసంలోనే ఉంచారు. మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. శివాజీరాజీ తండ్రి మరణవార్త తెలుసుకొని చిత్రపరిశ్రమకు చెందిన పలువురు నటులు, నిర్మాతలు, రాజకీయ ప్రముకులు తమ సంతాపాన్ని తెలిపారు. సామాజిక మాధ్యమాలు వేదికగా తమ సానుభూతిని ప్రకటించారు.

### టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుపై

# తప్పుడు ప్రచారానికి అడ్డుగట్ట

### గ్యాగ్ ఆర్డర్ ఇచ్చిన హైదరాబాద్ కోర్టు

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మన్ బిఆర్ నాయుడుపై తప్పుడు కథనాలు, మార్ఫింగ్ వీడియోలు ప్రసారం చేస్తున్న కొన్ని ఛానళ్లు, మీడియా సంస్థలకు హైదరాబాద్ కోర్టు అడ్డుగట్ట వేసింది. ఇకముందు ఇటువంటి ప్రసారం చేయకుండా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు గ్యాగ్ ఆర్డర్ ఇస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ తప్పుడు కథనాలను వెంటనే నిలిపి వేయాలని గూగుల్, ట్విట్ట ర్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర డిజిటల్ మీడియాలకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై బిఆర్ నాయుడు కోర్టును ఆశ్రయించగా ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి. ఇదిలావుండగా బిఆర్ నాయుడుపై ప్రసారం అయిన తప్పుడు కథనాల్లో చూపిన మహిళ లక్ష్మీ బార్గవి దీనిపై మంగళవారం నాడు రాజేంద్రనగర్ కో ర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఆపేలా ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇదంతా మా ర్ఫింగ్ వీడియోగా ఆమె తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడాల నుంచి డీఫ్ ఫేక్‌తో సోషల్ మీడియాలో ఈ ప్రచారం చేస్తున్నారని ఆమె వివరించారు. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది.



# గోదావరిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి03: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మల్లేపల్లి పార్కు ఇంటెక్ వెల్ వద్ద మంగళవారం గోదావరిలో దిగి స్నానం చేస్తూ ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. మణుగూరు మండలంలోని పద్మగూడెం గ్రామానికి చెందిన పద్దం ప్రసాద్(35) గుండి నాగేశ్వర రావులు(40) హోలీ పండుగ సందర్భంగా మంగళవారం మల్లేపల్లి పార్క్ వద్ద స్నానానికి గోదావరిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి గోదావరిలో గల్లంతయ్యారు. ఈ విషయాన్ని తోటి మిత్రులు స్థానిక పోలీస్ లకు తెలుపడం తో వెంటనే మణుగూరు సిఐ పాటి నాగబాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వారి కోసం గజ ఈతగాళ్ళు తో పాటు ఫైర్ డిపార్ట్‌మెంట్ వాళ్ళతో కలిసి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతయిన వారిలో పద్దం ప్రసాద్ సింగరేణి ఉద్యోగి కాగా గుండి నాగేశ్వరరావు ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.



# డురాండ్‌లైన్‌లో పాక్ స్థావరాలపై అఫ్ఘాన్ దాడులు

కాబూల్, మార్చి 8: ఆఫ్ఘన్ దళాలు పాకిస్థాన్‌పై దాడులు మరింతగా కొనసాగిస్తున్నాయి. ఆఫ్ఘన్ సరిహద్దుల్లో పౌర నివాసాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపి ప్రాణనష్టం కలిగించడంతో ఆగ్రహించిన తాలిబన్లు ముమ్మరప్రతీకార దాడులుచేసారు. దీనితో సరిహద్దుల్లోని డురాండ్‌లైన్‌వద్ద ఉన్న ఎయిర్‌ఫోర్స్ ఇతర మిలిటరీ స్థావరాలపై తాలిబన్లు దాడులునిర్వహించారు. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్‌ల వెంబడి 2600 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. కాబూల్, ఆలిషెర్ జిల్లా, ఖోస్త్, జలాలాబాద్, కాందహార్‌లను ఈ సరిహద్దు కలుపుతుంది. పాకిస్తాన్ గతనెల 21,22 తేదీల్లో జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులుచేసారు. కాందహార్‌ప్రావిన్స్‌లో భారీ నష్టం జరిగింది.ముందురోజు పాకిస్తానీ సాయుధ ట్యాంకును ధ్వంసంచేసాయి. పాక్టికా ప్రావిన్స్‌లో మిలిటరీ స్థావాలే లక్షనయంగా దాడులుచేసింది. రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇనయతుల్లా ఖౌరాజ్మి మాట్లాడుతూ 100 పాకిస్తానీ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నామని 25 మిలిటరీపోస్టులనుంచి వీరిని తమ అధీనంలోకి తెచ్చినట్లు తెలిపారు. పాకిస్తానీ యుద్ధవిమానాలు బాగ్రామ్ ఎయిర్‌బేస్‌పై దాడికి ప్రయత్నిస్తే ఆఫ్ఘన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు ధ్వంసంచేసాయన్నారు. ప్రస్తుత దాడులు డూరాండ్ లైన్‌వద తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# ఎవరిది ఫైనల్ టికెట్?

**కివీస్ కల నెరవేరుతుందా!**

**ప్రొటీస్ జోరు కొనసాగుతుందా!**

**ఈడెన్‌లో తొలి సెమీస్ పోరు**

**న్యూజిలాండ్ జట్టు(అంచనా)**
టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, డారెల్ మిచెల్, మార్క్ ఛాంప్ మన్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), కోల్ మెకొంచీ, మాట్ హెన్రీ, ఇష్ సోధీ, ఫర్గుసన్




**కోల్‌కతా:**టీ20 ప్రపంచకప్ క్లైమాక్స్‌కు చేరుకుంది. క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సెమీస్ సమరం నేడు మొదలుకానుంది. కోల్‌కతాలోని చారిత్రక ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు మొదటి సెమీఫైనల్లో తలపడనున్నాయి. ఒకవైపు చోకర్స్ ముద్ర పోగొట్టుకోవాలని సౌతాఫ్రికా, మరోవైపు ఐసీసీ టోర్నీల్లో సెమీస్ గండం దాటాలని కివీస్ పట్టుదలతో ఉన్నాయి. ప్రస్తుత టోర్నీలో సౌతాఫ్రికా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయ టీమ్‌గా సెమీస్‌కు వచ్చింది.

మార్‌క్రమ్ సారథ్యంలోని సౌతాఫ్రికా అత్యుత్తమ ఫామ్‌లో ఉంది. మార్‌క్రమ్‌తో పాటు డికాక్, రికల్టన్, మిల్లర్, బ్రేవిస్, స్టబ్స్ పరుగుల వేటలో ఉన్నారు. ముఖ్యంగా వారి బౌలింగ్ విభాగం ప్రత్యర్థి బ్యాటర్లను వణికిస్తోంది.

ఈ సెమీఫైనల్ పోరులో న్యూజిలాండ్‌ను తక్కువ అంచనా వేయలేం. శాంట్నర్ నేతృత్వంలోని బ్లాక్ క్యాప్స్ జట్టులో అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నారు. ఒత్తిడిని జయించి చరిత్రను తిరగరాయడంపై దృష్టిపెట్టారు.

మరోవైపు ఈడెన్ గార్డెన్స్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందనే వార్తల నేపథ్యంలో, ఇరు జట్ల స్పిన్ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనేది ఆసక్తికరంగా మారింది.

### న్యూజిలాండ్ సెమీస్ జర్నీ

సౌతాఫ్రికాకు భిన్నంగా న్యూజిలాండ్ మిశ్రమ ఫలితాలతో సెమీస్‌కు వచ్చింది. సూపర్8 తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా, రెండో మ్యాచ్‌లో అతిథ్య శ్రీలంకపై 61 రన్స్‌తో ఓడించింది. తరువాతి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఘోరంగా ఓడింది. నెట్‌రన్‌తో పాక్‌ను వెనక్కి నెట్టి సెమీస్‌లో ప్రవేశించింది. గ్రూప్ స్టేజ్‌లోనూ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో నెగ్గి న్యూజిలాండ్ సెకండ్ ప్లేస్‌లో నిలిచింది.

### దక్షిణాఫ్రికా సెమీస్ జర్నీ

సూపర్8లో డిపెండింగ్ ఛాంపియన్ టీమిండియాను 76 రన్స్‌తో సౌతాఫ్రికా ఓడించింది. ఆ తర్వాత రెండు సార్లు ఛాంపియన్ వెస్టిండీస్‌పై 9 వికెట్ల తేడాతో, చివరి మ్యాచ్‌లో సంచలనాల జింబాబ్వేపై సునాయస విజయాలతో ముందంజ వేసింది. గ్రూప్‌లో స్టేజ్‌లోనూ ప్రొటీస్‌లు అదరగొట్టారు. గ్రూప్–డిలో ఆడిన 4మ్యాచ్‌ల్లోనూ బంపర్ విజయాలందుకుంది. ఇదేగ్రూప్‌లో ఉన్న న్యూజిలాండ్‌ను 7 వికెట్లతో చిత్తుచేసింది.

**సౌతాఫ్రికా జట్టు(అంచనా)**
మార్‌క్రమ్(కెప్టెన్), క్వింటన్ డికాక్(వికెట్ కీపర్), ర్యాన్ రికల్టన్, డీవాల్డ్ బ్రేవిస్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, జార్జ్ లిండే, కార్బిన్ బాచ్, నాట్జే, క్వెనా మఫాకా, లుంగిడి ఎంగిడి.

### పిచ్ రిపోర్ట్

ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్ ఫ్రెండ్లీగా ఉండనుంది. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 182. స్పిన్నర్లు ప్రభావం చూసే అవకాశం ఉంది. ఈడెన్‌లో 44 వికెట్లు పడితే అందులో 31 వికెట్లు స్పిన్నర్ల ఖాతాలో చేరాయి. పేసర్లు బౌన్స్ రాబట్టవచ్చు. అవుట్ ఫీల్డ్‌లో బంతి వేగంగా కదులుతుంది. దీంతో ఈడెన్‌లో భారీ స్కోర్లు ఖాయం.

### వెదర్ ఫోర్‌కాస్ట్

తొలి సెమీఫైనల్‌కు వేదికైన కోల్‌కతాలో వర్షం పడే అవకాశాలు లేవు. ఉదయం, రాత్రి కూడా పొడి, వేడీ వాతావరణం ఉంటుంది. గాలి తీవ్రత కూడా చాలా తక్కువగా ఉంది.

### హెడ్ టు హెడ్

టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌పై సౌతాఫ్రికా పైచేయిగా ఉంది. ఇరు జట్లు అయిదు సార్లు తలపడగా, అన్ని మ్యాచ్‌ల్లోనూ సౌతాఫ్రికానే విజయం వరించింది. ఈ టీ20 ప్రపంచకప్‌లోనూ లీగ్ స్టేజ్‌లో ఈ రెండు జట్లు తలపడగా, న్యూజిలాండ్‌పై సౌతాఫ్రికా 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సెమీఫైనల్లో సౌతాఫ్రికా ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నా.. సెమీఫైనల్లో ఉండే ఒత్తిడిని అధిగమించే జట్టుకే విజయావకాశాలు ఉంటాయి.

# లక్ష్యసేన్ సంచలనం



## ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్

**బర్మింగ్హామ్:** ఆల్‌ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ తొలి రోజే సంచలనం నమోదైంది. భారత షట్లర్ లక్ష్యసేన్... డిపెండింగ్ ఛాంపియన్, ప్రస్తు ప్రపంచ చాంపియన్ షి యుకి(చైనా)కు షాకిచ్చాడు. తొలి రౌండ్‌లో 23–21, 19–21, 21–17తో గెలుపొంది తరువాతి రౌండ్‌కు చేరుకున్నాడు.

లక్ష్యసేన్, షి యుకి పోటాపోటీగా తలపడ్డారు. తొలి గేమ్ నుంచే లక్ష్యసేన్ ఆధిక్యం చాటాడు. కోర్టులో వేగంగా కదులుతూ చైనాషట్లర్‌కు ముచ్చెమటలు పట్టించాడు. తొలి గేమ్‌ను 23–21తో లక్ష్యసేన్ నెగ్గగా, షి యుకి రెండోగేమ్ నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఫలితం తేల్చే మూడో గేమ్‌లో లక్ష్యసేన్ పదునైన స్మాష్‌లు, తెలివైన ప్లేసింగ్‌లతో విజయం అందుకున్నాడు. 2022లో ఫైనల్‌కు, 2024లో సెమీస్‌కు చేరుకున్న లక్ష్యసేన్.. ఈసారి టాప్‌సీడ్‌పై గెలుపుతో ఆల్ ఇంగ్లాండ్‌ను గ్రాండ్‌గా ఆరంభించాడు. ఇక మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత షట్లర్లకు నిరాశజనక ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్‌లో మాల్విక బన్సోద్ 11–21, 6–21తో అలవోకగా చైనా షట్లర్ చెన్ యుఫీ చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధృవ్ కపిల, తనిషాపై 21–17, 21–19తో మలేషియా జోడీ కూడా సునాయాసంగా గెలుపొందింది.

### స్వదేశానికి చేరుకున్న పీవీ సింధూ

దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధూ ఎట్టకేలకు స్వదేశానికి చేరుకున్నారు. మంగళవారం బెంగళూరు విమానాశ్రయంలో దిగారు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధూ.. అమెరికా– ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయింది. స్వదేశానికి తిరిగిరావడంతో సింధూ ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌కు దూరమైంది.

# ఫీఫా ప్రపంచకప్ : వైదొలిగిన ఇరాన్

**టెహ్రాన్:** ఫిఫా ప్రపంచకప్2026 టోర్నీ నుంచి ఇరాన్ వైదొలిగింది. అమెరికాలో మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్న నేపథ్యంలో టోర్నీనే బహిష్కరించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఇరాన్ ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు మెహదీ తాజ్ స్పష్టం చేశాడు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచకప్ కోసం ఎదురుచూసేందుకు ఏమాత్రం వీల్లేదని మెహదీ తాజ్ అన్నాడు. ఈ ఏడాది జూన్‌లో అమెరికా, మెక్సికో, కెనడాలలో ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ జరుగనుంది. గ్రూప్–జిలో బెల్జియం, న్యూజిలాండ్, ఈజిప్ట్‌లతో ఇరాన్ ఉంది. పస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్న ఇరాన్ జట్టు ఏడోసారి ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందింది. జూన్ 15న కాలిఫోర్నియాలో న్యూజిలాండ్‌తో, జూన్ 21న కాలిఫోర్నియాలోనే బెల్జియంతో, జూన్ 26న సియాటెల్‌లో ఈజిప్ట్‌తో ఆడాల్సి ఉంది. అయితే ఇరాన్ ఫీఫీ ప్రపంచకప్‌లో ఆరుసార్లు కూడా గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించింది.

# హెచ్‌సీఏలో అవినీతి: క్రికెట్ సంఘాల ధర్నా

**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మరోసారి వార్తల్లో ఎక్కింది. విశాఖ కంపెనీకి 70 కోట్ల చెల్లింపులు జరిగాయన్న అంశం వివాదాస్పదంగా మారింది. దీనిపై క్రికెట్ సంఘాలు మండిపడుతున్నాయి. జింఖానా గ్రౌండ్‌లో ఒకవైపు హెచ్‌సీఏ మీడియా సమావేశం జరుగుతుండగానే క్రికెట్ సంఘాలు మెరుపు ధర్నాకు దిగాయి. నిధులు తప్పుదోవ పట్టించారని ఆందోళన చేపట్టాయి. మంత్రి వివేక్‌కు చెందిన విశాఖ ఇండస్ట్రీస్ కి 70 కోట్లు అక్రమంగా చెల్లించారని ఆరోపణలు చేశారు. మంత్రి ఆదేశాల మేరకే హెచ్‌సీఏ పెద్దలు 70 కోట్లు విడుదల చేశారని క్రికెట్ సంఘాల ఆరోపించాయి.




### ఆరోపణల్లో వాస్తవం లేదు–అమర్‌నాథ్

క్రికెట్ సంఘాల ఆరోపణల్లో వాస్తవం లేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్ స్పష్టం చేశారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎలాంటి చెక్కులపై సంతకాలు పెట్టలేదని తెలిపారు. ఆ చెల్లింపుల ప్రాసెస్ తాను ఛార్జ్ తీసుకోకముందే జరిగిందన్నారు. డబ్బులు చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని వెల్లడించారు.

# ప్రాగ్ చెస్
# బోణీ కొట్టని గుకేష్

**ప్రాగ్:** ప్రపంచ ఛాంపియన్ గుకేష్.. ప్రాగ్ చెస్ ఫెస్టివల్‌లో తన మొదటి విజయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన గుకేష్... ఐదు రౌండ్లలో కేవలం 1.5 పాయింట్లతో ఉన్నాడు. అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో గుకేశ్ 69 ఎత్తుల్లో ఓడిపోయాడు. మూడు గేమ్‌లు డ్రాగా ముగించగా, మరో రెండు గేమ్‌ల్లో పరాజయాలు ఎదురయ్యాయి. భారత్‌కే చెందిన అరవింద్ చిదంబరంతో ఆరవ రౌండ్‌లో తలపడనున్నాడు. ఈ రౌండ్‌లోనైనా గెలవాలన్న పట్టుదలతో సిద్ధమయ్యాడు. నాలుగు విజయాలు, ఒక ఓటమితో వాక్లావ్ ఫినెక్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

# ఐసిసి రిజర్వ్‌డే ప్లాన్




**ముంబై:** టీ20 వరల్డ్ కప్ 2026 ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితమైన నాకౌట్ దశకు చేరుకుంది. లీగ్ దశ, సూపర్8 గండాలను దాటుకుని నాలుగు జట్లు సెమీస్ స్టేజ్‌కు వచ్చాయి. ఇక ఇక్కడి నుంచి జరిగే ప్రతి మ్యాచ్ ఒక యుద్ధమే. ఓడితే ఇంటికి.. గెలిస్తే ఫైనల్‌కు.

వర్షం వల్ల మ్యాచ్‌లు ఆగిపోతే అభిమానులు నిరాశ చెందకుండా ఉండేందుకు ఐసీసీ ఈసారి రిజర్వ్ డే సౌకర్యాన్ని కల్పించింది. ఒకవేళ నేటి మొదటి సెమీఫైనల్ వర్షం కారణంగా పూర్తవ్వకపోతే, ఆ మ్యాచ్‌ను మరుసటి రోజుకు మారుస్తారు. అలాగే రేపు జరగాల్సిన రెండో సెమీఫైనల్‌కు కూడా ఇలాంటి నిబంధనే వర్తిస్తుంది. అయితే ఇక్కడే ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉంది. మొదటి సెమీఫైనల్ వర్షం వల్ల వాయిదా పడితే, మార్చి 5వ తేదీన ఒకే రోజు రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

షెడ్యూల్ ప్రకారం మార్చి 5న భారత్‌ఇంగ్లాండ్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కావాలి. ఒకవేళ మొదటి సెమీఫైనల్ రిజర్వ్ డేకి మారితే, దానిని మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభిస్తారు. తద్వారా క్రికెట్ ప్రేమికులు ఒకే రోజు రెండు హైవోల్టేజ్ మ్యాచులను చూసే ఛాన్స్ దక్కుతుంది. మ్యాచ్ ఫలితం తేలడానికి ఐసీసీ అదనపు సమయాన్ని కూడా కేటాయించింది. కేవలం సెమీఫైనల్ మాత్రమే కాదు, మార్చి 8న జరిగే గ్రాండ్ ఫైనల్‌కు కూడా ఇలాంటి నిబంధనలే వర్తిస్తాయి.


ఒకవేళ సెమీఫైనల్ మ్యాచ్ రిజర్వ్ డే రోజు కూడా వర్షం వల్ల పూర్తిగా రద్దయితే...సూపర్8 దశలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది.

**వాణిజ్యం**

# మార్కెట్లకు హోలీ సెలవు!




**ముంబయి, మార్చి 3:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాల జరుపుతున్న దాడులు ఒకవైపు మరోవైపు పండుగ వాతావరణంలో స్టాక్ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లలో ట్రేడింగ్ మూతపడింది. బాంబే స్టాక్ ఎక్స్చేంజి, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజిలతోపాటు ఫ్యూచర్ మార్కెట్లు, కరెన్సీ కమోడిటీ మార్కెట్లు కూడా పండుగ సెలవుతో మూతపడ్డాయి. ఇక గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులతో దుబాయి,అబూదాబిల్లో రెరెండురోజులనుంచి స్టాక్ మార్కెట్లు మూతపడ్డాయి. కార్పొరేట్ ఇన్వెస్టర్లు ప్రస్తుత పరిస్థితిని గమనిస్తూ పెట్టుబడులపై అప్రమత్తంగా ఉన్నాయి. అంతేకాకుండా తమ పోర్టుఫోలియోలను పునఃసమీక్ష చేసుకుంటున్నారు. గల్ఫ్‌దేశాలపై దాడులవల్ల మార్కెట్లు కోలుకోడానికి కనీసం రెండుమూడు త్రైమాసికాలు పడుతుందని ట్రేడింగ్‌నిపుణులు చెపుతున్నారు. ఇపుడు గల్ఫ్‌దేశాల్లో బ్యాంకులు కూడా అప్రమత్తంగా ఉన్నాయి. భారత్‌లో మాత్రం హోలీ పండుగ కావడంతో స్టాక్ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు, ఫండ్ మార్కెట్లు మొత్తం మూతపడ్డాయి.







## పశ్చిమాసియా ఉద్రిక్తతలతో
# విదేశీ బ్యాంకుల రుణ రికవరీ సంక్లిష్టం

**ముంబయి, మార్చి 3:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఆసియా బ్యాంకులు ఇచ్చిన రుణాల రికవరీలు ఇపుడు సమస్యాత్మకం అవుతున్నాయి. ఆసియా, చైనా బ్యాంకులు గల్ఫ్ దేశాలకు అత్యధికంగా రుణాలచ్చాయి. గత ఏడాది 15 బిలియన్ డాలర్లవరకూ రుణాలు ఇచ్చాయి. ఎక్కువశాతం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకే ఈ రుణాలు వెళ్లాయి. ఈ పెరుగుదల ఇపుడు ఇరాన్ సంక్షోభంతో సమస్యాత్మకంగా మారింది. సౌదీ అరేబియా రెండు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక పరివర్తన ప్యాకేజి, యుఎఇ ప్రతిష్టాత్మకమైన మౌలికవనరుల వృద్ధి ప్యాకేజి వంటివి ఎక్కువగా విదేశీ మూలధన వనరులపైనే ఆధారపడిఉన్నాయి. అయితేప్రస్తుతం ఈ భారీ బ్యాంకులన్నీ కూడా వేచిచూసేధోరణిలో ఉన్నాయి. గల్ఫ్ రుణాలు తీసుకున్న బకాయిదారులపై ఒత్తిడి పెంచకుండా యుద్ధవాతావరణం ముగిసేవరకూ వేచిచూడాలని భావిస్తున్నాయి ఇకపోతే అబూదాబి నేషనల్ ఆయిల్‌కంపెనీ జారీ చేసేందుకు తలపెట్టిన యువాన్ ఆధారిత బాండ్ల జారీని నిలిపివేసింది. 14బిలియన్‌యువాన్లు అంటే డాలర్లలో రెండు బిలియన్ డాలర్ల బాండ్లజారీకూడా నిలిపివేసింది. చైనా ఇన్వెస్టర్లనుంచి కొన్ని బిలియన్ డాలర్ల రుణాలను కూడా గల్ఫ్ ఫైనాన్షియల్ సంస్థ రాబట్టింది. అయితే యుద్ధంతంఒ ఈ డీల్‌ప్రస్తుతం పెండింగ్‌లోపడినట్లు అంచనా. చైనా బ్యాంకు కేంద్ర కార్యాలయాలు వీటిని ఆమోదించేందుకు వెనుకంజవేస్తున్నాయి. అందువల్లనే ఇపుడు ఇన్వెస్టర్లుకూడా రుణాల జారీకంటే బాండ్లజారీ, బంగారం,వెండిపై పెట్టుబడులకే మొగ్గుచూపిస్తున్నారు.

## 60% చమురు దిగుమతి
# ఇతర మార్గాల్లోనే!

**25 రోజులకు సరిపడా చమురు నిల్వలు**



**న్యూఢిల్లీ, మార్చి 3:** ఇరాన్ పరిధిలోని హార్మూజ్ జలసంధిని మూసివేయడం వల్ల భారత్‌కు చమురు కొరత అనేది ఉండదని, ప్రత్యామ్నాయ మార్గాల్లోనే 60శాతం వరకూ చమురు భారత్‌కు దిగుమతి అవుతున్నదని ఆయిల్ కంపెనీలు చెపుతున్నాయి. హార్మూజ్‌జలసంధినుంచి వచ్చే చమురు కంటే 60శాతం ఇతర మార్గాల్లోనే వస్తోందని భారత్ అధికారులు సైతం చెపుతున్నారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు,యుద్ధ వాతావరణం, క్షిపణి దాడులు వంటి వాటితో ఇరాన్ ముందునుంచే జలసందినిమూసివేసింది. అయినా కూడా భారత్‌కు 25 రోజులకు సరిపడే చమురు నిల్వలున్నట్లు ఆయిల్‌కంపెనీలు చెపుతున్నాయి. హార్మూజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్ దాటిరావాలని భావిస్తే పేల్చివేస్తామని కూడా ప్రకటించింది. దీనితో వందలాది నౌకలు ఈ జలసంధి జలాల్లోనే నిలిచిపోయి ఉన్నాయి. ఎల్పీజీ, ఎల్ఎన్‌జి నౌకలు కూడా ఇక్కడే నిలిచిపోయాయి. అమెరికాను, గల్ఫ్‌దేశాలను దృష్టిలో ఉంచుకునే ఇరాన్ ఈ చర్యకు దిగినా ఇతర దేశాల చమురు అవసరాలపై బ్రేక్‌పడుతోంది. ప్రత్యేకించి చైనాకు దిగుమతులు కూడా నిలిచిపోయాయి. 40 శాతం చమురు సరఫరా మాత్రమే ఈ కారిడార్‌గుండా వస్తోందని, 60శాతం ఇతర మార్గాల్లో వస్తున్నట్లు ఇంధనశాఖ వర్గాలు చెపుతున్నాయి. మొత్తంగా హార్మూజ్ మూసివేత భారత్‌కు ఎంతమాత్రం చమురు కొరతను తీసుకురాదని భారత్ ధీమా వ్యక్తంచేస్తోంది.

# ఐటిరంగంలో జాబ్‌మార్కెట్ 12% వృద్ధి

**న్యూఢిల్లీ, మార్చి 3:** భారత్ వైట్‌కాలర్‌జాబ్‌మార్కెట్ గతనెలలో 12% వృద్ధిని నమోదు చేసింది. ఎఐ నైపుణ్యాలున్నవారికి ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయి. ప్రత్యేకించి ఐటిరంగంలోనే ఈ వృద్ధి ఎక్కువ కనిపిస్తున్నట్లు అంచనా. నౌకరీ జాబ్‌స్పీక్ సూచీ ప్రకారంచూస్తే 12శాతంపెరిగింది. నెలవారీగా చూస్తే మరింతగా వృద్ధికనిపిస్తోంది. ఐటిరంగంలో ఆరుశాతం వార్షికవృద్ధినమోదుచేసింది. కొత్త ఉద్యోగార్థుల నియామకాలు కూడా 8శాతంవరకూ పెరిగినట్లునౌకరీ తెలిపింది. భారత్ ఆధారిత బహుళజాతి ఐటి కంపెనీలు 55శాతం నియామకాలను పెంచుకున్నాయి. ఎఐ, మెషిన్ లెరిననంగ్ నైపు ణ్యాలు న్నవారికి ఐటిరం గంలో 40శాతం పెరిగా యి. వార్షిక పద్ధతిలోచూస్తే 17శాతం వరకూ ఉన్నా యి. సగటు వార్షిఖ వేతనం 20లక్షలుగా ఉంది. ఈ నియామకాలు 23శాతంవరకూ పెరిగినట్లు తేలింది. ఐటియేతర రంగాల్లోకూడా పెరిగాయి. బీమారంగంలో 28శాతం, బిపిఒ ఐటిఆధారితసేతలు 22శాతం, రియల్‌ఎస్టేట్ 19శాతం, ఆతిథ్యం పర్యాటకం 15శాతం, రిటైల్‌రంగంలో 14శాతంవరకూ పెరిగినట్లు తేలింది. ఫిబ్రవరిలో భారత బహుళజాతిసంస్థల్లో నియామకాలు 24శాతం పెంచాయి. వీటిలో ఎఐ,మెషిన్ లెర్నింగ్ నియామకాలు 82శాతంపెరిగాయి. విదేశీ కంపెనీలు అయితే 43శాతం మాత్రమే ఉన్నట్లు తేలింది. ఐటిలో నియామకాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఎంఎన్‌సిలు ఎఐ ప్రతిభావంతులపై పెట్టుబడులు పెంచుతున్నాయి.







# 1.14 లక్షల స్టార్టప్‌లలో 12 లక్షల కొలువులు!

## ఆర్థిక వ్యవహారాల విభాగం నివేదిక

**న్యూఢిల్లీ, మార్చి 3:** దేశంలోని 1.14 లక్షల స్టార్టప్‌లలో ఇప్పటివరకూ 12 లక్షల ఉద్యోగాలను సృష్టించాయని ఆర్థిక మంత్రిత్వశాఖ నివేదిక విడుదలచేసింది. ఆర్థిక వ్యవహారాల విభాగం విడుదలచేసిన నివేదికలో దేశం మొత్తంగా 1.14 లక్షల స్టార్టప్‌లు స్టార్టప్ ఇండియా కార్యాచరణను అనుసరించాయని, 12 లక్షల ఉద్యోగాలు సృష్టించాయని చెప్పారు. డిజిటల్ కామర్స్ ఓపెన్ నెట్‌వర్క్ 2023 నవంబరువరకూ 63 లక్షల లావాదేవీలునిర్వహించింద. ఇ ప్రపంచ వ్యాప్తంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ఐపిఒలు, చట్టపరమైన మార్పులు, స్థూల ఆర్థిక వ్యవస్థ ధోరణులు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటివి ఉన్నప్పటికీ భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద టెక్‌స్టార్టప్ ఎకో వ్యవస్థ ఉన్న దేశంగా నిలిచింది.

950 టెక్ స్టార్టప్‌లు ఒక్క గత ఏడాదిలోనే ఆరంభం అయ్యాయి. 31వేల టెక్ స్టార్టప్‌ల ఫండింగ్ 70 బిలియన్ డాలర్లవరకూ పెంచుకున్నట్లునాస్కామ్ వెల్లడించింది. రెండు,మూడోశ్రేణి నగరాల్లో కూడా స్టార్టప్‌లు తమ పరిధిని విస్తరించాయని ఆర్థికవ్యవహారాల విభాగం అంచనావేసింది. డీప్‌టెక్ పెట్టుబడులు కూడా పెరిగాయి. ఎఐ, జెన్‌ఎఐ స్టార్టప్‌ల పెట్టుబడులు 70శాతం వరకూ స్టార్టప్‌లలోనే ఉన్నాయి. కృత్రిమమేధ పరిష్కారాలకే స్టార్టప్‌లు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాయి.



# ఇరాన్‌పై వార్‌తో టెక్స్‌టైల్ ఎగుమతులకు విఘాతం

## సందిగ్ధంలో రూ.1500 కోట్ల ఎగుమతులు

**చెన్నై, మార్చి 3:** భారత్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రస్తుత పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో చిక్కుకుంది. ఇజ్రాయెల్, అమెరికా వైమానిక దాడులు ముమ్మరంచేయడంతో భారత్‌నుంచి అయ్యే ఎగుమతులు,దుస్తులు, రెడీమేడ్ ఉత్పత్తులకు విఘాతం కలిగింది. యుఎఇకి రూ.5వేలకోట్లవరకూ ఎగుమతులు సాగుతాయి. మరో రూ.1500 కోట్లు పశ్చిమాసియా దేశాలకు వెళతాయి. తిరుప్పూర్ ఒక్కటే షిప్‌మెంట్లలో నెలకకు రూ.450 నుంచి 500 కోట్లవరకూ పశ్చిమాసియా దేశాలకు వెళతాయి. వస్త్రపరిశ్రమ, రెడీమేడ్ గార్మెంట్స్ ఎగుమతుల్లో పశ్చిమాసియా భారత్‌కు గ్లోబల్‌ట్రేడ్ పాయింట్ వంటిదని వస్త్ర ఎగుమతిదారులు చెపుతున్నారు. ఖతార్, కువైట్ గగన తలాలు మూసివేయడంతో వైమాపిక మార్గాల్లో రవాణా వ్యయాలుకూడా పెరిగాయి. న్యూరాఫ్యాబ్రిక్‌ను ఇరాన్‌కు ఎగుమతిచేస్తారు. యుద్ధం కారణంగా ఈ ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. దీనికితోడు చమురు సరఫరా విఘాతం కలగడంతో పాలిస్టర్ యార్న్ ఉత్పత్తికి విఘాతం కలుగుతోంది. ఇపుడు యుద్ధం కారణంగా ఆఫ్రికా, యూరోప్, కెనడా, ఉతనతర అమెరికా దేశాలకు ఎగుమతులపై ఎఫెక్ట్ పడిందని చెపుతున్నారు. 40శాతం మా ఎగుమతులు పశ్చిమాసియా ద్వారానే వెళతాయని, విదేశీ కరెన్సీ మార్పిడిరేటు కూడా డాలరుకు 110గా మారుతున్నదని దీనివల్ల డాలర్ రిజర్వులపై ఒత్తిడిపెరుగుతున్నదని చెపుతున్నారు. వాణిజ్యంలో అనిశ్చితి 15 నుంచి 20శాతంవరకూ పెరిగిందని ఎగుమతి దారుల అంచనా. ఇపుడు షిప్పింగ్‌కంపెనీలు కూడా రవాణా ఛార్జిలు పెంచేసాయి. కంటైనర్‌కు 1500 డాలర్లనుంచి రెండువేల డాలర్లకు పెంచాయి. అంతకుముందు 200 నుంచి 250 డాలర్లుగామాత్రమే ఉండేది. కొన్ని కంపెనీలయితే మూడువేల డాలర్లుకూడా కంటైనర్‌కు ఛార్జిచేస్తున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.